అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 19-01-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 330 | Published from Khammam, Rangareddy, Hyderabad,Karimnagar | 12 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



కేజ్రీవాల్ కారుపై దాడి





రాళ్లు రువ్వి..ఇటుకలు

విసిరి అడ్డుకునే యత్నం

బీజేపీ గూండాల పనే : ఆప్

వివరాలు 11లో

సంజయ్ రాయ్ దోషి

ఆర్‌జి కర్ ఆస్పత్రి కేసులో వెలువడిన తీర్పు

20న శిక్ష విధిస్తానన్న న్యాయమూర్తి

కన్నీటిపర్యంతమైన బాధితురాలి తల్లిదండ్రులు

మిగిలిన వారి సంగతేంటి : బాధితురాలి తల్లి



వివరాలు 11లో

అపరిమిత నిఘా అధికారాలు

కీలక వ్యక్తిగత సమాచారం కూడా..!

ఆందోళన కలిగిస్తున్న ముసాయిదా నిబంధనలు

అమలు, పారదర్శకతపై సందేహాలు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఈ నెల 3న వ్యక్తిగత సమాచార రక్షణకు సంబంధించి విడుదల చేసిన ముసాయిదా నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి అపరిమిత నిఘా అధికారాలు సంక్రమిస్తాయి. ఈ నిబంధనలను సమాచార రక్షణ కోసమే ఉద్దేశించినప్పటికీ అమలు, పారదర్శకత విషయంలో సందేహాలు తలెత్తుతున్నాయి. 2023లో ప్రభుత్వం డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులోని సెక్షన్ 36 ప్రకారం ప్రభుత్వం వ్యక్తిగత సమాచారాన్ని కోరవచ్చు. ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలకు రూల్ 22 మరింత పదును పెట్టింది. దీని ప్రకారం వ్యక్తుల అనుమతి పొందకుండానే కంపెనీల నుండి కీలకమైన వ్యక్తిగత సమాచారాన్ని కోరే హక్కు కేంద్రానికి దఖలు పడుతుంది.

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతా ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత సమాచారాన్ని కోరవచ్చునని నిబంధనలు చెబుతున్నాయి. ఎలాంటి పరిమితులు లేకుండా, స్పష్టత లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యక్తుల సమాచారాన్ని తీసుకునేందుకు ఇవి వీలుకల్పిస్తాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించుకోవచ్చు. అందుకోసం ప్రభుత్వం నియమించిన అధికారులు ఎలాంటి అభ్యర్థనలు, లిఖితపూర్వక విజ్ఞాపనలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నియమించే ఏజెంట్లు తమ ఇష్టానుసారం వ్యక్తుల కీలక సమాచారాన్ని డిమాండ్ చేయవచ్చు. అయితే ఇది ప్రజలకు ఉన్న గోప్యత హక్కును హరిస్తుందని, అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఏదైనా సమాచారం దేశ భద్రత, సార్వభౌమత్వానికి భంగకరమని ప్రభుత్వం భావిస్తే దానిని ప్రభుత్వం బయటపెట్టాల్సిన అవసరం లేదని రూల్ 22 చెబుతోంది. ఏదైనా సమాచారాన్ని కోరాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉన్నదా లేదా అలా కోరడం చట్టబద్ధమేనా అని పరిశీలించే యంత్రాంగం ఏదీ ఉండదు. కాబట్టి ప్రభుత్వం ఏకపక్షంగానే నిర్ణయాలు తీసుకోవచ్చు. అవసరానికి మించిన సమాచారాన్ని సైతం ప్రభుత్వం సేకరించవచ్చు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని కోరినప్పుడు దానిని సవాలు చేసేందుకు వ్యవస్థ అంటూ ఏదీ ఉండదు.

కొత్త ప్రాజెక్టులపై ఆసక్తి

సింగపూర్ వాణిజ్య శాఖమంత్రితో సీఎం రేవంత్ భేటీ

ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవంపై చర్చ

శాస్త్ర సాంకేతిక రంగాల్లో కలిసి పని చేసేందుకు అంగీకారం




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రతినిధి బృందం ఆ దేశ వాణిజ్య, పర్యావరణ శాఖ మంత్రి గ్రేస్ ఫు హై యిన్‌తో శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యంపై ఈ సందర్భంగా ఆ బృందం చర్చలు జరిపింది. నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలు, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్న అనుకూలతలను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వారికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ సానుకూలంగా స్పందించారు. వివిధ రంగాల లక్ష్య సాధనలో భాగస్వామ్యం పంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిరవృద్ధి ప్రణాళికలపై ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు. ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను గుర్తించాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవాలనీ, దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణలో సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టుల కార్యాచరణ వేగవంతం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

రూ.3,500 కోట్లతో ఎస్‌టీటీ డేటా సెంటర్ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో సింగపూర్ కంపెనీతో ఒప్పందం

రాష్ట్రంలో రూ.3,500 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రముఖ సింగపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ ఎస్‌టీటీ ముందుకొచ్చింది. ఆ దేశ పర్యటనలో ఉన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమక్షంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్‌లోని ఎస్‌టీటీ డాటా సెంటర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంవోయూపై ఎస్‌టీటీ సీఈవో బ్రూనో సంతకాలు చేశారు. ఇప్పటికే హైదరాబాద్ హైటెక్ సిటీలో ఓ డాటా సెంటర్ నిర్వహిస్తోన్న ఎస్‌టీటీ, ముచ్చర్ల మీర్‌ఖాన్‌పేట్‌లో మరో డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. తెలంగాణ ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలు, అంకితభావం, సాంకేతిక ఆవిష్కరణ, సహకారం ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేందుకు ఎంతగానో ...11లో

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరు



స్వతంత్ర బలం పెంచుకోవడంపై నిర్ణయాలు

వామపక్షాల బలోపేతంపై కూడా చర్చ

వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ విధానాన్ని కాపాడుతాం

అఖిల భారత మహాసభలో రాజకీయ ఎత్తుగడల పంథా : సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

వివరాలు 3లో

ఇన్ఫోసిస్‌కు షాక్



మూర్తి కుటుంబ సంపద

రూ.1900 కోట్లు ఫట్

ఇన్ఫి షేర్ ఆరుశాతం పతనం..

వివరాలు 11లో

అంతా అదానీ గ్రూపు కనుసన్నల్లోనే..

ప్రశ్నించేవారి ముందస్తు అరెస్టులు



పోలీస్ బలగాల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ

ముగిసిన అంబుజా పబ్లిక్ హియరింగ్

సీపీఐ(ఎం) ప్రజాసంఘాల నాయకుల అరెస్ట్, విడుదల

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజల అభిప్రాయాల మేరకు కంపెనీని ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ.. యాజమాన్యం ప్రభుత్వం, అధికారం, పోలీసుల మద్దతుతో ప్రజాభిప్రాయ సేకరణను తమకు అనుకూలంగా మార్చుకుంది. అంతేకాక తమకు అనుకూలంగా ...2లో


బ్యాంక్ అధికారుల వేధింపులకు రైతు బలి

బ్యాంక్‌లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య

కుటుంబీకుల ఆందోళన

న్యాయం చేయాలని డిమాండ్

బ్యాంకు వద్ద పోలీసుల భారీ బందోబస్తు



వివరాలు 11లో

దళితులకు మొండిచెయ్యే!

అమలుకు నోచుకోని చేవెళ్ల డిక్లరేషన్

బీఆర్ఎస్ తోవలో కాంగ్రెస్ ప్రభుత్వం

మాయ మాటలతో కాలయాపన

పథకాల పట్ల స్పష్టత నిల్

స్వయం ఉపాధి ఊసెత్తని వైనం

దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యం

నికరంగా పోరాడుతున్న కేవీపీఎస్

దాని ఫలితమే సబ్‌ప్లాన్ చట్టం





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముందు దగా, వెనుక దగా, కుడిఎడమల దగా దగా అన్నట్టు దళితుల పట్ల పాలకుల మోసం సాగుతూనే ఉంది. వారు వంచనకు గురవుతూనే ఉన్నారు. సంక్షేమ పథకాల పేరుతో మాయ. వాటి అమలులో నిర్లక్ష్యం. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, దళిత బంధు, తదితర పథకాల పేర గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను మోసం చేసింది. మరో పక్క దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయి. అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు కాంగ్రెస్ సర్కార్ కూడా అదే తోవలో పయనిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించి దాని అమలు పట్ల రేవంత్ సర్కారు మీన మేషాలు లెక్కిస్తున్నదని దళిత సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కుల వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, గ్రామ బహిష్కరణలు నిత్యకృత్యంగా సాగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నది. పోరాటాల ఫలితంగా కొన్ని విజయాలను కూడా సాధించింది.

పోరాటాల ఫలితమే సబ్ ప్లాన్ చట్టం..

రాష్ట్ర జనాభాలో 15.45 శాతం ఎస్సీలున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ...3లో

రాజ్యాంగ రక్షణకు ఉద్యమాలు

- జాన్ వెస్లీ (కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు)



బీజేపీ ఏలుబడిలో రాజ్యాంగానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. దాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యకత ప్రజాస్వామిక, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతోపాటు దళితులపై కూడా ఉందనే విషయాన్ని గుర్తించాలి. ప్రజల్ని చీలకలు, పేలికలు చేసి పాలించటం దాని నైజం. అందుకు ఊతమిచ్చేలా దళిత ఉద్యమాలు ఉండకూడదు. ఈ పెనుప్రమాదాన్ని గమనించటం అవసరం. హిందూ మతం ముసుగులో మనువాదాన్ని అమలు చేసే తీరును పసిగట్టి ఎండగట్టాలి. ప్రభుత్వ ...3లో



సైఫ్‌పై దాడి కేసు నిందితుడు చిక్కాడు

- ఛత్తీస్‌గఢ్‌లో పట్టుకున్న రైల్వేపోలీసులు



ముంబయి: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో అతడిని గుర్తించిన రైల్వే పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా నిందితుడిని పట్టుకుని, వీడియో కాల్ ద్వారా ముంబయి పోలీసులతో మాట్లాడి, అతడేనని ధ్రువీకరించుకున్నారు. రైల్వే పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని తీసుకొచ్చేందుకు ముంబయి పోలీసులు బయలుదేరి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్నారు.

గురువారం సైఫ్‌పై ఈ దాడి ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు చోరీకి యత్నించాడు. సైఫ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా దాడి చేసి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ముంబయి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఆయన సైఫ్ అని తెలీదు : ఆటో డ్రైవర్



తన ఆటోలో లీలావతి ఆస్పత్రికి తరలించిన వ్యక్తి బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ అనే విషయం తనకు తెలియదని డ్రైవర్ భజన్ సింగ్ చెప్పారు. ఖర్ (ఈస్ట్)లోని పైప్‌లైన్ రోడ్డులో ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న భజన్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ రక్తస్రావంతో గాయపడిన వ్యక్తిని దగ్గరి దారిలో ఆస్పత్రికి తీసికెళ్లి ప్రాణాలు కాపాడేలా చేయాలన్నదే తన ఆలోచన అని, ఆయన ఓ సెలబ్రిటీ అనే విషయం తనకు అప్పుడు తెలియదని చెప్పారు. ఆటోలో సైఫ్ స్పృహలోనే ఉన్నారని, ఆస్పత్రికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందని పదే పదే ప్రశ్నించారని తెలిపారు. 'రెండు నిమిషాలు పడుతుందని నేను చెప్పాను. సైఫ్ వెంట ఆయన కుమారుడు తైమూర్, సహాయకుడు హరి ఉన్నారు. ఆయన భయపడడం లేదు. అయితే ఆయన బట్టలన్నీ రక్తంతో తడిసిపోయాయి. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి బాలీవుడ్ నటుడని మొదట్లో నాకు తెలీదు. సాధ్యమైనంత త్వరగా లీలావతి ఆస్పత్రికి చేరుకోవాలన్నదే నా లక్ష్యం. వారు అలాంటి అత్యవసర పరిస్థితిలో ఉన్నారు. ఆటో కిరాయి అడగకుండా నన్ను అడ్డుకున్నారు కూడా. వాస్తవమేమంటే...అలాంటి పెద్ద నటుడు నా వాహనంలో కూర్చోవడమే నాకు పెద్ద సంతృప్తి' అని భజన్ సింగ్ వివరించారు.

అంతా అదానీ గ్రూపు కనుసన్నల్లోనే..

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న వారిని మాత్రమే అభిప్రాయ సేకరణకు ఆహ్వానించి వారితో సమ్మత జపం చేయించుకుంది. ప్రశ్నించేందుకు సిద్ధమైన సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్లోనే ఉంచారు. ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి అయ్యేవరకు వారిని స్టేషన్లో ఉంచి ఆ తర్వాత విడుదల చేశారు. వందలాది మంది పోలీసు బందోబస్తు నడుమ ప్రజాభిప్రాయ సేకరణ చేసి ప్రశాంతంగా ముగిసిందని ప్రకటించుకున్నారు.

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని గణేష్‌పాడు వద్ద గల పెన్నా సిమెంట్ (అంబుజా) కంపెనీ గనుల విస్తరణ, సున్నపురాయి ఉత్పత్తి పెంపుపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. 2002లో పెన్నా సిమెంట్స్‌ను నెలకొల్పగా నాలుగు నెలల కిందట ఈ ప్లాంట్‌ను అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. అనధికారికంగా గనుల విస్తరణ జరిగినప్పటికీ వివిధ కారణాల వల్ల పీసీబీ ప్రజాభిప్రాయ సేకరణను రెండుసార్లు వాయిదా వేశారు. ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో పరిశ్రమ సమీపంలో అధికారులు సమావేశాన్ని నిర్వహించి ప్రజల అభిప్రాయాలు స్వీకరించారు. అభిప్రాయాలు తెలిపిన వారిలో ఒక్కరు కూడా ఆ కంపెనీ వల్ల జరిగే నష్టాలను, వ్యర్థాలను, ప్రజలకు కలిగే హానిని ప్రస్తావించకపోవడం విశేషం.

సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ పరిధిలో 50 హెక్టార్లలో మైనింగ్ లీజు ఉంది. అయితే గణేష్‌పాడు పరిధిలో 304 హెక్టార్ల భూమిలో సున్నపురాయి గనులను విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.5మిలియన్ టన్నుల నుంచి 1.8 మిలియన్ టన్నులకు పెంచేందుకు అనుమతి కోసం పరిశ్రమ యాజమాన్యం దరఖాస్తు చేసుకుంది. దానికోసం శనివారం భారీ పోలీసు బందోబస్తు నడుమ గణేష్‌పాడులో పెన్నా(అంబుజా) సిమెంట్ పరిశ్రమ కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాగా, లగచర్లలో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతోపాటు ఇటీవల రామన్నపేటలో అదానీ గ్రూప్ నూతన పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో ఏర్పడిన ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల ఎస్పీలు సన్‌ప్రీత్ సింగ్, శరత్



చంద్రపవార్ ఆధ్వర్యంలో ఐదుగురు డీఎస్పీలు, పదిమంది సీఐలు, 30 మంది ఎస్ఐలతో కూడిన సుమారు 500 మంది పోలీసులు మోహరించారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి-ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పరిశ్రమ యాజమాన్యం సమీప గ్రామాల ప్రజల మౌలిక వసతులకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చెప్పారు. పెన్నా(అంబుజా) సిమెంట్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. మండలంలోని గణేష్‌పాడు, వాడపల్లి, శూన్యపాడు గ్రామాల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి సీఎస్ఆర్ నిధులతో విద్యుత్, తాగునీరు, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం పరిశ్రమ యాజమాన్యం నడుచుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలుష్యరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. తాగునీరు కల్పించాలని కోరగా.. పరిశ్రమ యాజమాన్యం అన్ని వసతులూ కల్పిస్తామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చింది.

సభలో 12 మంది తమ అభిప్రాయాలు తెలపగా, 50 మంది లిఖితపూర్వకంగా అభిప్రాయాలను అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ విజయలక్ష్మీ, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్బంధించారు...!
సామాజిక కార్యకర్త నక్క శ్రీనివాస్

హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పెన్నా సిమెంట్ యాజమాన్యానికి తలొగ్గి పోలీసులు తనను అక్రమంగా నిర్బంధించారని సామాజిక కార్యకర్త నక్క శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దామరచర్ల మండలం గణేష్‌పాడు వద్ద నెలకొల్పిన పెన్నా సిమెంట్స్ యాజమాన్యం చేస్తున్న అక్రమాలపై శూన్యంపాడు గ్రామానికి చెందిన స్థానికుడినైన తాను ఏండ్ల తరబడి పోరాటాలు చేస్తున్నానని చెప్పారు. కోర్టులో కేసు వేసి న్యాయపోరాటం చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా పెన్నా సిమెంట్స్‌ను కొనుగోలు చేసిన అదానీ గ్రూప్ గనుల విస్తరణ కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో తన వాదనలు, అభిప్రాయాలూ వినాలని, వాటిపై తనకు పూర్తి వివరాలు అందజేయాలని, వాటిని రికార్డు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ప్రజాస్వామ్యంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేయాల్సిన వారే బేఖాతరు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై తాను మళ్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిపారు.

ముందస్తు అరెస్టులు సరికాదు



ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్ అన్నారు. తెల్లవారుజామున ఆయనతోపాటు సీఐటీయూ నాయకులు దయానందం, సీపీఐ(ఎం) నాయకులు ఎర్ర నాయక్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పెన్నా సిమెంట్స్ యాజమాన్యం చెప్పిన మాటలు నీటి మూటలై కృష్ణానదిలో తేలుతున్నాయని ఎద్దేవా చేశారు. ఇప్పుడు పరిశ్రమ గనుల విస్తరణకు ఈ ప్రాంత ప్రజలకు అనేక రకాల మాయమాటలు చెప్పి.. ఎక్కడా గ్రామ సభ పెట్టకుండా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న లోకల్ ఉద్యోగులను వేరే ప్రాంతానికి మార్చాలని ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. అలా చేస్తే పరిశ్రమ గేటు వద్ద పోరాటాలు చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు.



సంఘ విద్రోహ చర్యలు మానండి : ఎస్పీ

- 22 మంది మావోయిస్టు, ఆర్పీసీ సభ్యుల లొంగుబాటు

నవతెలంగాణ-చర్ల

మావోయిస్టు పార్టీ చేస్తున్న దుశ్చర్యలను ఖండించండి, సంఘ విద్రోహ చర్యలకు దూరంగా ఉండండని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. శనివారం చర్ల సీఐ ఏ.రాజువర్మ అధ్యక్షతన ఇప్పటివరకు లొంగిపోయిన మాజీ మావోయిస్టు సభ్యులు, వారి కుటుంబాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ కేడర్లలో విధులు నిర్వహిస్తున్న ఎర్రపల్లి ఏరియా కమిటీకి చెందిన 22 మంది మావోయిస్టులు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నిరుపేదలైన ఆదివాసీలను మభ్యపెడుతూ కాలం గడుపుతున్న మావోయిస్టుల మాటలు నమ్మకండి, తమ కుటుంబాలతో ఆనందంగా జీవనం గడపండి అని సూచించారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మడకం గంగా (పామేడ్ గ్రామం), ఎర్రపల్లి గ్రామానికి చెందిన ఆటం పొజ్జా, మడకం ఇడమా, సోడి అదమా, రవ్వ గంగా, రవ్వ మాడ, రవ్వ మూకా, ఉడం సింఘా, నుపోజోగా, మడకం భుద్ర, పొడియం జోగా, మడకం సన్నా, సోడికోస, రవ్వ ఈడిమే, కిస్కి నందే, రవ్వ భీమేలు, పొట్టే మంగు గ్రామానికి చెందిన సఖిలేరు, మిలేషియా కమాండర్ మడకం బీమా, మడకం బీమాలు (జబ్బగట్ట గ్రామం), కొవ్వాసి ఉంగలు (దూలేడు గ్రామం) వీరు దుమ్ముగూడెం సీఐ సంతోష్ ప్రేరణతో ఎస్పీ ఎదుట లొంగిపోయినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఓఎస్డీ పరితోష్ పంకజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్, 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్, చర్ల సీఐ ఏ.రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము బాన్సువాడ, జిల్లా: కామారెడ్డి

నెం.యం.సి.ఇ1/49/2023-24 తేది: 18.01.2025

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఈ క్రింద తెలిపిన అభివృద్ధి పనుల కొరకు సీల్డ్ కొటేషన్స్ స్వీకరించుట

క్ర.సం.	వివరములు
1	కార్బైట్ గ్రాస్ - కొరియన్/లాన్స్ తయారీ కొరకు మెటీరియల్
2	వైకుంఠ ధామానికి నేమ్‌బోర్డు సైజు 25×3 అడుగులు స్టీల్ అక్షరాలతో మరియు నీలిరంగు గ్రాండ్‌షీట్

పైన చూపబడిన వస్తువుల యొక్క సీల్డ్ కోటేషన్స్ తేది: 22-01-2025 సాయంత్రం 4-00 గంటల వరకు పురపాలక సంఘ కార్యాలయము బాన్సువాడ యందు సమర్పించగలరు. మిగితా వివరాలకు కార్యాలయ పని వేళల యందు ఫోన్ నెం. 9963583010 నకు సంప్రదించగలరు.

సం/- మున్సిపల్ కమీషనర్
పురపాలక సంఘం బాన్సువాడ

DIPR R.O.No.9257-PP/CL/ADVT/1/2024-25, Dt:18.01.2025

ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై లోకేష్ అసంతృప్తి

- సొంత నిధులతో మరమ్మతులకు నిర్ణయం
- వర్థంతి నేపథ్యంలో పలువురి నివాళి
- తెలంగాణలో టీడీపీ పున:నిర్మాణం : లోకేష్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు ఎన్టీఆర్ ఘాట్‌కి లోకేష్ వెళ్లారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులూడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని పరిశీలించారు. అవసరమైన అనుమతులు తీసుకుని వీలైనంత త్వరగా ఘాట్ మరమ్మతులు సొంత నిధులతో చేపట్టాలని నిర్ణయించారు. వెంటనే పనులు ప్రారంభించాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరు పట్ల ఎన్టీఆర్ అభిమానులు సైతం శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలను ఎన్టీఆర్ ట్రస్ట్‌కు అప్పగించాలని పలుమార్లు గత తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని లోకేష్ తెలిపారు.

భారతరత్న వస్తుంది :లోకేష్

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ మనవడు, ఏపీ మంత్రి నారా లోకేష్‌తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఘాట్ వద్ద నివాళి అర్పించారు. నాయకుడిగా, సీఎంగా ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రభంజనంతో టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అనేక సంస్కరణలు తెచ్చారని అభిప్రాయపడ్డారు. టీడీపీలో కోటి మంది సభ్యత్వాలు తీసుకోవడం గర్వకారణమని వ్యాఖ్యానించారు. తెలుగుజాతి ఎక్కడ ఉన్నా అగ్రస్థానంలోకి ఎదగాలని ఆకాంక్షించారు. 'ఎన్టీఆర్ రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారు. ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు. ఒక ప్రభంజనం. రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు ఆస్తుల్లో సమాన వాటా తదితర సంస్కరణలను తీసుకొచ్చారు. ఆయనకు తప్పనిసరిగా భారతరత్న వస్తుందని ఆశిస్తున్నాం. తెలుగు ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తాం. విశాఖ ఉక్కును కాపాడుకుంటున్నాం. తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నాం. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. టీడీపీపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, ఆశ ఉంది' అని వ్యాఖ్యానించారు.

బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్



ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ నివాళి అర్పించారు. నటుడిగా, నాయకుడిగా, సీఎంగా ఆయన సేవలను గుర్తు చేశారు. బసవతారకం ఆస్పత్రిలోనూ బాలకృష్ణ ఎన్టీఆర్‌కు నివాళి అర్పించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నటనలో ప్రయోగాలు చేసిన నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ అని బాలకృష్ణ తెలిపారు. ఆయన విప్లవాన్ని తీసుకొచ్చారని అన్నారు. కష్టజీవులు కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందన్నారు. పేదలకు ఉపయోగపడే పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఆయన అంటేనే నటనకు నిర్వచనం, నవరసాలకు అలంకారమని కొనియా డారు. ఆయన ఒక వర్సిటీ, జాతికి మార్గదర్శకమని చెప్పారు. ఎన్టీఆర్ అంటే యువతకు ఆదర్శం. నాడు 330కిపైగా తాలుకాలను 1000కి పైగా మండలాలుగా విభజించి పాలనను క్షేత్రస్థాయికి చేర్చారని చెప్పారు.

ట్రస్టు ద్వారాసేవలు: భువనేశ్వరి

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానటుడు ఎన్టీఆర్ అని నారా భువనేశ్వరి అన్నారు. రాజకీయ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారని చెప్పారు. ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని గుర్తు చేశారు. ఆయన సేవలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. దీనిద్వారా పలు సేవల కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలను ట్రస్టు పాటిస్తున్నది. ఆయన వర్ధంతికి ఏటా లెజెండరి బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నాం. మీరు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు, మరొకరి జీవితంలో సంతోషాన్ని ఇస్తుంది. నాటి నుంచి నేటి వరకు ట్రస్టుకు 8.70 లక్షల మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులు, ప్రభుత్వ ఆస్పత్రులకు రక్తాన్ని అందించాం. చల్లపల్లి ట్రస్టు స్కూల్‌లో ఉచిత విద్య, వసతి, భోజనం కల్పిస్తున్నాం. మెరిట్ స్టూడెంట్లకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నాం. ట్రస్ట్ ద్వారా ప్రజాసేవకు అందరికంటే ముందుంటాం. తుఫాన్లు, కొవిడ్ సమయాల్లో అనేక సేవలు అందించామని భువనేశ్వరి తెలిపారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధ దంపతులు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంతంగి కృష్ణ(60), సీత(58) దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. వారికి పెండ్లిలు చేశారు. పంతంగి కృష్ణ గతంలో లారీ కొనుగోలు చేసి నడిపాడు. దాని వల్ల అప్పులయ్యాయి. దాంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దంపతులిద్దరూ గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వారి మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణమని గ్రామస్తులు తెలియజేశారు. శనివారం ఉదయం చెరువులో మృతదేహాలను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బయటకు తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలివ్వాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి పీఎంటీఏటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని పీఎంటీఏటీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం హైదరాబాద్‌లో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డితో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. 010 పద్దు కింద వేతనాలు చెల్లించే దస్త్రాన్ని త్వరితగతిన ప్రభుత్వం ఆమోదించేలా చూడాలని కోరారు. నోషనల్ సర్వీస్ కల్పించాలని తెలిపారు. డీఏ బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. 28 మంది మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మరణించారనీ, వారి కుటుంబాలకు సీపీఎస్ డెత్ గ్రాట్యుటీ, కుటుంబ పెన్షన్ వెంటనే అందించాలనీ, కారుణ్య నియామకాలను చేపట్టాలని వివరించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దుపై తగు చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: 6వ అంతస్తు (లెవల్-2), బిల్డింగ్ నెం.క్యూ2, అరం క్యూపార్క్స్, జెన్ 4/1, టీటీసి, థాణె బేలాపూర్ రోడ్డు, ఘన్‌సోలి, నవి ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

ఏదైతే, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు, **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది, తర్వాత శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ లిమిటెడ్ పేరును శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) నుండి ఆర్థిక సహాయం పొందియున్నారు. మా నుండి వారు ఆర్థిక సహాయం పొందారని మేము ప్రకటిస్తున్నాం, రుణగ్రహీతలు/హామీదారులు సదరు వాయిదా తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో పలుమార్లు డిఫాల్ట్ గావింపబడినారు. అందుకుగాను **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి కోరికపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీ చేయబడిన మార్గదర్శకాలు/ఆదేశాలను అనుసరించి సదరు ఖాతా అనునది నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ పేర్కొన్న సదరు తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేసి, SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద సదరు నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా చెల్లించు తేదీ వరకు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితో నోటీసులో పేర్కొనబడిన మొత్తాలపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డతోపాటు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా దిగువ రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులను కోరబడినది. వారు గతంలో తెలిసిన చిరునామాలపై నోటీసులు జారీచేయబడినవి. కానీ, అవి వారికి బట్వాడా కాకుండా తిరిగి వచ్చినవి మరియు దానికి సంబంధించి బహిరంగ ప్రకటన రూపంలో ఇందు మూలంగా తెలియజేస్తున్నాం. సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్(8) యొక్క నియామాలపై రుణగ్రహీతలు శ్రద్ధ వహించాలని ఆహ్వానిస్తున్నాం.

రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/హామీదారుల పేరు	
1) **భాజా కరీముద్దీన్, తండ్రి: భాజా అజీముద్దీన్,** వయసు : 27 ఏళ్లు, వృత్తి: స్వయం ఉపాధి, నివాసం :-ఇ. నెం:1-3-289, పహాడీనగర్, భోనగిరి, నల్గొండ -508116., బి/ఓ. : "కరీం ఫ్రూట్స్ బిజినెస్"., **2) భాజా అజీముద్దీన్, తండ్రి : భాజా బషీరుద్దీన్,** వయసు : 51 ఏళ్లు, వృత్తి: స్వయం ఉద్యోగి, నివాసం : ఇ. నెం. 1-3-289, పహాడీనగర్, భోనగిరి, నల్గొండ -508116., 3) **బోయపల్లి నర్సింహారెడ్డి,** తండ్రి : బోయపల్లి రామ్‌రెడ్డి,వయసు : 54 ఏళ్లు, వృత్తి: స్వయం ఉపాధి, నివాసం :-ఇ. నెం: 4-74, బీబీ నగర్, వాటర్ ట్యాంక్ సమీపంలో, గూడూర్, బీబీనగర్ మండలం,నల్గొండ -508126. ....రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీత/హామీదారులు/చట్టబద్ధ వారసులు.	ఎన్‌పిఎ తేది 10.04.2023 డిమాండ్ నోటీస్ తేది 07.12.2024 బకాయిపడ్డ మొత్తం Rs.69,09,947/- రుణం మొత్తం Rs.50,00,000/-

స్థిరాస్తి యొక్క వివరణ:- HMYTHTF2207290001- షెడ్యూల్ "ఎ" : ఇల్లు మున్సిపల్ నెం. 1-3-289 కలిగియున్నది, 6 గదులు మరియు ఓపెన్ యార్డులు కలిగియున్నది, విస్తీర్ణం : 422 చదరపు గజాలు, 352.846 చదరపు మీటర్లకు సమానమైనది, పహాడీనగర్ వద్ద ఉన్నది, భోనగిరి మండలం, యాదగిరి-భువనగిరి జిల్లా మరియు భవనం యొక్క వయసు 30 ఏళ్లు, మరియు 1200 చ.అడుగులు., మరియు **సరిహద్దులు ఈ విధంగా :- తూర్పు వైపు:** మహ్మద్ ఇబ్రహీం యొక్క ఇల్లు, **పడమర వైపు:** పొరుగువారి ఇల్లు మరియు ఖాదర్ షరీఫ్ యొక్క ఇల్లు, **ఉత్తరం వైపు:** 21' వెడల్పు రోడ్, **దక్షిణం వైపు:** పొరుగువారి ఇల్లు.
HMYTHTF2207290001-**స్థిరాస్తి యొక్క వివరణ:- షెడ్యూల్ "బి"** : మున్సిపల్ నెం. 1-3-289/1 కలిగియున్న ఇల్లు మొత్తం, ఒక వంటగది కలిగియున్నది, మూడు గదులు మరియు ఒక యార్డు టాయిలెట్లతో, మొత్తం విస్తీర్ణం : 100 చదరపు గజాలు, 83.613 చదరపు మీటర్లకు సమానమైనది, పహాడీనగర్ వద్ద ఉన్నది, భోనగిరి మండలం, యాదగిరి-భువనగిరి జిల్లా మరియు భవనం యొక్క వయసు 30 ఏళ్లు, మరియు 900 చ.అడుగులు., మరియు **సరిహద్దులు ఈ విధంగా :- తూర్పు వైపు:** అజీమ్ యొక్క ఇల్లు, **పడమర వైపు:** గౌరి యొక్క భూమి, **ఉత్తరం వైపు:** 30' -0' వెడల్పు రోడ్, **దక్షిణం వైపు:** అజీమ్ యొక్క ఓపెన్ ల్యాండ్.

పైన చెప్పిన ఇట్టి పరిస్థితుల్లో, ఇందుమూలంగా పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎక్కడైతే వర్తించునో)కు ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల్లోగా తదుపరి వడ్డీ& వర్తించబడు చార్జీలతోపాటు పైన పేర్కొన్నట్లుగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడినది. విఫలం చెందినచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు దాని క్రింద వర్తించబడు రూల్స్ క్రింద రుణగ్రహీతలు మరియు తాకట్టుదారుల యొక్క సెక్యూర్డ్ అసెట్స్ స్వాధీనం చేసుకొనుటతోపాటు సెక్యూర్డ్ అసెట్స్‌పై ఈ ప్రకటన తేది నుండి 60 రోజులు ముగిసిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోబడుతాయి.
చెప్పబడిన చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, నోటీసు పై పేర్కొన్న అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల్లో రుణగ్రహీత బదిలీ చేయరాదని దయచేసి గుర్తించగలరు.

తేది: 17.01.2025, ప్రదేశం: నల్గొండ — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

కబ్జారాయుళ్లను వదిలిపెట్టం

హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జగద్గిరిగుట్టలో పర్యటన
- శ్రీవారి ఆలయ భూముల కబ్జాలపై పరిశీలన
- పరికి చెరువును కాపాడాలని పలు పార్టీ నేతల వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కబ్జారాయుళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 348/1లోని జగద్గిరిగుట్టపై కొండకిరువైపులా ఉన్న ఆలయ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల గోవిందరాజుల స్వామి ఆలయ కొలను కబ్జా అవుతున్నట్టు పూజారి నరహరిశర్మ సోషల్ మీడియా ద్వారా వీడియోలు పోస్ట్ చేశారు. దాంతో హైడ్రా కమిషనర్ వివిధ విభాగాల అధికారులతో పర్యవేక్షించారు. సమీపంలో ఉన్న పరికి చెరువు కబ్జాపై కూడా స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో ఆ ప్రాంతాన్ని, ఆలయ సముదాయాలను, ప్రభుత్వ భూములను అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి కమిషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ.. 2024 జులైలో హైడ్రా ఏర్పాటైందని, అంతకు ముందు నిర్మించిన నివాసుల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడిన తర్వాత జరిగిన కబ్జాలపై మాత్రం తప్పక చర్యలు ఉంటాయని తెలిపారు. కుల సంఘాల పేరిట ఆలయ భూములను కబ్జా చేసి సొంతంగా వాడుకోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. సదరు కుల సంఘాల పేరిట కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని వస్తున్న వార్తలపై సీరియస్ అయ్యారు. గూగుల్ మ్యాప్ పరిశీలించి కబ్జాలను గుర్తిస్తామన్నారు. వచ్చే బుధవారం జగద్గిరిగుట్ట ఆలయ భూములతో పాటు పరికి చెరువు కబ్జాలపై స్థానికులతో హైడ్రా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పరికి చెరువు పరిరక్షణ కోసం ఒక గ్రూప్ తయారు చేసి ఎప్పటికప్పుడూ చెరువు పూడ్చివేతపై సమాచారం ఇవ్వాలని కోరారు. పరికి చెరువును బాలకృష్ణ అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకురాగా.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కబ్జాదారులకు నోటీసులు పంపిస్తామన్నారు. 15 రోజుల్లో హైడ్రా పోలీస్ స్టేషన్ పనులు మొదలు కానున్నాయన్నారు. కబ్జాదారులపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతోపాటు స్థానిక సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్టు చెప్పారు. అన్ని ఆధారాలతో హైడ్రా కార్యాలయానికి వచ్చి అందజేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడులు వచ్చినా తగ్గేదే లేదని, కబ్జాదారులను జైలుకు పంపించడం ఖాయమని అన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగద్గిరిగుట్ట సీఐ కేతూరి నరసింహ, ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్, శ్రీవారి ఆలయ చైర్మెన్ కె.నరేందర్ రెడ్డి, బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, సిరుసాని మహేందర్, అరుణ్, పిల్లి అంజనేయులు, యాదగిరి, వంశీ, సాయికుమార్ పంతుల, కె.మహేష్,రాయి విగ్నేష్ ఉన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

హెడ్ ఆఫీసు: లెవల్-3, వోకార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2 బ్లాక్, బాంద్రాకుర్లా కాంప్లెక్స్, (బాంద్రా ఈస్ట్), ముంబై-400051; ఫోన్: 022-42410400, 022-40603100; వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction.
బ్రాంచ్ ఆఫీస్ చిరునామా: ఎం.జి.రోడ్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ పక్కన, గణేష్ టెంపుల్ ఎదురుగా, కొత్తగూడెం-507101,
అధీకృత అధికారి చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, ఇంటి నెం: 11-4-12/15, 2వ అంతస్తు, ఎస్‌బిఆ బిల్డింగ్, వైరా రోడ్, ఖమ్మం-507001.

అనుబంధం-4 ఏ (రూల్ 8(5) & 8(6) &9(1) నియమం చూడండి)

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదవబడిన, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం నోటీసు.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతలకు ప్రకటన ఇవ్వడమేమనగా దిగువ వివరించిన స్థిరాస్తులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టబడిన/ చార్జ్ చేయబడినవి. శ్రీరామ్ ఫైనాన్స్‌లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ అని పిలువబడేది) యొక్క అధీకృత అధికారి తీసుకున్న భౌతిక స్వాధీనాన్ని ఆస్తిని, దిగువ పట్టికలో ఇచ్చినట్లుగా రుణగ్రహీతలు/హామీదారుల నుండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెల్లించాల్సిన బ్యాలెన్స్‌ను తిరిగి పొందేందుకు, **01.03.2025న ఉ.11గం.ల నుండి మ.1.00 గం.ల వరకు ఇ-వేలంలో "ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే ప్రతిపాదిక"** విక్రయించబడును. రుణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి ఉన్న మొత్తం, స్థిరాస్తి మరియు దానిపై తెలిసిన భారాల సంక్షిప్త వివరణ, స్వాధీనం రకం, రిజర్వ్ ధర మరియు ధరావత్తు మరియు ఇంక్రిమెంట్ కూడా ఇలా ఇవ్వబడ్డాయి:

రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారుల పేరు	13(2) డిమాండ్ నోటీసు తేది& మొత్తం	స్వాధీనతా తేది & సమయం	ధరావత్తు (ఈఎండి) వివరాలు	వేలం తేది& సమయం	సంప్రదించు వ్యక్తి మరియు తనిఖీచేయు తేది
1) **శ్రీధర్ ఎల్ల, తండ్రి శంకర్,** వయస్సు: 48 సం॥లు, వృత్తి: పవన్ మెన్స్ వేర్ షాప్, నివాసం: ఇ.నెం.4-3-15/1, గాజుల రాజం బస్తీ, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, **2) సూరిసెట్టి భాస్కర్ రావు, తండ్రి వెంకయ్య,** వయస్సు: 48 సం॥లు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇ.నెం.15-6-10/4, ఎన్‌సిబి నగర్, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెల్: 9989286963.	01-08-2023 నాటికి మొత్తం రూ. **36,54,374/- (రూపాయలు ముప్పైఆరు లక్షల యాభై నాలుగు వేల మూడు వందల డెబ్బై నాలుగు మాత్రమే)** చెల్లించడానికి (25.10.2021న ఏఆర్‌సి నెం.267/2020న ఇచ్చిన ఆర్బిట్రల్ మొత్తం ప్రకారం) మరిన్ని వడ్డీతో + శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు రుణం నెం: KTGDMTF1704280021 కింద చెల్లించాల్సిన ఛార్జీలు, డిమాండ్ నోటీసు **తేదీ:31.10.2022**	**14-11-2023** **భౌతిక స్వాధీనతా రుణభారాలు తెలిసిన తెలియని**	దిగువ పేర్కొన్న ఖాతా వివరాలకు ఆర్టీజీఎస్/ఎన్ఇఎఫ్టీ ద్వారా ఈఎండిను జమ చేయాలి. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్యాంక్ పేరు-యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్-అశోక్ నగర్, హిమాయత్ నగర్, హైదరాబాద్-500029, ఖాతా నెం..911020046604111, ఐఎఫ్ఎస్‌సి కోడ్: UTIB0000370.	తేదీ: 01.03.2025 సమయం: ఉ.11.00 గం.ల నుండి మ.01.00 గం.ల వరకు	ఎండి.ఇమామ్ పాషా, కాంటాక్ట్ నెంబర్: 9849023122, బి.వెంకటేశ్వర్లు-9059447311, కస్టమర్ కేర్: 022-40081572 అస్తి తనిఖీచేయు తేదీ:28-02-2025 సమయం: ఉ.11.00 నుండి సా.5.00 వరకు.

అస్తి వివరణ:అస్తి యజమాని పేరు: శ్రీధర్ ఎల్ల, డాక్యుమెంట్ నెం.1996/2017తో: జిఆర్ బస్తీ, కొత్తగూడెం పట్టణం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 411.07 చ.గ.ల విస్తీర్ణంలో ఇ.నెం.4-3-15 కలిగిన ఇంటి సైటుతోపాటుగా ఆర్‌సిసిరూఫ్ ఇల్లు. **సరిహద్దులు: తూర్పు వైపు:** రాములు ఇల్లు, **పడమర వైపు:** కొండయ్య ఇల్లు, **ఉత్తరం వైపు:** కిష్టయ్య ఇల్లు, **దక్షిణం వైపు:** ప్రస్తుతమున్న మున్సిపల్ రోడ్డు.

రిజర్వ్ ధర మొత్తం రూ.50,95,000/-; ఈఎండి మొత్తం: రూ.5,09,500/- బిడ్ పెంపుదల: రూ.5,000/- మరియు సదరు గుణిజాలలో.
ఈఎండి సమర్పించడానికి చివరి తేదీ: 27-02-2025, సమయం ఉ.10.00 నుండి సా.05.00 వరకు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) రూల్ 9 (1) కింద చట్టబద్ధమైన 30/15 రోజుల నోటీసు

రుణగ్రహీత/తనఖాదారులు/హామీదారులు పైన పేర్కొన్న మొత్తాన్ని తేదీ వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు ఇ-వేలం తేదీకి ముందు అనగా 01.03.2025 నాటి ఇ-వేలం ప్రక్రియలు ప్రారంభమయ్యే ముందు చెల్లించాలని ఇందుమూలంగా తెలియజేయబడుతున్నాయి, విఫలం చెందితే, ఆస్తి వేలం వేయబడుతుంది/అమ్మబడుతుంది మరియు మిగిలిన బకాయిలు, ఏదైనా ఉంటే, వడ్డీ మరియు ఖర్చుతో సహా తిరిగి పొందబడతాయి.
లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను సృష్టించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణలో సహాయం కావాలనుకునే ఆసక్తిగల బిడ్డరుదారు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించు వ్యక్తి: అసద్ ఖాన్, కాంటాక్ట్ నెం.712 8695102, వివేక్ అరోరా, కాంటాక్ట్ నెం.9988001555, వివేక్ అరోరా <vivek.arora@samil.in>% ని సంప్రదించవచ్చు మరియు
ఏదైనా అస్తి సంబంధిత ప్రశ్నలకు కార్యాలయ వేళలు మరియు పని దినాలలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి, ఎండి.ఇమామ్ పాషా, కాంటాక్ట్ నెం.9849023122 పై సంప్రదించవచ్చు.
ఎటువంటి ఇతర కారణాలు చూపకుండానే ఏదైనా లేదా అన్ని బిడ్‌లను తిరస్కరించే హక్కు అధీకృత అధికారికి ఉంది. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్ (https://eauctions.Samil.in/home) లో నిర్వహించబడుతుంది. టెండర్ సమర్పణ స్థలం/ బిడ్ ఫారమ్ పొందడానికి / టెండర్ ఓపెన్ &వేలం, దయచేసి https://eauctions.Samil.in/home వెబ్‌సైట్‌ను సందర్శించండి మరియు అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో అందించిన లింక్: https://www.shriramfinance.in/auction ను చూడండి.
గమనిక: "ఎన్‌సిఎల్టీ,"చెన్నై వారి ఆదేశం ప్రకారం "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్"ను "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" తో విలీనం చేసినట్లు తెలియజేయబడుతున్నది. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరు 30.11.2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడింది, దీని పేరు మార్పు 30-11-2022 నాటి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ ద్వారా అమలులోకి వస్తుంది.

ప్రదేశం: కొత్తగూడెం, తేదీ: 17-01-2025 — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరు

వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ విధానాన్ని కాపాడుతాం

అఖిల భారత మహాసభలో రాజకీయ ఎత్తుగడల పంథా: సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

స్వతంత్ర బలం పెంచుకోవడంపై నిర్ణయాలు | **వామపక్షాల బలోపేతంపై కూడా చర్చ**

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరాడుతామని సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ అన్నారు. పార్టీ 24వ అఖిల భారత మహాసభలో రాజకీయ ఎత్తుగడ పంథాను నిర్ణయిస్తామని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాలో జరుగుతున్న సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 24వ సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభ తమిళనాడులోని మధురైలో ఏప్రిల్ 2 నుంచి 6 వరకు జరగనుందని, ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో ప్రస్తుతం హిందూత్వ, కార్పొరేట్ శక్తుల ప్రతినిధిగా మోడీ సర్కార్ ఉందని అన్నారు. గత పదేండ్లుగా దేశంలో అధికారాన్ని, స్వతంత్ర సంస్థలను ఉపయోగించి తన ఎజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. ఆ ఎజెండాలో రెండే అంశాలు ఉన్నాయని, ఒకటి హిందూ రాష్ట్ర నిర్మాణానికి హిందూత్వాన్ని ముందుకు తీసుకురావడం, రెండు కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం అని పేర్కొన్నారు. హిందూత్వ, కార్పొరేట్ బంధంతో మిళితమైన మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఎలా ఉద్యమించాలనే దానిపై పార్టీ అఖిల భారత మహాసభ ప్రధానంగా దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. హిందూ మతోన్మాద శక్తులకు, నయా ఉదార వాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, కనుక ఈ రెండింటికీ వ్యతిరేకంగా ఒకేసారి ఉద్యమించాల్సి ఉందని తెలిపారు. దీంతో పాటు సీపీఐ(ఎం) స్వతంత్ర బలం పెంచుకోవడంపై కూడా పార్టీ మహాసభ నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. సీపీఐ(ఎం) బలంగా లేకపోతే, హిందూ మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరాటం విజయవంతం కాదని పేర్కొన్నారు. అలాగే వామపక్షాల బలోపేతంపై కూడా మహాసభలో చర్చిస్తామన్నారు. కార్మిక వర్గ పోరాటం, వివిధ వర్గాల ప్రజల ఉద్యమాలపై, అలాగే ఆర్ఎస్ఎస్, హిందూత్వానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటంపై కూడా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు.



వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని కాపాడుతాం

ప్రపంచంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని, వాటిపై కూడా పార్టీ మహాసభ చర్చిస్తుందని అన్నారు. అమెరికాలో ట్రంప్ వచ్చిన తరువాత సామ్రాజ్యవాదం విధానం మరింత పునరుద్ధరించబడిందని విమర్శించారు. ప్రపంచంలో పురోగతి సాధిస్తోన్న చైనా, అమెరికాకు సవాల్‌గా మారిందని, దీంతో చైనాను అమెరికా టార్గెట్ చేస్తోందని తెలిపారు.

పాలస్తీనా, గాజాపై దాడులు చేస్తోన్న ఇజ్రాయిల్‌కు అమెరికా సామ్రాజ్యవాదం ఎలా మద్దతుగా నిలుస్తోందో అందరికీ తెలుసని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తోన్న ఉక్రెయిన్‌కు అమెరికా సహాయం చేస్తోందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ మితవాద శక్తులకు వ్యతిరేకంగా బలమైన వామపక్ష ప్రత్యామ్నాయ విధానం ఐక్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. అలాగే దేశంలో కూడా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు ఐక్యమై బలోపేతంతో ముందుకు సాగుతాయని తెలిపారు. దేశంలో వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని కాపాడుతామన్నారు. ఇదే 24వ పార్టీ అఖిల భారత మహాసభ ప్రధాన ఎజెండా అని ప్రకాశ్‌కరత్ తెలిపారు.

ట్రంప్ ప్రమాణం రేపే

40ఏండ్లలో తొలిసారిగా క్యాపిటల్ లోపల కార్యక్రమం

వాషింగ్టన్ : అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ (78) 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. లాంఛనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగిన అనంతరం సంగీత ప్రదర్శనలు, పరేడ్‌తో సహా పలు కార్యక్రమాలు జరగనున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12గంటలకు ప్రమాణ స్వీకారం జరుగుతుంది. ట్రంప్‌చే చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయిస్తారు. దీంతో ట్రంప్ రెండో పదవీ కాలం ఆరంభమవుతుంది. అయితే సోమవారం ఉష్ణోగ్రతలు మరింత కనిష్టానికి అంటే మైనస్ 7డిగ్రీలకు పడిపోయే అవకాశముందని వాతావరణ హెచ్చరికలు వెలువడడంతో సాంప్రదాయంగా ఆరుబయట జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని కేపిటల్ రొటుండా లోపల నిర్వహించనున్నారు. ఇలా వేదిక మారి లోపల కార్యక్రమం నిర్వహించడమనేది 40ఏళ్ళలో మొదటిసారి. చివరి సారిగా 1985లో ఇక్కడ అప్పటి అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన కూడా అప్పుడు రెండోసారి ఎన్నికయ్యారు. వాతావరణం అనుకూలించనుందునే అప్పుడు కూడా లోపల నిర్వహించారు. అధ్యక్షుడు జో బైడెన్, కాంగ్రెస్ సభ్యులు, ఇతర ప్రముఖులు, ఆహుతులు, అతిథులు కేపిటల్ లోపల కూర్చుని చూసేందుకు వీలుగా వేదిక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం అర్లింగ్టన్ నేషనల్ సిమెట్రీలో అజ్ఞాత సైనికుని సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఆరంభమవుతాయి. తర్వాత విక్టరీ ర్యాలీ జరగనుంది. కాగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆనాడు కేపిటల్‌పై దాడి చేసిన నిందితులు కూడా హాజరు కానున్నారు. కోర్టు అనుమతినివ్వడంతో వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

దళితులకు మొండిచెయ్యే!

(మొదటి పేజీ తరువాయి)

అట్టడుగుననున్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులను మాత్రమే కేటాయించేది. ఆ నిధులను కూడా దళితుల అభ్యున్నతికి ఖర్చు పెట్టేది కాదు. దీంతో వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేది. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంతో పాటు మేధావులు, ఇతర సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సబ్ ప్లాన్ చట్టం కోసం నిర్విరామ పోరాటాలు చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే బీవీ రాఘవులు, జాన్‌వెస్లీ, మిడియం బాబూరావు తదితరులు ఆందోళనలకు, నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. ఈ పోరాటాల ఉధృతికి తలవంచిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసు కొచ్చింది. ఆ చట్టం ద్వారా బడ్జెట్‌లో షెడ్యూల్ కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధి కోసం ఖర్చు చేసే వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటైంది. ఎస్సీ అభివృద్ధికి కేటాయించిన నిధులు సుమారు 54 శాఖల ద్వారా ఖర్చు చేసే యంత్రాంగం ఉండేది. ఈ ఏడాది ఖర్చు చేయని నిధులను మరుసటి సంవత్సరం ఖర్చు చేసే విధంగా క్యారీ ఫార్వడ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా నాటి ప్రభుత్వం ప్రకటించింది. గొప్ప పోరాటం ఫలితంగా సాధించిన విజయమిది. అయితే కేసీఆర్ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి పాటుపడుతున్నట్టు గొప్పలు చెప్పుకుందేగానీ, ఆచరణలో వారికోసం కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా చట్ట విరుద్ధంగా దారి మళ్లించింది. 2014 నుంచి 2022-24 (సెప్టెంబర్ 30 వరకు) మధ్యకాలంలో ఎస్సీల అభివద్ధి నిధి కింద 55శాతం మాత్రమే ఖర్చు చేసింది. సుమారు రూ.63,182,10 కోట్లు దారి మళ్లాయి. ఇక ప్రస్తుత సైతం ఏడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామంటూనే 10శాతం నిధులను కేటాయిస్తా మంటూ సన్నాయి నొక్కులు నొక్కుతోంది. జనాభా ప్రాతిపదికన కేటాయించాల్సిన నిధులను తగ్గించాలని యత్నించడం తగదని దళిత సంఘాలు హెచ్చరిస్తునే ఉన్నాయి.

పెరుగుతున్న దాడులు..

రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, కుల దురహంకార హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇటీవల కాలంలోనే నల్లగొండ జిల్లా గుంటుపల్లి అన్నారానికి చెందిన దళిత యువకుడిపై కుల దురహంకార హత్య జరిగింది. ఇబ్రహీంపట్నం మండలం రాయప్రోలు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగమణి కులాంతర వివాహం చేసుకుందని కుటుంబ సభ్యులే అత్యంత దారుణంగా హత్య చేశారు.అంతకు ముదు పెరుమాళ్ల ప్రణయ్, మంథని మధుకర్ ఇలా అనేక మంది కుల దరహంకార హత్యలకు గురయ్యారు. వీటికి వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నికరంగా పోరాడింది. ఐక్య పోరాటాల్లో ముందు భాగాన నిలబడింది.పోరాటాల ఫలితంగానే దోషులపై చట్టబద్ధ చర్యలు తీసుకున్నారు. మరో పక్క వీడీసీల పేరుతో నిజామాబాద్ జిల్లాలో దళితులు ఇప్పటికీ గ్రామ బహిష్కరణలకు గురవుతూనే ఉన్నారు.

జీవం లేని ఎస్సీ కార్పొరేషన్

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు, స్వయం ఉపాధి పథకాలు అమలు జరిగేవి. ఇది ఒక నాటి మాట. కానీ..గత పదేండ్ల కాలంలో ఆ కార్పొరేషన్ జీవచ్ఛవంలా పడి ఉంది. అరకొర సిబ్బందితో దాని ద్వారా జరగాల్సిన కార్యక్రమాలకు పాలకులు బ్రేకులు వేశారు. వ్యూహాత్మకంగానే గత ప్రభుత్వం దీన్ని నిర్వీర్యం చేసి, దళిత బంధుకు హైప్ క్రియేట్ చేసింది. ఇది కూడా తమ అనుయాయులకు మాత్రమే ఉపయోగ పడింది. అవినీతికి అడ్డాగా మారింది. పారదర్శకత లోపించింది. అర్హులకు అందకుండా పోయింది.

పోరాటాలతోనే దళితులకు న్యాయం

అధికారంలోకి ఎవరొచ్చినా దళితులకు జరుగుతోంది అన్యాయమే. హామీలను అమలు చేయటంలో ఎగనామం పెడుతున్నారు. ఆ మోసాలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ నికరంగా పోరాడుతున్నది. అనేక సందర్భాల్లో విజయాలు కూడా సాధించింది. దళితుల చైతన్యానికి పూలే అంబేద్కర్‌ల జనజాతరలు నిర్వహిస్తూనే..కుల దురహంకార హత్యలు, దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కొట్లాడింది.దళిత వాడలకు జీవో 342 ప్రకారం 101 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని ఉద్యమాలు నిర్వహించింది. గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలకోసం పోరాటాలు నిర్వహించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం కోసం ఉద్యమాలు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌లోని వాగ్దానాలను అమలు చేయాలని ఉద్యమాలు నిర్వహించింది.

-టి స్కైలాబ్‌బాబు
కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాజ్యాంగ రక్షణకు ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

రంగ సంస్థల ప్రయివేటీకరణతో ప్రశ్నార్థకమవుతున్న రిజర్వేషన్లను రక్షించుకోవాలి. ఒకే దేశం- ఒకే పన్ను, ఒకే దేశం-ఒకే ఎన్నిక అంటున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఒకే దేశం-ఒకే కులం అని ఎందుకనడం లేదో చెప్పాలంటూ మనువాదులను ప్రశ్నిద్దాం. రాబోయే కాలంలో ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుడదాం.

- జాన్ వెస్లీ (కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు)

డిగ్రీలు కాదు..నైపుణ్యాలే ఆధారం

- నియామకాలపై 30 శాతం భారతీయ సంస్థల తీరు
- డబ్ల్యూఈఎఫ్ నివేదిక

న్యూఢిల్లీ : భారత్‌లోని పలు సంస్థలు, కంపెనీల ఉద్యోగ నియామకాల్లో అనుసరించే తీరు మారుతున్నదా? డిగ్రీల కంటే నైపుణ్యాలకే ప్రాధాన్యతనిస్తున్నాయా? అంటే అవుననే సమాధానం వినబడుతున్నది. 30 శాతం భారతీయ సంస్థలు.. డిగ్రీలు కాకుండా.. నైపుణ్యాధారిత నియామక పద్ధతులను అవలంభించాలని చూస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 19 శాతం కంపెనీలు ఈ దారిలో ఉన్నాయి. దీనితో పోలిస్తే భారత్‌లో ఈ సంఖ్య అధికంగా ఉండటం గమనార్హం. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) తన జాబ్స్ రిపోర్ట్ 2025లో ఈ విషయాన్ని పేర్కొన్నది. డిజిటల్ యాక్సెస్ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాతావరణ ఉపశమన ప్రయత్నాలు.. 2030 నాటికి భారత ఉద్యోగ మార్కెట్ భవిష్యత్తును రూపొందించే ప్రాథమిక ధోరణులని డబ్ల్యూఈఎఫ్ వివరించింది. భారత్‌లో పని చేస్తున్న కంపెనీలు ఏఐ, రోబోటిక్స్, అటానమస్ సిస్టమ్స్ అండ్ ఎనర్జీ టెక్నాలజీస్ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నది. భారత్‌లోని దాదాపు 35 శాతం కంపెనీలు తమ కార్యకలాపాలను మార్చుకోవటానికి సెమీ కండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీని ఆశిస్తున్నాయని నివేదిక వివరించింది. క్వాంటం, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలు కూడా ఇలాంటి ప్రభావాన్ని చూపుతాయని దాదాపు 21 శాతం కంపెనీలు అంచనా వేస్తున్నాయని డబ్ల్యూఈఎఫ్ హైలెట్ చేసింది. ఈ మార్పులు బిగ్ డేటా స్పెషలిస్ట్‌లు, ఏఐ, మెషిన్ లెర్నింగ్ స్పెషలిస్ట్‌లు, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్‌ల వంటి పాత్రలక అధిక డిమాండ్‌ను సృష్టిస్తాయని తన నివేదికలో పేర్కొన్నది. భారత్‌లో పని చేస్తున్న కంపెనీలు విభిన్న ప్రతిభ గల సమూహాలను ఉపయోగించుకోవాలని యోచిస్తున్నాయనీ, 67 శాతం ఈ వ్యూహాన్ని నొక్కి చెప్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 47 శాతంగా ఉన్నదని నివేదిక పేర్కొన్నది. 2025- 2030లో యూరప్‌లో కార్మిక మార్కెట్ పరివర్తనను ప్రభావితం చేసే కీలక ధోరణులైన డిజిటలైజేషన్, వాతావరణ మార్పు, జీవన వ్యయం పెరుగుతాయని వివరించింది. యూరప్‌లోని వ్యాపారలకు కార్మిక మార్కెట్లో ప్రతిభ కొరత, నైపుణ్య అంతరాలు ఒక ప్రధాన సవాల్‌గా ఉన్నదని కూడా డబ్ల్యూఈఎఫ్ స్పష్టం చేసింది. ఈ ప్రాంతంలోని దాదాపు 54 శాతం కంపెనీలు, సంస్థలు.. ప్రతిభ లభ్యత విషయంలో ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి.

దేనికైనా రెడీ

- మా నుంచి బలమైన స్పందన తప్పదు
- 'ట్రంప్ టారిఫ్ ట్యాక్స్'పై తీవ్రంగా స్పందించిన కెనడా
- అమెరికాకు స్ట్రాంగ్ వార్నింగ్
- రెండు దేశాల మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం



కెనడా : అమెరికా, కెనడాల మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతున్నది. అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ట్యాక్స్ హెచ్చరికలపై కెనడా తీవ్రంగా స్పందించింది. యూఎస్ టారిఫ్‌లు పెంచితే.. అమెరికన్లకు కూడా ట్రంప్ పన్నుల దెబ్బలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ స్పందించారు. కెనడా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించాలనే తన ప్రణాళికను ట్రంప్ అనుసరిస్తే, కెనడియన్లు అమెరికాపై 'ట్రంప్ సుంకాలు' విధించవచ్చని అన్నారు. ట్రంప్ తన హెచ్చరికలను అమలు చేస్తే, ఆ తర్వాత జరిగే పరిణామాలను ఎదుర్కొనేందుకు కెనడా సిద్ధంగా ఉన్నదని చెప్పారు. వాణిజ్య యుద్ధం జరిగితే కెనడా నుంచి బలమైన ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు.

ఇది దశాబ్దాలలో కెనడా, యూఎస్ మధ్య జరిగే అతిపెద్ద వాణిజ్య యుద్ధం అవుతుందని ఆమె అన్నారు. మెలానీ జోలీ.. ఇటీవలే అమెరికాలో పర్యటించారు. వాణిజ్యం, సరిహద్దు భద్రతతో సహా పలు కీలక అంశాలపై ఆమె అమెరికాతో చర్చించారు. అమెరికా పర్యటన తర్వాతే ఆమె ట్రంప్ సర్కారుకు హెచ్చరికలు పంపటం గమనార్హం. మరో రెండ్రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇలాంటి తరుణంలో ఈ రెండు పొరుగు దేశాల పరిస్థితులు మరింతగా ముదరటం చర్చనీయాంశంగా మారింది. కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకాలు విధించనున్నట్టు ట్రంప్ ఇటీవలే వెల్లడించిన విషయం విదితమే. అంతేకాకుండా, కెనడా సార్వభౌమత్వాన్ని కూడా అవమానించేలా వ్యాఖ్యలు కూడా చేశారు. వలసలు, డ్రగ్స్, అక్రమ రవాణాను కట్టడి చేయకపోతే అమెరికాలో కెనడా 51వ రాష్ట్రంగా చేరాలంటూ అప్పటి కెనడా అధినేత జస్టిన్ ట్రూడోను ట్రంప్ హెచ్చరించిన విషయం విదితమే.

ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్న కెనడా?

అమెరికా-కెనడాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నదని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ సుంకాల ప్రణాళికలు అమలైతే.. వివిధ యూఎస్ వస్తువులపై అధిక సుంకాలను విధించటానికి కెనడా సిద్ధంగా ఉన్నదని యూరోపియన్ వార్తా సంస్థ అయిన ఏఎఫ్‌పీ నివేదిక ఒకటి పేర్కొన్నది.

గెలిచేదెలా?

ఢిల్లీలో సీఎం పీఠం కోసం బీజేపీ విశ్వ ప్రయత్నాలు

- 1993లో తొలి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం.. ముఖ్యమంత్రి కుర్చీ కైవసం
- అదే మొదటి, చివరిసారి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఆప్, కాంగ్రెస్, బీజేపీ సహా పలు పార్టీలు తమ ప్రచారాలను కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ పీఠాన్ని దక్కించుకోవటమే లక్ష్యంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు, ప్రచారాలు, హామీలు, మ్యానిఫెస్టోలు, సభలు, సమావేశాలతో ముందుకెళ్తున్నాయి. ఢిల్లీలో హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఆప్.. మరొకసారి పాలనా పగ్గాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. కాంగ్రెస్, బీజేపీలు కూడా ఎన్నికల్లో విజయం సాధించి, అధికారాన్ని దక్కించు కునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ముఖ్యంగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఢిల్లీ పీఠంపై కన్నేసింది. కేంద్రంలో అధికారం, ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కార్యాలయం, ఢిల్లీ శాంతి భద్రతలు వంటి అంశాలను వాడుకొని ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్నది.

బీజేపీకి అదే ఫస్ట్ అండ్ లాస్ట్

న్యూఢిల్లీ : ఢిల్లీలో 1993లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ముఖ్య మంత్రి పీఠాన్ని దక్కించుకొని, ఇక్కడ ఐదేండ్ల పాటు ప్రభు త్వాన్ని నడిపింది. ఆ సమ యంలో ముగ్గురిని ముఖ్య మంత్రులుగా మార్చింది. ఢిల్లీలో.. ముఖ్య మంత్రి పీఠాన్ని చేజిక్కించు కోవటం బీజేపీకి అదే మొదటి, చివరిసారి. ఆ తర్వాత 2013 అసెంబ్లీ ఎన్నికల్లో మిగతా పార్టీల కంటే అత్యధికంగా 31 స్థానాలు దక్కించుకున్నా.. అప్పటి రాజకీయ సమీకర ణాలలో భాగంగా అవినీతి అంతమే లక్ష్యంగా రాజకీయాల్లో కొత్తగా అడుగుపెట్టిన ఆప్‌నకు సీఎం పీఠం దక్కింది. ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ తొలిసారి బాధ్యతలు తీసుకున్నారు. అయితే, విస్పష్ట మెజారిటీ కావాలంటూ.. కేజ్రీవాల్ సీఎం కుర్చీకి రాజీనామా చేసి, మళ్లీ ఎన్నికలకు వెళ్లారు. దీంతో 2015లో జరిగిన ఎన్నికల్లో ఆప్.. భారీ విజయాన్ని సొంతం చేసు కున్నది. 70 అసెంబ్లీ సీట్లకు గానూ.. ఆప్ 67 సీట్లను కైవసం చేసుకోగా.. బీజేపీకి మాత్రం మూడు సీట్లే దక్కాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 62 సీట్లతో కేజ్రీవాల్ ముఖ్య మంత్రి పీఠాన్ని నిలుపుకున్నారు. కాషా యపార్టీ 8 స్థానాలను దక్కించుకున్నది.

కొన్ని సీట్లలో విజయం కమలం పార్టీకి ఇప్పటికీ అందని ద్రాక్షే



ఆ స్థానాల్లో విజయం సాధించలేని కమలం పార్టీ

ఢిల్లీ అసెంబ్లీకి 1993 నుంచి 2020 వరకు.. మొత్తం ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఆప్, కాంగ్రెస్‌లు మూడుసార్ల చొప్పున సీఎం పీఠాన్ని దక్కించుకున్నాయి. బీజేపీ మాత్రం ఒక్కసారి మాత్రమే ముఖ్యమంత్రి కుర్చీని దక్కించుకున్నది.

ఢిల్లీ ప్రజలు బీజేపీని దూరం పెట్టి దాదాపు రెండు దశాబ్దాలకు పైనే కావస్తున్నది. ఢిల్లీలో జరిగే ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొన్ని సీట్లు మాత్రం బీజేపీకి దక్కటంలేవు. 1993 నుంచి 9 సీట్లు, 2008 నుంచి 12 స్థానాలను ఆ పార్టీ దక్కించుకోవటంలో విఫలమవుతున్నది.

ఈ 12 సీట్లలో మాటియా మహల్, బల్లిమారన్, అంబేద్కర్ నగర్, సీలంపూర్, ఓఖ్లా, సుల్తాన్‌పూర్ మజ్రా, మంగోళ్‌పురి, జంగ్‌పురా, డియోలిలు ఉన్నాయి. సుల్తాన్‌పూర్ మాజ్రా, అంబేద్కర్ నగర్, డియోలి, మంగోల్‌పురి, కోండ్లి లు ఎస్సీ రిజర్వ్ స్థానాలు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై కేంద్ర హౌం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపటంతో.. ఇక్కడి రిజర్వ్‌స్థానాల్లో విజయంపై ఢిల్లీ బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆప్, కాంగ్రెస్‌లు ఎన్నికల ప్రచారాల్లో ఆయుధంగా మలుచు కుంటున్నాయి. దీంతో ఢిల్లీలోని ఇతర ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలోనూ కాషాయపార్టీకి తీవ్ర నష్టం కలగక మానదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఇక మిగిలిన ఏడు నియోజవర్గాలలో ముస్లిం జనాభా గణనీయమైన సంఖ్యలో ఉన్నది. హిందూత్వ సిద్ధాంతంతో వెళ్లే బీజేపీకి ఈ స్థానాలు కూడా గెలవటం చాలా కష్టమని చెప్తున్నారు.

"పార్టీ 30కి పైగా అసెంబ్లీ స్థానాల్లో దూకుడుగా ప్రచారం నిర్వహిస్తున్నది. వాటిలో 12 రిజర్వ్ సీట్లు ఉన్నాయి. ఇందులో కొన్నింటిని బీజేపీ ఎప్పుడూ గెలవలేదు" అని ఢిల్లీ బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మోహన్‌లాల్ గిహారా అన్నారు. 2008లో ఉనికిలోకి వచ్చిన న్యూఢిల్లీ స్థానాన్నైతే బీజేపీ ఇప్పటికీ దక్కించుకోలేదు.

మురికివాడల్లో నివసించేవారి ఓట్లే కీలకం

ఢిల్లీలోని మురికివాడల్లో నివసించేవారి ఓట్లు ఈ ఎన్నికల్లో కీలకంగా మారాయి. వీరి సంఖ్య దాదాపు 20 లక్షలు ఉంటుందని అంచనా. వీరు సాంప్రదాయకంగా, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ హయాంలో కాంగ్రెస్‌కు మద్దతుదారులు. అయితే, మొహల్లా క్లినిక్‌లు, విద్యుత్, నీటి బిల్లుల తగ్గింపు , ప్రాథమిక సౌకర్యాలను అందించటం వంటి లక్ష్య విధానాల ద్వారా ఆప్ వారిని తనవైపునకు తిప్పుకోగలిగిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, మురికివాడల్లో నివసించే ప్రజల మద్దతును పొందటంపై బీజేపీ కూడా దృష్టి సారించి పలు కార్యక్రమాలను సాగిస్తున్నదని ఆ పార్టీ నాయకులు చెప్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలోని ఎంపీ సీట్లను దక్కించుకుంటున్న బీజేపీ.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం చతికలపడిపోతున్నదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 8న తుది ఫలితాలు వెలువడనున్నాయి.



లక్షలాది మంది ప్రజలు కుల, మత, ప్రాంత భేదాలేవీ లేక ఐక్యంగా పోరాడి పొందిన ఫలితాన్నే ఈ భగవత్, వారి వారసులూ అనుభవిస్తున్నారు. చరిత్రనూ తొక్కేయాలని చూస్తున్నారు. భిన్నమతాల వారు వీరులుగా పోరాడి మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిపోయారు. మీరేమో మతతత్వ కళ్లతో చూసి మాట్లాడుతున్నారు. పాశ్చాత్య దేశాల ఫాసిస్టు ఉద్యమాల నుండి ప్రేరణ పొందిన సంఘ్ సేవకులు ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛను భరించడం కష్టంగానే ఉంటుంది మరి!

ద్రోహభాషణం

సంపాదకీయం

వాళ్ల అలా మాట్లాడటం ఆశ్చర్యం అనిపించదు. వాళ్లలానే మాట్లాడుతారు. కానీ అశేష భారత ప్రజలు వాటినంగీకరించరు. న్యాయము, చట్టము, రాజ్యాంగము, ప్రజాస్వామ్య వ్యవస్థ ఏవీ కూడా ఒప్పుకోవు! అయినా వాళ్ల చరిత్ర పుట్టుక తెలిసిన వాళ్లకు ఈ మాటలు కొత్తేమీ కాదు. ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ, ఒక్కొక్క ప్రజాస్వామిక సంస్థనీ తొక్కుకుంటూ ఇపుడు స్వాతంత్ర్యం, రాజ్యాంగం మీదకీ వచ్చేస్తున్నారు. ఇప్పుడీ అనాగరిక సంభాషణలను నిర్భయంగా పలుకుతున్నారు. నిలువరించి, నిలేయకపోతే ఎంతకైనా తెగించే అవకాశమూ ఉంది. జాగరూకులమై ఉండాలి మనమిప్పుడు. లేకుంటే ప్రమాదం వెన్నంటుతుంది.

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి ఐదేండ్లయిన సందర్భంగా ఆజాదీ అమృత మహోత్సవాలు జరుపుకుని నడుస్తున్న వేళ, ఇది స్వాతంత్ర్యమేకాదని గుర్తించ నిరాకరించడం ఈ దేశభక్త నాయకునికి ఎలా సాధ్యమయింది! ఈ మధ్య రాష్ట్రీయ స్వయం సేవక సంఘం అధిపతి మోహన్ భగవత్ మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న వచ్చింది అసలు స్వాతంత్ర్యం కాదని, 2024 జనవరి 22న అయోధ్యలో రామమందిర ప్రతిష్టాపన తోనే దేశానికి నిజమైన



స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నాడు. అంతేకాదు, రాముడు, కృష్ణుడు, శివుడు కేవలం దేవుళ్లే కాదు, మన నాగరికతా విలువలకు, సనాతన ధర్మానికి గుర్తులు అని బోధించారు. రెండు విలువల మధ్య యుద్ధం జరిగి విజయం పొందిన సందర్భం అని సెలవిచ్చారు. ఇది అత్యంత దారుణమైన విషయం. రాముడు, కృష్ణుడు, శివుడు ఇంకా ముప్పది మూడు కోట్ల దేవుళ్లు ఉండవచ్చు గాక, వారిని విశ్వాసాల మేరకు ఆరాధించనూవచ్చు. కానీ వారికి గుడులను నిర్మించడానికి, విగ్రహాలు ప్రతిష్టించడానికీ, మన దేశ స్వాతంత్ర్యానికి ముడివేయటం అసంబద్ధమైన వాదం మాత్రమే. ఒక దేవుని గుడిని కూలగొట్టి, మరో దేవునికి గుడి కట్టడం స్వాతంత్ర్యం ఎలా అవుతుంది! అంతేకాదు, ఈ వాదన మనం ఇంతకాలంగా అనుభవిస్తున్న స్వేచ్ఛను, ఆధునిక ప్రజాస్వామిక విధానాన్ని, రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసినట్టేకదా! రెండువందల యేండ్ల ఆంగ్లేయుల పాలన నుండి విముక్తి పొందేందుకు ప్రజలు పోరాడిన చరిత్రనంతా చులకన చేయటం వారికే చెల్లింది. ఎంతోమంది యోధులు తమ జీవితాలను త్యాగం చేశారు. ప్రాణాలిచ్చారు. ఉరికంభాలెక్కారు. ఆఖరికి స్వేచ్ఛను సాధించారు. ఎలాంటి పాలన కావాలో ఆలోచించి ప్రజాస్వామిక విలువలతో కూడిన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వీటన్నింటినీ ఒక్కమాటతో తిరస్కరిస్తారా! ప్రాణత్యాగాలను విస్మరించి, స్వాతంత్ర్యాన్నే కించపరుస్తారా!

అవును, మీరు రాజుల కాలంనాటి బానిస భావాల వారసులు. నేటి ఆధునిక ప్రజాస్వామిక విలువలంటే చిర్రెత్తుకొస్తారు. మనుధర్మం తప్ప రాజ్యాంగమంటే మీకు ద్వేషం. మొన్న మొన్నటి వరకూ మన మూడు రంగుల జెండాను కూడా ఎగరేయడానికి పూనుకోలేదు కదా! ఎందుకెగరేస్తారులే! అసలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటే కదా! కాదు కాదు, ఆ పోరాటానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి వంతపాడిన వారసులు మీరనే విషయం ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం. పోరాడటం, త్యాగం చేయటం మీకు గిట్టని విషయం. ఒక్కసారి చరిత్రను చూడండి. లక్షలాది మంది ప్రజలు కుల, మత, ప్రాంత భేదాలేవీ లేక ఐక్యంగా పోరాడి పొందిన ఫలితాన్నే ఈ భగవత్, వారి వారసులూ అనుభవిస్తున్నారు. చరిత్రనూ తొక్కేయాలని చూస్తున్నారు. భిన్నమతాల వారు వీరులుగా పోరాడి మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిపోయారు. మీరేమో మతతత్వ కళ్లతో చూసి మాట్లాడుతున్నారు. పాశ్చాత్య దేశాల ఫాసిస్టు ఉద్యమాల నుండి ప్రేరణ పొందిన సంఘ్ సేవకులు ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛను భరించడం కష్టంగానే ఉంటుంది మరి! స్వేచ్ఛ కోసం జరిగిన సమరంలో అసలు పాల్గొనని వారి మాటలు ఇంతకన్నా గొప్పగా ఏం ఉంటాయి. చెప్పుకోవటానికి సచ్చరిత్రే లేనివాళ్లు హీనులుగా మిగిలిపోకతప్పదు.

మోహన్ భగవత్ మాటలు తేలికగా తీసుకుంటే మోసపోతాము. అవి వారి భవిష్యత్ ఆచరణలో భాగంగా చెప్పిన మాటలు. మన రాజ్యాంగాన్ని, దాని విలువలను పక్కనపెట్టి సనాతన ధర్మం పేర మనుధర్మాన్ని తీసుకురావాలనే ప్రయత్నంలోంచి వచ్చిన మాటలవి. దేశభక్తి గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే వీళ్ల అసలు దేశభక్తి ఇది. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని కించపరచడం, దేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించ నిరాకరించడం వీరి నైజం. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. చైతన్యంతో తిప్పికొట్టాలి.

1998లో వచ్చిన వాజ్‌పేయి ప్రభుత్వం చంద్రబాబు మద్దతువల్ల ఏడాది నడిచినా బలం లేక కూలిపోయింది. ఇంత రాజకీయ అస్థిరత్వం, అశాంతి ఎవరిది మరి? కానీ ఆ కాలంలోనూ రాజ్యాంగాన్ని తిరగదోడేందుకు జస్టిస్ వెంకట్రామయ్య కమిషన్ వేసి విఫలయత్నం చేశారు. అధ్యక్ష తరహా పాలన మెరుగైందని అద్వానీ బాహాటంగా మాట్లాడారు. కార్గిల్ నేపథ్యంలో వాజ్‌పేయి 1999లో మూడోసారి కాస్త స్పష్టమైన ఆధిక్యతతో వచ్చినా ఆ కాలంలోనే గుజరాత్ మారణకాండతో సహా అనేక దారుణాలు జరిగాయి. తెహల్కా టేపుల వంటివి వచ్చాయి. తాముగా ఏడాది ముందే ఎన్నికలకు వెళ్లి భంగపడ్డారు.ఈ అస్థిరత్వమంతా ఎవరి పుణ్యం?

మోడీ హయాంలో గుజరాత్ మారణకాండ దేశాన్ని కుదిపేసింది. ప్రపంచం నివ్వెరపోయింది.ఆయన్ను దింపేయాలని వాజ్‌పేయి, ఆయన్ను చూసి చంద్రబాబు అన్నారు గానీ తర్వాత తగ్గారు.ఇదిగో అలాంటి భయానక సమయంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు మోడీ. 2002 జులై19న శాసనసభ తీర్మానం ఆమోదించిన గవర్నర్ భండారీ శాసనసభను రద్దు చేశారు. ఇప్పుడు 'ఒకేదేశం ఒకే ఎన్నిక' అంటున్న ఈ అధినేత అప్పుడు తొందరగా ఎన్నికలు జరిపించాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తేవడమే గాక రాజకీయ లీగల్ పోరాటం కూడా చేశారు. కేసులు వేశారు, మారణ కాండ శరణార్థులు ఇంకా శిబిరాల్లో వుండగానే ఎన్నికలు పూర్తి చేసి గెలిచామనిపించుకున్నారు.అదో భయానక రాజకీయ క్రీడ.

అస్థిరతకూ అశాంతికి అసలు కారణమెవరు?



తెలకపల్లి రవి

మాటిమాటికీ ఎన్నికలతో అభివృద్ధికి ఆటంకమనీ, అస్థిరత్వమనీ ప్రధాని మోడీ ఆయన వత్తాసు దారులు అదే పనిగా చెబుతున్నారు. పార్లమెంటులో నిబంధనలకు విరుద్ధంగా జమిలి బిల్లు ప్రవేశపెట్టి బలం లేదని తెలుసు గనక వాయిదా వేసుకున్నారు.ఇందుకు సంబంధించిన భిన్న వాదోపవాదాలు ఒకటైతే అసలు ఈ హడావుడి చేసిన బీజేపీ వారి గతం ఎట్టిదనే ప్రశ్న చాలా ఆసక్తి కలిగిస్తుంది. గత ముప్పై ఏళ్లలో అత్యధికంగా అస్థిరత్వంతో అశాంతితో ఆటంకాలు కలిగించిన వారు ఎవరంటే వేలు బీజేపీవైపే చూపిస్తుంది.ఉంటే తాముండాలి లేకుంటే మరొకరిని ఉండనివ్వకూడదనేది వారి రాజకీయ తాత్వికత. ఇక అధికారం కోసం మతతత్వం ప్రకోపింప చేయడం వారి సైద్ధాంతిక తాత్వికత. ఇందుకు ఉదాహరణలు లెక్కలేనన్ని. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు 1959లో కేరళ నంబూద్రిపాద్ ప్రభుత్వంతో మొదలెట్టి ఇష్టం లేని సర్కార్లను వరుసగా కూలదోసిన మాట నిజమే. కానీ ఈ విషయంలో బీజేపీ రికార్డు మరో విధంగా హానికరమైందని గుర్తించవలసి వుంది.

స్వార్థం కోసం చిచ్చు

కాంగ్రెస్‌ను ఎదుర్కోవడమే తమ లక్ష్యమైనట్టు మాట్లాడే బీజేపీ దాని పూర్వరూపమైన జనసంఘం తాము లేనిచోట్ల మరెవరూ వుండకూడదనే స్వార్థపూరత వైఖరినే అనుసరించారు. ప్రతిపక్ష సంఘటన ప్రభుత్వాలు ఏర్పడిన చోట్ల కూడా తగవులతో మతకలహాలతో చిచ్చుపెట్టి పడగొట్టారు. 1967లో మొదటిసారి వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడగా బెంగాల్, కేరళలోనూ సీపీఐ(ఎం) నాయకత్వం వున్నచోట్ల తప్ప మిగిలిన చోట్ల ఇలాంటి సర్కార్లు ఏర్పడ్డాయి. అవేవీ పూర్తికాలం నిలిచింది లేదు.జనసంఘం నాయకులు రకరకాల పేచీలతో అస్థిరత్వం పాలుచేశారు. ఇక వామపక్ష సర్కార్లను కేంద్ర కాంగ్రెస్ రద్దు చేస్తూ వచ్చింది.ఈ నేపథ్యం చివరకు 1975లో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధింపుతో పరాకాష్టకు చేరింది. దానికి తక్షణ ప్రత్యా మ్నాయంగా జనతా పార్టీ ఏర్పడి అధికారంలోకి వచ్చింది. జనతా పార్టీలో జనసంఘం కూడా వున్నా ప్రజాస్వామ్య పరిరక్షణ కోణంలో సీపీఐ(ఎం) కూడా మద్దతునిచ్చింది.అయితే పూర్తి మెజార్టీతో జనతా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆరెస్సెస్ తరహా మతరాజకీయాలను పాఠ్యపుస్తకాల్లో జొప్పించడమనే అజెండాతో వివాదం ప్రారంభమైంది. ఈ క్రమంలో చివరకు ఆరెస్సెస్ ద్వంద్వ సభ్యత్వం వదులుకోవడానికి వాజ్‌పేయి, అద్వానీల నాయకత్వంలో జనసంఘ్ వర్గం నిరాకరించడం వల్ల ఆ ప్రభుత్వం పడిపోయే స్థితి వచ్చింది.ఆ సమయంలో చరణ్‌సింగ్‌ను బలపర్చి జనతా పార్టీ చీలికకు కారకులయ్యారు. రాష్ట్రాల్లోనైతే అన్నిచోట్లా ఈ ఇద్దరి తరపు నాయకులే చీలికలు తెచ్చి సగం సగం చొప్పున ముఖ్యమంత్రి పదవులు చేజిక్కించుకున్నారు.తర్వాత ఆయన్నూ జనసంఘం వర్గం ఆయన్నూ వెన్నుపోటు పొడిచింది.

ఎన్టీఆర్, చంద్రబాబు తేడా

1980లో ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి రాగలిగారు. వచ్చీ రాగానే ఆమె రాష్ట్రాల్లో జనతా ప్రభుత్వాలను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. 80వ దశకం పొడుగునా బీజేపీ లేకుండా కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పడాలన్నదే వామపక్షాల విధానంగా వుండేది. టీడీపీ వ్యవస్థాపకుడు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వంటివారు అందరూ కలసి వుండాలన్నా వామపక్షాలు విడిగానే వుంటూ వచ్చాయి. 1986లో రాజీవ్‌గాంధీపై వీపీసింగ్ తిరుగుబాటు తర్వాత మరోసారి జనతా తరహా ప్రయోగం జరగకుండా అడ్డుకోగలిగాయి. నేషనల్ ఫ్రంట్‌లోనూ బీజేపీకి చోటు లభించలేదు. వీపీసింగ్ వామపక్షాలు తన సహజ మిత్రులంటూ వారితో వేదిక పంచుకోవడానికి నిరాకరించారు గానీ స్థానికంగా సర్దుబాటుకు అంగీకరించారు. కాంగ్రెస్ ఓటమితో వీపీ సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు తమకు స్థానం లభించకపోవడం బీజేపీకి మింగుడు పడలేదు. ఆయన మండల్ నివేదికను ఆమోదించడం అసలే నచ్చలేదు. దాంతో మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ అంటూ అద్వానీ రథయాత్ర ప్రారంభించారు. ఆ అంశంపైనే ఆ ప్రభుత్వాన్ని పడగొట్టారు కూడా. వీపీసింగ్ తర్వాత కాలంలో వాజ్‌పేయి ఏ మాత్రం బలం లేకున్నా సర్కారు ఏర్పాటు సంకేతాలిచ్చారు, తలుపులు తెరుచుకుని కూచున్నామన్నారు. కానీ ఎవరూ కలవలేదు. అలా రెండోసారి కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని వారే అస్థిరత్వం పాలుచేశారు. పీవీ నరసింహారావు హయాంలో దాగుడు మూతలాడుతూ బాబరీ మసీదును కూలదోసి ప్రపంచవ్యాపితంగా నిరసనకు కారణయ్యారు. ఆ సమయంలో వారి ఆధ్వర్యంలోని నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం అనివార్యమైంది. మసీదు కూల్చివేత ఘటనల తర్వాత 1994లో బీజేపీతో పొత్తుకు ఎన్టీఆర్ నిరాకరించారు. ఎన్టీఆర్‌పై తిరుగుబాటుచేసిన చంద్రబాబు నాయుడు నిలదొక్కుకునే వరకూ, 1996 ఎన్నికలవరకూ వామపక్షాలు, లౌకిక పార్టీలతో వున్నారు. తర్వాత మాత్రం మారిపోయారు,



> మధ్యంతర ఎన్నికల ద్వారా వచ్చిన ఒక నేత ఒకే తేదీన అన్ని ఎన్నికలు జరపాలని పట్టుపట్టడంలో రాజకీయమేమిటో ఎవరికైనా అర్థమవుతుంది. ఈ కాలంలో ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మారాయో ఎన్ని ఫిరాయింపులు జరిగాయో దేశమంతటికీ తెలుసు.ఈ మధ్యలో మెజార్టీ మతతత్వాన్ని మసీదుల తగాదాలను రగిలించడం ఒకవైపు, కార్పొరేట్ దోస్తి మరో వైపు. కాంగ్రెస్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వాల రద్దుకాగా దొడ్డిదోవన ఫిరాయింపులతో ఈడి, సిబిఐ, ఐటి త్రిశూల వ్యూహంతో ప్రభుత్వాలను కైవసంచేసుకోవడం మోడీ రాజకీయం. ఈ పూర్వరంగంలో ఒకేదేశం ఒకే ఎన్నిక అనే జమిలి మంత్రం ప్రయోగం అనైతిక అప్రజాస్వామిక రాజకీయాలకు ముసుగు మాత్రమేనన్నది స్పష్టం.

వాజ్‌పేయి ప్రహసనం

1996లో కాంగ్రెస్ బయటనుంచి ఇచ్చే మద్దతుతో ఈ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయగల స్థితి వున్నా.. అధికారం కోసం ఆరాటంలో వాజ్‌పేయి ఏమాత్రం మెజార్టీ లేకుండా కేవలం 160 సీట్లతో 1996లో సర్కారు ఏర్పాటు చేసి 13 రోజుల్లో అవమానకరంగా దిగిపోయారు. తర్వాత ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని సహించలేక రెండేండ్ల లోనే కాంగ్రెస్‌తో కలసి కూలదోశారు.1998లో వచ్చిన వాజ్‌పేయి ప్రభుత్వం చంద్రబాబు మద్దతువల్ల ఏడాది నడిచినా బలం లేక కూలిపోయింది. ఇంత రాజకీయ అస్థిరత్వం, అశాంతి ఎవరిది మరి? కానీ ఆ కాలంలోనూ రాజ్యాంగాన్ని తిరగదోడేందుకు జస్టిస్ వెంకట్రామయ్య కమిషన్ వేసి విఫలయత్నం చేశారు. అధ్యక్ష తరహా పాలన మెరుగైందని అద్వానీ బాహాటంగా మాట్లాడారు. కార్గిల్ నేపథ్యంలో వాజ్‌పేయి 1999లో మూడోసారి కాస్త స్పష్టమైన ఆధిక్యతతో వచ్చినా ఆ కాలంలోనే గుజరాత్ మారణకాండతో సహా అనేక దారుణాలు జరిగాయి. తెహల్కా టేపుల వంటివి వచ్చాయి. తాముగా ఏడాది ముందే ఎన్నికలకు వెళ్లి భంగపడ్డారు.ఈ అస్థిరత్వమంతా ఎవరి పుణ్యం?

ముందస్తు నేత మోడీ

ఇక ఇప్పుడు జమిలి సామ్రాట్ నరేంద్రమోడీ కార్యభూమి గుజరాత్ కథ చూద్దాం. వాజ్‌పేయి హయాంలోనే అక్కడ 1995లో కేశూభాయ్ పటేల్ ముఖ్యమంత్రికాగా మోడీ ఆరెస్సెస్ తరపున ప్రతినిధి. కేశూభాయ్‌తో శంకర్‌సింగ్ వాఘేలా విభేదించడంతో ఆ ప్రభుత్వం ప్రతిష్టంభనలో పడిన పరిస్థితిని తాను ఉపయోగించుకున్నారు. మధ్యలో రాజీ అభ్యర్థిగా సురేష్‌మెహతాను సీఎంను చేసినా పెద్దగా నడిచింది లేదు. వాఘేలా స్వంతంగా పార్టీ ఏర్పాటు చేసి చీలిపోవడమే అందుకు కారణమైంది.1998 ఎన్నికల నాటికి మళ్లీ కేశూభాయ్ పటేల్‌ను తెచ్చినా నిలిచే పరిస్థితి లేకపోయింది. భూకంపం సహాయ కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడ్డారనే కారణంతో 2001లో ఆయన్ను తప్పించి మోడీని సీఎంగా చేశారు.ఇదంతా ఏపాటి స్థిరత్వమో చూడొచ్చు. మోడీ హయాంలో గుజరాత్ మారణకాండ దేశాన్ని కుదిపేసింది. ప్రపంచం నివ్వెరపోయింది.ఆయన్ను దింపేయాలని వాజ్‌పేయి, ఆయన్ను చూసి చంద్రబాబు అన్నారు గానీ తర్వాత తగ్గారు.ఇదిగో అలాంటి భయానక సమయంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు మోడీ. 2002 జులై19న శాసనసభ తీర్మానం ఆమోదించిన గవర్నర్ భండారీ శాసనసభను రద్దు చేశారు. ఇప్పుడు 'ఒకేదేశం ఒకే ఎన్నిక' అంటున్న ఈ అధినేత అప్పుడు తొందరగా ఎన్నికలు జరిపించాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తేవడమే గాక రాజకీయ లీగల్ పోరాటం కూడా చేశారు. కేసులు వేశారు, మారణ కాండ శరణార్థులు ఇంకా శిబిరాల్లో వుండగానే ఎన్నికలు పూర్తి చేసి గెలిచామనిపించుకున్నారు.అదో భయానక రాజకీయ క్రీడ. ఈ విజయం తర్వాత 2004 ఎన్నికల నాటికి జాతీయతారగా బీజేపీ ఆయన్ను ఊరేగించింది. అగ్రనేతలైన వాజ్‌పేయి,అద్వానీలు ఇద్దరినీ వెనక్కు నెట్టి నెమ్మదిగా తాను కేంద్రస్థానంలోకి వచ్చారు,

రాజకీయ ముసుగు

మధ్యంతర ఎన్నికల ద్వారా వచ్చిన ఒక నేత ఒకే తేదీన అన్ని ఎన్నికలు జరపాలని పట్టుపట్టడంలో రాజకీయమేమిటో ఎవరికైనా అర్థమవుతుంది.ఈ కాలంలో ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మారాయో ఎన్ని ఫిరాయింపులు జరిగాయో దేశమంతటికీ తెలుసు.ఈ మధ్యలో మెజార్టీ మతతత్వాన్ని మసీదుల తగాదాలను రగిలించడం ఒకవైపు, కార్పొరేట్ దోస్తి మరో వైపు. కాంగ్రెస్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వాల రద్దుకాగా దొడ్డిదోవన ఫిరాయింపులతో ఈడి, సిబిఐ, ఐటి త్రిశూల వ్యూహంతో ప్రభుత్వాలను కైవసంచేసుకోవడం మోడీ రాజకీయం. ఈ పూర్వ రంగంలో ఒకేదేశం ఒకే ఎన్నిక అనే జమిలి మంత్రం ప్రయోగం అనైతిక అప్రజాస్వామిక రాజకీయాలకు ముసుగు మాత్రమేనన్నది స్పష్టం. ■

అదానీ - ఆర్థిక వ్యవస్థ



చాయి తాగుతూ పేపర్ చదువుతున్న పుష్పకుమార్ ఒక్కసారిగా పెద్దగా నవ్వాడు. సరిగ్గా చెప్పాలంటే పాత సినిమాలో విలన్‌లా వికటాట్ట హాసం చేశాడు. వంటింట్లో పనిలో ఉన్న లక్ష్మి కంగారుపడి హాల్లోకి వచ్చింది.

"చూశావా! చివరికి మంచే గెలుస్తుంది!" అన్నాడు పుష్ప కుమార్ భార్యతో.

"చివరికి మంచి గెలిచే మాట నిజం! అంతేకాని గెలిచిన ప్రతిదీ మంచి కాకపోవచ్చు. ఒక్కసారి చెడు కూడా గెలుస్తుంటుంది. అంత మాత్రాన అది అంతా మంచి కాదు!" అన్నది లక్ష్మి.

"మీ నాన్న ఇలా పెంచాడేమిటి? దేన్నీ ఓపట్టాన ఒప్పుకోవు!" అన్నాడు పుష్పకుమార్ చిరాగ్గా!

"మిమ్మల్ని ఇలా తయారు చేశారేమిటీ అని మా మామయ్య గారిని నేను అనలేను! ఇంతకూ మీ వికటాట్టహాసానికి కారణం సెలవియ్యండి మహా ప్రభూ!" అన్నది లక్ష్మి చేతులు జోడించి.

"హిండెన్‌బర్గ్ దుకాణం మూసేశారంట!" అన్నాడు పుష్పకుమార్ చిద్విలాసంగా.

"ఆ దుకాణం మూసేస్తే మీకెందుకింత ఆనందం!" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"మన దేశ ఆర్థికవ్యవస్థను దెబ్బతీయాలని ఎన్ని కుట్రలు చేసింది? చేసిన పాపం ఊరికే పోదు! సనాతన ధర్మం జోలికొస్తే పుట్టగతులుండవు!" అన్నాడు పుష్పకుమార్.

"నేను మీకు చాయి మాత్రమే ఇచ్చాను" అందులో మీరేదైనా కలపుకున్నారా ఏమిటి? ఒకదానికొకటి సంబంధం లేకుండా మాట్లాడుతున్నారు? ఆర్థిక వ్యవస్థకూ, సనాతన ధర్మానికి లింకు ఏమిటండి?" అడిగింది లక్ష్మి.

"పిచ్చిదానా అదొక ధర్మసూక్ష్మం! అలాంటి లోతైన విషయాలు నీలాంటి అర్భకులకు అర్థం కావులే!" అన్నాడు పుష్పకుమార్ మరింత చిద్విలాసంగా!

"అర్థం అయ్యేలా చెప్పండి స్వామి!" అన్నది లక్ష్మి

"మునిగిపోతున్న దేశ ఆర్థికవ్యవస్థను నిలబెడుతున్నది ఎవరో తెలుసా? అదానీ, అంబానీలే! వారిద్దరినీ దెబ్బతీస్తే ఈ దేశ ఆర్థికవ్యవస్థ కుప్పకూలుతుంది! దేశ ఆర్థిక వ్యవస్థ కూలిపోతే పెద్దాయన కీర్తి, ప్రతిష్టలు దెబ్బతిని ప్రభుత్వం పడిపోతుంది! ఈ భూ ప్రపంచంలో సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఏకైన ప్రభుత్వం అధికారం లేకపోతే, సైతానులు, రాక్షసులు అంధకారంలోకి వస్తారు. అప్పుడంతా అల్లకల్లోలం! వినాశనమే! సరిగ్గా చెప్పాలంటే ప్రళయమే వచ్చి సర్వనాశనం అవుతుంది!" అని పుష్పకుమార్ అంటూండగానే లక్ష్మి కళ్లు తిరిగి కింద పడిపోయింది!

నీళ్లు తీసుకొచ్చి లక్ష్మి మొహం మీద చల్లాడు. లక్ష్మి లేచి కూర్చున్నది.

"అదానీకి నష్టం జరిగితే ప్రపంచం సర్వనాశనం అవుతుందా? అప్పుడెప్పుడో ఇందిరే ఇండియా అనే వారంటా. ఇప్పుడు ఆదానీయే ఆర్థిక వ్యవస్థ అయ్యిందన్నమాట!" అన్నది లక్ష్మి.

"అదానీ అంటే మరేమిటనుకున్నావు!" అన్నాడు పుష్పకుమార్.

"హిండెన్‌బర్గ్ సంస్థ మూసేస్తే, ఆ సంస్థ చెప్పినవి అబద్దాలు అయిపోతాయా?" అడిగింది లక్ష్మి.

"అంతేకదా! అదానీ, మోదీని, మన దేశాన్ని దెబ్బతీయడానికి ఆ హిండెన్‌బర్గ్ సంస్థ పెట్టి, అబద్దాలు ప్రచారం చేసి, అది నిరూపించలేక, ఇప్పుడు దుకాణం మూసేసి, తెరవెనక్కి పోతున్నారు!" అన్నాడు పుష్పకుమార్.

లక్ష్మి చిన్నగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు!" చిరాగ్గా అడిగాడు పుష్పకుమార్.

"హిండెన్‌బర్గ్ సంస్థ, అదానీ మీద కూడా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు చేసింది. అనేక సాక్ష్యాధారాలున్న పత్రాలు కూడా బయటపెట్టింది. అవన్నీ అబద్ధమని అనవచ్చు! కాని ఆ అక్రమాల మీద పూరిస్థాయిలో విచారణ జరిపించి, విచారణలో ఆరోపణలు రుజువు కాకపోతే అప్పుడు అదానీని, దెబ్బతీయటానికి కుట్రపన్నారని అనవచ్చు. మనదేశంలో ఇప్పటి వరకూ అదానీపై అలాంటి విచారణ ఏదీ జరగలేదు కదా!" అన్నది లక్ష్మి.

"అదానీ మీద ఎలాంటి విచారణ అవసరం లేదు! ఆయన మచ్చలేని చంద్రుడు!" అన్నాడు పుష్పకుమార్.

"ఆయన మచ్చలేని చంద్రుడే కావచ్చు. కాని చంద్రుడిని చూసిన శ్రీకృష్ణుడికి తిప్పలు తప్పలేదు. అదానీకి అంతగా అవకతవకలు చేస్తున్నా విచారణ కూడా జరిపించలేదంటే విదేశాల్లో అంతా నవ్వుకుంటున్నారు! ఇదే అమెరికా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో జరిగితే అధికారంలో ఉన్న ప్రభుత్వం రాజీనామా చేసి ఉండేది! మీరేమో సనాతన ధర్మం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు!" అన్నది లక్ష్మి.

"ఇదుగో నన్నేమైనా అను! కాని అదానీని, సనాతన ధర్మాన్ని ఏమైనా అంటే సహించను!" అన్నాడు పుష్పకుమార్ కోపంగా.

"మీరు చేస్తున్నది గవర్నమెంటు ఉద్యోగం! తింటున్నది ప్రజల సొమ్ము! ఆదాని పాట పాడటానికి సిగ్గుగా లేదు! అదాని లేనపుడు ఈదేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందింది! కాని పెద్దాయన అమలు చేస్తున్న విధానం వల్ల మనలాంటి వాళ్ల రెక్కల కష్టం అదానీ జేబు ల్లోకి వెళుతుందని తెలుసుకోండి!" ఈ దోపిడీ మనకు అర్థం కాకూడ దని సనాతన ధర్మాన్ని అడ్డుపెడు తున్నారు. ఇది అర్థం చేసుకోవటం మీలాంటి వాళ్లకి మరీ అవసరం!" అని ముగించింది లక్ష్మి.

- ఉషాకిరణ్

నజర్

విద్యార్థి సంఘాల ఎన్నికలు - ఆవశ్యకత



నాదెండ్ల శ్రీనివాస్
9676407140



విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరమని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఓ సభలో మాట్లాడారు.ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజాలం ఉన్నవారు లేకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని,విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంతపరంగా రాణించిన వారుంటే ప్రజాప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలపాటు జీవితాలను త్యాగం చేస్తారని చెప్పుకొచ్చారు. ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుందని, దాని ద్వారానే ఆయా సమస్యలు పరిష్కారమవుతాయంటూ మాట్లాడారు.ఇదొక ఆహ్వానించదగ్గ పరిణామమే.అయితే ఇవి కేవలం మాటలకు మాత్రమే పరిమితం కాకుండా ఆచరణలో అమలయ్యే విధంగా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆశిద్దాం.

అంతకన్నా ముందు ఓ విషయాన్ని కూడా గుర్తుచేయాల్సివుంది. సుప్రీంకోర్టు 2005 డిసెంబర్ 2న ఇచ్చిన ఆదేశాల ప్రకారం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ, కేంద్ర మాజీ ముఖ్య ఎన్నికల అధికారి జేఎం లింగ్డో అధ్యక్షతన విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో విద్యార్థుల యూనియన్ ఎలక్షన్లను సమీక్షించి తగిన సూచనలు చేయాలని కమిటీని నియమించింది. కమిటీ 2006 మే 26న రిపోర్ట్‌ను అందజేసింది. అదే ఏడాది సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు కమిటీ ప్రతిపాదించిన రిపోర్టును అమలు చేయాలని యూనివర్సిటీలకు, కాలేజీలకు సూచించింది. విద్యార్థి ఎన్నికల నిర్వహణకు సంబంధించి కమిటీ చాలా సూచనలు చేసింది. విద్యాసంవత్సరం మొదలైన ఆరు నుంచి ఎనిమిది వారాల మధ్యలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, ఈ ప్రక్రియ మొత్తం పది రోజుల వ్యవధి మించకుండా పూర్తి చేయాలని, దేశంలో ఉన్న యూనివర్సిటీల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించడానికి శాంతి,స్వేచ్ఛాయుతమైన వాతావరణం ఏర్పాటు చేయాలని, పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే ఆయా వర్సిటీల్లో నామినేషన్ పద్ధతిలో విద్యార్థి ప్రతినిధులను ఎన్నుకోవాలని పేర్కొంది. ఐదేండ్ల తర్వాత నామినేషన్ పద్ధతి నుంచి నిర్మాణాత్మకమైన ఎన్నికల విధానానికి రావాలని, అంటే పార్లమెంటరీ తరహాలో పరోక్షంగా లేదా అధ్యక్ష తరహాలో ప్రత్యక్షంగా లేదా రెండు కలిపిన ఎన్నికల విధానం అనుసరించాలని, విద్యార్థి సంఘాల్లో ప్రతినిధులుగా రెగ్యులర్ విద్యార్థులు మాత్రమే ఉండాలని, విద్యార్థి సంఘాల ప్రతినిధులు రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా పనిచేయాలని చెప్పింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జేఎం లింగ్డో కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం ఐదేండ్లు నామినేషన్ పద్ధతిలో విద్యార్థి నాయకులను ఎన్నుకుని,ఆ తర్వాత విద్యార్థి యూనియన్ ఎలక్షన్స్ నిర్వహించాలి.

కానీ, కోర్టు ఆదేశించి పదిహేడేండ్లు గడిచినా అంటే ఉమ్మడి ఏపీ, ప్రస్తుత తెలంగాణతో సహా చాలా రాష్ట్రాల్లో అది ఆచరణలోకి రాలేదు. కేంద్ర విశ్వవిద్యాలయాలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ,జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, రాష్ట్రస్థాయిలో కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, రాజస్థాన్, పంజాబ్ తదితర వర్సిటీల్లో కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఎన్నికలకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనివల్ల విద్యార్థుల్లో ఆర్థిక, సామాజిక,రాజకీయ చైతన్యం లేకుండా పోతోంది. విద్యలో కాషాయికరణ,ప్రయివేటీకరణ, ఫీజుల దోపిడీ, ప్రయివేటు యూనివర్సిటీల ఏర్పాటు, నిరుద్యోగం, కులం, మతం,ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం ఇలా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నా విద్యార్థులు కనీసం వారి హక్కుల కోసం గళమెత్తలేని అచేతన స్థితిలో ఉంటున్నారు.దీనివల్ల ప్రశ్నిం చేతత్వం తగ్గిపోతోంది.ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు సామాజిక,ఆర్థిక,రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొని సంఘ విద్రోహ శక్తులపై చదువుతూ పోరాటం - చదువుకై పోరాటం చేసేవాడే విద్యార్థి.అలాంటి విద్యార్థుల నిస్వార్థపు ఆలోచనలు,చర్యలు దేశ నిర్మాణానికి,ప్రగతికి దోహదం చేస్తాయి.ఇలా యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల నేతలుగా ఎదిగిన అనేకమంది నేడు దేశం కోసం,ప్రజల కోసం నిర్విరామంగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నారు.ఇలా నిస్వార్థంగా పనిచేసేందుకు ఒక్క వామపక్షాలు తప్ప మిగతా రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు జరిగిన కాలంలో విద్యావ్యవస్థను పరిశీలిస్తే నాయకులు, విద్యార్థులందరూ సామాజిక స్పృహతో చైతన్యంగా ఉండేవారు. అందువల్లనే ప్రాథమిక పాఠశాల నుండి యూనివర్సిటీల దాకా విద్యార్థి,టీచర్ నిష్పత్తి ప్రకారం నిరంతరం అధ్యాపకుల నియామకాలు జరిగాయి. నాణ్యమైన విద్యాబోధన డిమాండ్ చేయడంతో పాటు కాలేజీ, హాస్టల్ ఫీజులు సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వంతో పోరాడేవారు. అంతేకాకుండా ప్రశ్నించేతత్వం ప్రతి విద్యార్థిలో ఉండటంతో విద్యాసంస్థలు కూడా బాధ్యతా యుతంగా, జవాబుదారీతనంతో పనిచేసేవి. ఒక్క విద్యాసంస్థలకే పరిమితం కాకుండా సామాజిక ఉద్యమాల్లో కూడా విద్యార్థులు కీలకపాత్ర పోషించారు.ఉదాహరణకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం రాజకీయ పార్టీల పోరాటంకంటే ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు ముందుండి వీరోచితంగా ఉద్యమించడం వల్లనే రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైంది. ఈ పోరాటాలు సమాజం పట్ల విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తాయి.

దేశంలో ప్రస్తుతం విద్య,ఉపాధి రంగాల్లో రాజకీయ ప్రభావం లేని వ్యవస్థ అంటూ లేదు. 2014లో మోడీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఆరెస్సెస్ సంస్థలు హిందూత్వ రాజకీయాల కోణంలో చరిత్రను రాయాలని పట్టుబట్టాయి. ఇప్పటికే మూఢ నమ్మకాలను జొప్పించే అలహాబాద్ లేదా గోరఖ్‌పూర్ విశ్వ విద్యాలయం కావచ్చు,అనేక కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో జ్యోతిష్యం, వాస్తు, ఆచారాలు మొదలైన విభాగాలు ప్రారంభించ బడ్డాయి. వాల్యూ ప్రమోషన్ ప్రోగ్రాం పేరుతో యూనివర్శిటీల్లో మూఢ నమ్మకాలకు పెంచి పోషిస్తున్నారు. హాస్యాస్పదమైన విషయమేమిటంటే, యువతకు ఇది ఉపాధి అవకాశంగా కూడా ప్రచారం చేస్తున్నారు.ఈ పదేండ్ల విద్యా రంగాన్ని కాషాయీకరణ చేయడం వల్ల ఇప్పటివరకు జరిగిన నష్టం ఊహించలేనిది. దీన్ని తిప్పికొట్టడం ప్రధాన సవాల్. కేవలం ఆరెస్సెస్- బీజేపీ ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించడం ద్వారా దీనిని సరిదిద్దలేము. అది కాంగ్రెస్ కావచ్చు, ఇంకేదైనా కావచ్చు ప్రజారాజకీయ జీవితంలో మతపరమైన ఆచారాలను ఉపయోగించడం, మెజారిటీ మతపరమైన గుర్తింపును ప్రసన్నం చేసుకునే ధోరణి సర్వసాధారణం. అటువంటి పరిస్థితిలో, మతతత్వానికి వ్యతిరేకంగా చేతన పోరాటం, ప్రజా చైతన్యాన్ని విస్తరించడం శాస్త్రీయ, విమర్శనాత్మక ఆలోచనను అందించడానికి ఏకైక మార్గం. ■

దేశ రాజకీయాలను మలుపు తిప్పిన గొప్ప నేత ఎన్‌టిఆర్

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్



నవతెలంగాణ-వైరా

దేశ రాజకీయాలను మలుపు తిప్పిన గొప్ప నాయకుడు నందమూరి తారక రామారావు అని వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం వైరా మండల టిడిపి ఆధ్వర్యంలో నియోజక వర్గ ఇంచార్జి చెరుకూరి చలపతి రావు అధ్యక్షతన జరిగిన ఎన్టీఆర్ 29వ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని సమున్నతంగా నిలిపారని శ్లాఘించారు. తొలుత ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరాలో తెలుగుదేశం పార్టీ నాయకులు కిలారు సురేందర్ మన్నెపల్లి ప్రదీప్, నూకవరపు అయ్యప్ప, వెంకట నర్సిరెడ్డి, మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మెన్ సూతకాని జైపాల్, మధుసూదన్ రావు, మోతుకూరి వెంకటేశ్వరావు, బొల్లెపాలి శ్రీను, చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో

ఖమ్మం : ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఖమ్మం నగరంలో నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం లకారం ట్యాంక్ బండపై ఏర్పాటు చేసుకున్న నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మెన్ కూరాకుల నాగభూషయ్య, మాజీ సుడా చెర్మన్ బచ్చు విజయ్, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

తెలుగోడి ఆత్మాభిమాన ప్రతీక ఎన్టీఆర్

తెలుగు ప్రజల ఆత్మాభిమాన ప్రతీక ఎన్‌టిఆర్ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ అన్నారు. శనివారం ఖమ్మంలోని మాజీ ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి కృష్ణ నివాళు లర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రామనాథం తాళ్లూరి జీవన్, వాసు, పులిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29 వర్ధంతిని పురస్కరించుకొని శనివారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ధూపాటి భద్రరాజు, మాజీ అధ్యక్షుడు కూచిపూడి వెంకటేశ్వరరావు, సరికొండ శ్రీనివాసరాజు, రావూరి రవి ప్రసాద్, మొక్క కృష్ణార్జున, పాల్గొన్నారు.

బోనకల్ : టీడీపీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ దిమ్మపై జెండా ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందమూరి సత్యనారాయణ, సాదినేని హనుమంతరావు, మైనేని రవికుమార్, మరీదు బరకయ్య, బంధం రంగయ్య, మండేపూడి గోర్కి, బండి రామారావు, ఏసుపోగు నాగేశ్వరరావు, మామిళ్ళ నరసింహారావు, బంధం అనిల్, మామిళ్ళ కొండ, పులగం హనుమంతరావు, గంగుల శ్రీనివాసరావు, కొంగర జగన్మోహన్ రావు, చావా హనుమంతరావు, కొమ్మినేని వెంకటేశ్వరరావు, రావుట్ల వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

వేంసూరు : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో వృద్ధుల శరణాలయం నందు వృద్ధులకు పండ్లు, రొట్టెలను రాష్ట్ర నాయకులు బొంతు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. లింగపాలెం సెంటర్ నందు ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ నాయకులు వెల్ది జగన్మోహన్రావు, సుబ్బారావు, మామిళ్ళపల్లి వెంకటేశ్వరరావు, వేంసూరులో మధు, బోలా మురళి, జాబిశెట్టి వెంకట్ రామారావు తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

కొణిజర్ల : ఎన్టీఆర్ 29 వర్ధంతిని మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మండల అధ్యక్షుడు తాతా సుధాకర్, సీనియర్ నాయకుడు మోత్కూరి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం తోపాటు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అమ్మపాలెం పెద్దగోపతి, అనంతారం, పెద్ద మునగాల, చిన్న మునగాల, అమ్మపాలెం, తీగల బంజర, రెడ్డిగూడెం, ఎన్టీఆర్ నగర్ తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహలకు, చిత్రపటాలకు స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పూలమాలలో వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.కె సైదులు, శ్రీను, సత్యం, వెంకన్న, వెంకట్, పాల్గొన్నారు.

రక్తదానం చేసిన నాయుడు కోటి

వేంసూరు: ఎన్‌టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా వేంసూరుకు చెందిన తెలుగు యువత రాష్ట్ర నాయకులు నాయుడు కోటి శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం నందు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, రాష్ట్ర నాయకులు ఉన్నారు.

వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు అందజేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

కాంగ్రెస్ ఎన్నికలు ముందు చేసిన వాగ్దానాలలో భాగంగా రైతు కూలీలందరికీ సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థిక సహకారం అందిస్తామని చేసిన వాగ్దానాన్ని ఏ షరతులు లేకుండా ఒకేసారి అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహారావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ మీరిచ్చిన మీ మెమోరాండం జిల్లా కలెక్టర్ పంపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పాలేరు డివిజన్ నాయకులు నంద్ర ప్రసాద్, కేవీపీఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు నర్సుల వెంకటేష్, అంగిరేకుల నరసయ్య, మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దాసరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో భక్తుల సందడి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శ్రీ వారికి పంచామృతాలతో సర్వంగాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వారికి పట్టు వస్త్రాలు ధరింపజేసి పూలమాలలు అలంకరింపజేసి అంగరంగ వైభవంగా అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీఅలి వేలు మంగ పద్మావతి దేవేరులతో స్వామి వారికి భక్తుల సమక్షంలో భక్త కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన వాహనదారులు తమ వాహనాలకు పూజలు నిర్వహించుకున్నారు.

ఎన్టీ రామారావుకు నివాళులర్పించిన 'సండ్ర' కుటుంబం

నవతెలంగాణ-సత్తుపల్లి

తెలుగు ప్రజల ఆరాధ్యుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఎన్టీ రామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం సత్తుపల్లి పట్టణంలోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న ఎన్టీ రామారావు విగ్రహానికి సండ్ర సతీమణి మహాలక్ష్మి, ఆయన కుమారుడు భార్గవ దంపతులు పూలమాలవేసి నివాళు లర్పించారు.



సండ్ర క్యాంపు కార్యాలయంలో

ఎన్‌టీఆర్ వర్ధంతిని స్థానిక సండ్ర క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులు శనివారం ఘనంగా జరిపారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్ధంతిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు ఎస్కే చాంద్ పాషా, అద్దంకి అనిల్ కుమార్, గుండ్ర రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఏదులాపురం మరో మున్సిపాలిటీ

- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఫలించిన మంత్రి పొంగులేటి కృషి
- 12 పంచాయతీలు కలిపి ఏర్పాటు
- వార్డుల విభజనలో పారదర్శకత కు డిమాండ్
- కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం కేంద్రంగా కొత్త మున్సిపాలిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాజపత్రాన్ని విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత శాఖకు 12 గ్రామపంచాయతీ లతో పాటు మ్యాప్ డ్రాఫ్ట్ ను తయారు చేసి ఫైనల్ అప్రూవల్ కోసం పంపారు. 12 పంచాయతీలతో నూతన మున్సిపాలిటీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూరల్ మండలంలోని పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల, పోలేపల్లి, మద్దులపల్లి, బారుగూడెం, గొల్లగూడెం, ముత్తగూడెం, తెల్దారుపల్లి, రెడ్డిపల్లి పంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 12 పంచాయతీల్లో మొత్తం 56,647 జనాభా ఉంది. ఇప్పుడు లక్షకు పైగా చేరింది. పాలేరు శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండల నాయకులతో సంప్రదింపులు జరిపి ఫైనల్ చేసినట్లు తెలిసింది. ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటైతే జిల్లాలోని 484 పంచాయతీల్లో 12 తగ్గుతాయి.

నాడు కార్పొరేషన్ లో నేడు మున్సిపాలిటీగా...

2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇప్పుడు మున్సిపాలిటీ గా ఏర్పాటు చేస్తున్న 12 పంచాయతీల్లో ఐదింటిని అప్పట్లో ఖమ్మం నగర పాలక సంస్థలో విలీనం చేశారు. దీని పై కొంత మంది కోర్టు మెట్లు ఎక్కారు. అనంతరం మళ్లీ వాటిని పంచాయతీలుగా గుర్తిస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. నాటి నుంచి నేటి వరకు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. కార్పొరేషన్ ఎన్నికలు జరిగినప్పుడు పంచాయతీలుగా.. పంచాయతీ ఎన్నికల సమయంలో నగరపాలక సంస్థ లో విలీనమై ఉండటంతో ఈ పంచాయతీలకు నాలుగైదేళ్లుగా పాలకవర్గం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం 12 పంచాయతీలతో నూతన మున్సిపాలిటీకి శ్రీకారం చుట్టింది. ఏదిలాపురం మున్సిపాలిటీ తో జిల్లాలో పురపాలక సంఘం లేని ఏకైక నియోజకవర్గం పాలేరు కల కూడా నెరవేరినట్టయింది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండడంతో గత కొన్ని సంవత్సరాలుగా వెంచర్లు వెలసి ఈ పంచాయతీల పరిధి విస్తరించింది. జనాభా కూడా గణనీయంగా పెరిగింది. తద్వార మౌలిక వసతుల కల్పన పంచాయతీలకు భారంగా మారింది. ఈ పంచాయతీలో సగానికి పైగా ప్రాంతాలకు పాలకవర్గం కూడా లేకపోవడం సమస్యగా పరిణమించింది. వీటన్నింటికీ సులభ పరిష్కార మార్గం మున్సిపాలిటీ ఏర్పాటే నని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మున్సిపాలిటీగా ఏర్పాటు పరిష్కారంగా భావించారు. మున్సిపాలిటీ అయితే బడ్జెట్ పెరగడం ద్వారా అభివృద్ధి తోపాటు పారిశుద్ధ్య చర్యలు, మౌలిక వసతుల కల్పన మెరుగుపడుతుందని ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. గతంలో కార్పొరేషన్ లో విలీనం చేసినప్పుడు అభ్యంతర పెట్టిన ప్రజలు, ఇప్పుడు కూడా కొంత పన్ను భారం పడినా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నారు. కానీ ఆయా పంచాయతీలను వార్డులుగా విభజించే విషయంలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. వీటి విషయంలో సమతూకం పాటించాలనే డిమాండ్ ఊపందుకుంది. ఏ పంచాయతీకి ఆ పంచాయతీనే వార్డులుగా విభజించాలని, పక్క గ్రామాలతో మిళితం చేసే ఆలోచన సరికాదనే అభిప్రాయాన్ని పలు పార్టీలు వెల్లడిస్తున్నాయి.



మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవ..

పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏదులాపురం మునిసిపాలిటీ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని నూతన మున్సిపాలిటీకి అనుమతి ఇవ్వాలని 2024 జూలైలో ఆయన ప్రభుత్వానికి లేఖ రాశారు. అందులో భాగంగానే రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ నూతన మున్సిపాలిటీకి కావాల్సిన ప్రతిపాదనలు పంపారు. మంత్రి ఆదేశాలతో చకచక మున్సిపాలిటీకి కావాల్సిన అన్ని రకాల డ్రాఫ్టులను అధికారులు రూపొందించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఏదులాపురాన్ని మున్సిపాలిటీగా ప్రకటించింది. .

ఎంవీ పాలెం మండలమయ్యేనా..?

ఖమ్మం రూరల్ మండలంలోని 12 పంచాయతీలను ఓ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే మిగిలిన గ్రామాలన్నీ కలిపి ఓ మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఏర్పడింది. ఎం.వీపాలెం మండలం కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు బ్లూప్రింట్ సైతం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఎం.వీ పాలెం మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే 65 వేలకు పైగా ఓట్లు కలిగిన మండలంగా అవతరించనుంది. ప్రజల సమస్యలు తీర్చేందుకు ఇది దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా ఎం. వీపాలెంలో నూతన పోలీస్ స్టేషన్, ఎస్ హెచ్ వో (సీఐ) స్థాయి అధికారితో కార్యాలయం ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు అధికారులు ప్రపోజల్స్ పంపారు. స్థల సేకరణకు సైతం అధికారులు పరిశీలన చేసినట్లు సమాచారం. ఇదే జరిగితే ఏదులాపురం మున్సిపాలిటీతో పాటు ఎం.వీపాలెం మండల కేంద్రం ఏర్పడనుంది.

కాంగ్రెస్ జోష్...

ఏదులాపురం మున్సిపాలిటీ గా ఏర్పడటం పై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వెలిబుచ్చాయి. దీనిలో భాగంగా పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ క్రాస్ రోడ్డు లో బాణసంచా కాల్చుతూ కాంగ్రెస్ కార్యకర్తలు సంబురాలు జరిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, మండల కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అజ్మీర అశోక్, ఏనుగు మహేష్, సురేష్, వెంపటి రవి తదితరులు పాల్గొన్నారు.

భూమిలేని ప్రతీ వ్యవసాయ కార్మికుడికి రూ.12వేలు ఇవ్వాలి

- ఉపాధిహామీ పని దినాలతో సంబంధం లేకుండా పథకం అర్హులైన అందరికీ అమలు చేయాలి
- పట్టణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి
- ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి రూ.12వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ పని దినాలను కారణం చూపి వ్యవసాయ కార్మికులను అర్హత జాబితాలో నుంచి తొలగించడం సరైంది కాదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ కార్మికుడికి 12వేలు ఇస్తామని హామీ నిచ్చిందన్నారు. ఈ పథకం అమల్లో భాగంగా అనేక కారణాలు చూపెడుతూ లబ్దిదారులను తగ్గించే ప్రక్రియకు మానుకోవాలని వారన్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో అర్హత కలిగిన వారు అన పేరుతో లిస్టులను పెట్టారని, కానీ ఆ లిస్టులో చాలామంది భూమిలేని నిరుపేదల పేర్లు లేవని వారన్నారు. ఉపాధి హామీ పని దినాలు కారణం చూపి లబ్దిదారులను పథకానికి అర్హులుగా చేయడం సరైన కాదన్నారు. ఉపాధి హామీ పనితో సంబంధం లేకుండా భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఈ పథకాన్ని వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ కార్మికులందరికీ కూడా ఈ పథకాన్ని ఇవ్వాలన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ ఇటీవలనే కేవలం కాగితాల మీద మాత్రమే ఏర్పడింది తప్ప, అవి నేటికీ గ్రామాలుగానే ఉన్నాయని, వ్యవసాయం సాగుతుందని, వందలాదిమంది వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులు చేస్తున్నారని వారు తెలియజేశారు. ఆ గ్రామంలో ఉపాధి హామీ పనులు నిలిపివేయడమే కాకుండా ప్రస్తుత పథకం ఆ పరిధిలోని పేదలకు అమలు చేయకపోవడం సరైన కాదన్నారు. అలాగే ఖమ్మం నగర పాలక సంస్థలో కొన్ని ఏరియాల్లో నేటికీ వ్యవసాయం సాగులో ఉందని, వైరా మున్సిపాలిటీ, మధిర మున్సిపాలిటీ పరిధిలో కూడా కొన్ని గ్రామాలు వ్యవసాయం నడుస్తుందని ఆ గ్రామాల్లోని వ్యవసాయ కార్మికులందరికీ కూడా 12వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన కార్యక్రమంలో, ఇతర ఆన్‌లైన్‌లో అనేకమంది పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకొని ఉన్నారని, కానీ గత ప్రభుత్వంలో పెట్టిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవడం వల్ల వేలాది మంది పేదలకు రేషన్ కార్డులు జాబితాలో లేకుండా పోయారని వారు తెలియజేశారు. అలా కాకుండా ఇతర ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న, ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరిని రేషన్ కార్డుల అర్హత జాబితాలో చేర్చాలన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై తగిన పరిష్కారం చూపాలని వారన్నారు. భవిష్యత్తులో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలందరిని కలుపుకొని ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు.



నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పనులు

- కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి
- సీపీఐ(ఎం) మండల కమిటీ డిమాండ్

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ నుండి కొత్తగూడెం వెళ్లే రహదారిపై ప్యాచ్ వర్క్ నిర్వహిస్తున్నారు. రోడ్డుకు నల్ల మట్టిని సైడ్ గ్రావెల్ గా పోస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, వాహనదారులు ప్రమాదాలకు గురి అయ్యే అవకాశం ఉందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు ఆరోపించారు. ఈ పనులన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్నారు. ఫోన్ ద్వారా కాంట్రాక్టర్‌ను ప్రశ్నించిన స్పందించలేదని, సంబంధిత ఉన్నతాధికారులు, మరమ్మతు పనులను పరిశీలించి, కాంట్రాక్టర్ పై తగిన చర్య తీసుకోవాలని రామలింగేశ్వర రావు డిమాండ్ చేశారు. డివిజన్ కమిటీ సభ్యులు నల్లమోతు మోహన్ రావు, ముచ్చింతల చెన్నయ్య, పాకాల పట్టి శ్రీనివాసరావు, సత్తెనపల్లి వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

- తుంబూరు దయాకర్ రెడ్డి

నవతెలంగాణ-నేలకొండపల్లి

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పిఎస్ఆర్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశల కృషి చేస్తుందన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వెన్నపూసల సీతారాములు, నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీ నరసయ్య, కడియాల శ్రీనివాసరావు, బొడ్డు బొందయ్య, గుండా బ్రహ్మం, దోసపాటి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్ గాంధీపదం మండల అధ్యక్షుడు బాబు రెడ్డి, మామిడి వెంకన్న, వెర్రిపోతుల సత్యనారాయణ పాల్గొన్నారు.



శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నేలకొండపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం నూతన కమిటీ చైర్మన్‌గా రాయపూడి రమేష్, ధర్మకర్తలుగా కైలాసపు కోటేశ్వరి, మోర మల్లయ్య, కొండబాల రాంబాబు, పగిడికత్తుల సత్యం, చెరుకు సీతారాములు, అనంతు సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా నూతన కమిటీ కాపాడాలని అన్నారు. దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ నుండి అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వెన్నపూసల సీతారాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీనరసయ్య, కడియాల శ్రీనివాసరావు, మామిడి వెంకన్న, బొడ్డు బొందయ్య, రాయపూడి నవీన్, గుండా బ్రహ్మం పాల్గొన్నారు.




వల్లాపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం వల్లాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రాందాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి చొరవతో వల్లాపురం గ్రామంలో ఐదు రోడ్లు మంజూరు అయ్యాయి. శనివారం శీలం వెంకటేశ్వర్లు ఇంటి దగ్గర నుండి షేక్ అబ్దుల్ మియ ఇంటి వరకు మంజూరు అయిన సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రామారావు, వేమూరి పుల్లారావు, బాజోజు రమణ, మన్నెం హనుమంతరావు, పంచాయతి సెక్రెటరీ లక్ష్మణ్, వేల్పుల నారాయణ, యర్రగాని అర్జున్, వేల్పుల బిక్షారావు, చిన్న నారాయణ, షేక్ యాకూబ్ అలి, తమ్మారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ

నవతెలంగాణ-పెనుబల్లి



రెండుకాళ్లు పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమైన దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను వితరణగా అందజేశారు. పెనుబల్లి మండలం పాతకారాయిగూడెం తండాకు చెందిన గుగులోతు భద్రుకు చిన్నతనం నుండి ఒక కాలు పనిచేయకపోయిన కష్టపడి డిగ్రీ పూర్తి చేసి బిఇడీలో జాయిన్ అయ్యాడు. కోర్సు పూర్తిచేసే సమయానికి రెండవ కాలు కూడా చచ్చుపడిపోయి మంచానికే పరిమితం అయ్యాడు. దీనితో పరీక్షలు రాయలేక బిఇడి కోర్సు పూర్తిచేయలేదు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు మంజూరు చేయలేదు. తన భార్య కూలీకి వెళితేకానీ ఇంట్లో పూటగడవని పరిస్థితి. తనకు వీల్‌చైర్ అవసరం వుందని మండాలపాడు గ్రామానికి చెందిన జోనేబోయిన అన్నపూర్ణని సంప్రదించగా తను నిర్వహించే జోనేబోయిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 7వేలు రూపాయలు విలువైన వీల్చైర్‌ను శనివారం భద్రు భార్య క్రిష్ణవేణికి అందజేశారు. తమ కూతురు చదువుకుంటుందని ఆర్థిక స్థోమతలేని తమ కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కోరారు.

నారపనేనిపల్లి యుపిఎస్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ శ్రీజ

నవతెలంగాణ-వైరా

ఒకే ఒక విద్యార్థి కలిగిన నారపనేనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ ఏసిఎల్‌బి శ్రీజ శనివారం సందర్శించారు. ఇటీవల వివిధ ప్రసారమాధ్యమాల్లో పతాక శీర్షికల్లో ప్రధాన వార్తగా నిలిచిన ఒకే ఒక విద్యార్థి గల పాఠశాలగా నారపనేనిపల్లి యూపీఎస్ జిల్లా ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించింది. వైరా మండలంలోని నారపనేనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ మండల విద్యాశాఖాధికారి కె వెంకటేశ్వర్లుతో కలిసి మూడు రోజుల క్రితం సందర్శించారు. అనంతరం పాఠశాల వయసున్న పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి గ్రామం ప్రభుత్వ బడిని నిలబెట్టాలని కోరారు. శనివారం అదనపు కలెక్టర్ శ్రీజ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలంటే పాఠశాలకి ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తే గ్రామంలో ఉన్నటువంటి తల్లిదండ్రులు పాఠశాలకు విద్యార్థులని పంపిస్తారో తెలుసుకోవడం కోసం వచ్చినట్లు తెలిసింది. పాఠశాలను సందర్శించి పరిసరాలు పరిశీలించి పాఠశాలకు ఎటువంటి సౌకర్యాలు కల్పించాలని స్థానికులను, అధికారులను విచారించి తగు నివేదిక ఇవ్వవలసిందిగా ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట వైరా డిఈ, ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ, సర్వ శిక్ష అభియాన్ ప్లానింగ్ కోఆర్డినేటర్, అకాడమీ కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్, స్థానిక మండల విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచి, మండల అభివృద్ధి అధికారిని సరస్వతి, ఎంపీఓ జ్యోత్స్న దేవి గ్రామస్తులు ఉన్నారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడానికి కావలసిన సౌకర్యాలు కల్పనలో అడిషనల్ కలెక్టర్ కు గ్రామస్థులు కొన్ని సూచనలు చేశారు.



వైరాలో కెనరా బ్యాంక్ బ్రాంచి ప్రారంభం

- ఏజిఎంకెఎస్ మాధవి హాజరు

నవతెలంగాణ-వైరా

విద్యా, వ్యాపార రంగాలు విస్తరిస్తున్న వైరా పట్టణంలో బస్టాండ్ కు అతి సమీపంలో మధిర రోడ్డులో శనివారం కెనరా బ్యాంక్ బ్రాంచిని ప్రారంభించారు. బ్యాంక్ అసిస్టెంట్ రీజినల్ మేనేజర్ కెఎస్ మాధవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బందితో పూజలు నిర్వహించిన అనంతరం ఖాతాదారుల సమావేశంలో మాధవి మాట్లాడారు. వైరా ప్రాంతం పూర్తిగా వ్యవసాయాధారితమై ఉన్నందున రైతులకు ప్రత్యేక సేవలు అందిస్తామని అన్నారు. హాజరైన భవన యజమానులు నలజాల సత్యనారాయణ ఉదయశ్రీ లను, ఖాతాదారులను బ్యాంక్ సిబ్బంది శాలువాలు పూల గుచ్చాలతో సత్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ టి.చక్రధర్, డీఎం మైలారప్ప, డిఎం అలోక్ మిశ్రా, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రూ.12వేల పథకం వర్తింపజేయాలి

- ఎంపీడీవో ఆఫీస్ ఎదుట సీపీఐ(ఎం) నిరసన

నవతెలంగాణ-రఘునాథపాలెం



మండల పరిధిలోని 37 గ్రామ పంచాయతీలో రైతు భరోసా వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయల పథకం అర్హుల జాబితా ప్రకటనలో నిరుపేద వ్యవసాయ కూలీలకు స్థానం లేకుండా పోయిందని, సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి విమర్శించారు. శనివారం వ్యవసాయ కూలీలతో కలిసి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని తెలియజేశారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి వి.అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మండలంలో వ్యవసాయ కూలీలు వేలాదిమంది పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని కానీ అమల్లోకి వచ్చేనాటికి ఊరికి 20, 30 పేర్లు మాత్రమే అర్హత పేర్లుగా ప్రకటించారని అన్నారు. ఉపాధి హామీ పథకం పని దినాలను సాకుగా చూపెడుతూ అర్హులైన కూలీలందరును ఈ పథకం నుండి అనర్హతగా మార్చారని వారన్నారు. జింకల తండ గ్రామంలో సెంటు భూమి కూడా లేని నిరుపేదలను ఈ పథకంలో చేర్చలేదన్నారు. దీనిపై అధికారులు అడగ ఉపాధి హామీ పనులు మీరు చేయలేదని సమాధానం ఇస్తున్నారన్నారు. కానీ ఆ గ్రామంలో పేదలందరికీ ఉపాధి హామీ కార్డులు ఉన్నాయి. ఉపాధి పనులకు చేశారని, కానీ వాళ్లకి ఫ్లే స్లిప్పులు ఇవ్వలేదన్నారు. కానీ వారు పనులు చేసి ఉన్నారని తెలియజేశారు. గత సంవత్సరకాలంగా వాళ్ళ చేసిన పనులు, రోజుల జాబితా ప్రకటించమని అడిగితే మా వద్ద లేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగి ఉన్నప్పటికీ వారిని జాబితాలో చేర్చకపోవడం ముమ్మాటికి సరైన పద్ధతి కాదని అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉన్నదని వారన్నారు. స్థానిక వ్యవసాయ మంత్రి ఈ సమస్యపై దృష్టి సారించి జరుగుతున్న తప్పులను సవరించి అర్హులైన పేదలందరికీ పథకాన్ని అమలయ్యే విధంగా చూడాలని కోరారు. భవిష్యత్తులో ఈ సమస్యపైన ఆందోళన పోరాటాలు చేయనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూచిపూడి నరేష్, షేక్ రహీం, మైబు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో (కులగణన, ప్రజా పాలన కార్యక్రమం) లో రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకొని పేరు రాకపోయిన వారు ఆందోళన చెంద వలసిన అవసరం లేదని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తహసీల్దార్ మన్నె ఉషాశారద తెలిపారు. శనివారం ఎరుపాలెంలో గల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రేషన్ కార్డుల సర్వే జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది లబ్ధిదారులు తమ పేర్లు రాలేదని ఆందోళన చెందుతున్నారని, లబ్ధిదారుల పేర్లు రాలేదని ఆందోళన చెందవద్దని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు తీసుకొని రేషన్ కార్డుల మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

నిరుపేదలకు అండ ఎర్రజెండా....

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రేల ఇంద్రారెడ్డి



కూసుమంచి : ప్రపంచంలో ఎక్కడైనా శ్రమజీవులు పక్షాన, నిరుపేదలకు అండగా నిలిచేది ఎర్రజెండా ఒక్కటేనని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రేల ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఈశ్వర మాదారం సీపీఐ(ఎం) గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. శ్రమజీవుల శ్రమను దోచుకుంటున్న బడ పెట్టుబడుదారులను ప్రశ్నించి, శ్రమ దోపిడి గురవుతున్న శ్రామిక వర్గాల పక్కన పోరాటాలు చేసి, నిరుపేదలకు అండగా నిలిచేది ఒక ఎర్రజెండా పార్టీ మాత్రమేనని ఆయన అన్నారు. ప్రతి పేదవాడి కష్టాన్ని తెలుసుకొని ఆ కష్టానికి పరిష్కారం చూపించే విధంగా కమ్యూనిస్టు కార్యకర్తలు ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజుపేట, రాజుపేట బజారు, ఈశ్వరమాధారం గ్రామాల శాఖ సభ్యుల సభ్యత్వాలను రెన్యువల్ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కర్ణబాబు, గ్రామశాఖ కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, సభ్యులు జవ్వాజి అచ్చాయ్య కొత్త ఉపేందర్, కనకం వీరయ్య మోడం గోపి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- ప్రజా పాలన దరఖాస్తుల సంగతి ఏమిటి?
- కుటుంబ సమగ్ర సర్వే ఎందుకు చేశారు?
- ప్రజా పాలన దరఖాస్తులలో అన్ని వివరాలు ఉన్నాయి
- మరలా ప్రజల నుంచి దరఖాస్తులు ఎందుకు?
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-బోనకల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ఎంపిక చేయనున్న ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారులను రాజకీయాలకు అతీతంగా గ్రామసభలలోనే అర్హులైన వారందరినీ ఎంపిక చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుటుంబ సమగ్ర సర్వే పేరుతో పూర్తి స్థయిలో కుటుంబాల సర్వే నిర్వహించింది అన్నారు. ఈ సర్వేలో ఎవరికి రేషన్ కార్డు లేదు, ఇల్లు ఎవరికి లేదు, భూమిలేని నిరుపేదలు ఎవరు అనే సమాచారం రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉందన్నారు. కానీ ఈ నాలుగు పథకాలకు మరల ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పటం ప్రజలను మోసం చేయటమేనన్నారు. ఆ సర్వే ప్రకారం లబ్ధిదారులని ఎంపిక చేయవచ్చునని, అలా చేయకుండా మరల దరఖాస్తుల పేరుతో ఎందుకు ప్రజలను మోసం చేస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కుటుంబ సమగ్ర సర్వే పేరుతో ప్రజాపాలనలో దరఖాస్తులు ఎందుకు తీసుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన దరఖాస్తులలో కుటుంబాలకు సంబంధించిన సమగ్ర వివరాలు ఉన్నాయన్నారు. నాలుగు పథకాలకు సంబంధించి గ్రామపంచాయతీ కార్యదర్శులకు కొంతమంది పేరుతో రేషన్ కార్డుల లిస్టు పంపించి సర్వే చేయమంటున్నారని, ఈ లిస్టులో అర్హులైన వారి చాలా మంది పేర్లు లేవన్నారు. ప్రజా పాలన దరఖాస్తులో రేషన్ కార్డు లేని వారందరూ తమకు రేషన్ కార్డు లేదని వివరించారని, వారందరికీ ఇవ్వకుండా కేవలం ప్రభుత్వం కొంతమంది పేర్లతో లిస్టు పంపించి సర్వే చేపించడం ప్రజలను మోసం చేయటం కాదా అని వారి ప్రశ్నించారు. ప్రజా పాలనలో తమకు రేషన్ కార్డు లేదని వివరించిన వారు తమ పేర్లు లేవని అనేక మంది రేషన్ కార్డు లేని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో గ్రామాలలో అప్పుడే తమ పార్టీలోకి చేరితేనే ఇల్లు ఇస్తామని లేకపోతే ఇల్లు ఇవ్వమని ప్రారంభించారని విమర్శించారు. ప్రభుత్వం ఒక నిబంధన పెట్టినప్పుడు ఆ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఇది కూడా గ్రామసభలలోనే పారదర్శకంగా అర్హులందరిని ఎంపిక చేసి ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఆనాడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేశారన్నారు. రైతు భరోసా సంవత్సరం గడిచిన నేటి వారికి ఇవ్వలేదన్నారు. ఇప్పటికే వానాకాలం పంట ముగిసిందని, యాసంగి పంట కూడా ప్రారంభమైందని ఒక్క పంటకు కూడా రైతు భరోసా ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో ఎకరానికి రూ.15000 ఇస్తామని ప్రకటించారని, కానీ ప్రస్తుతం రూ.12000 ఇస్తామని, ఇది కూడా రెండు దాఫాలుగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. కానీ నేటికీ ఒకదాఫా కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12,000 ఇస్తామని ప్రకటించారని సంవత్సరం గడిచిన ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. భూమిలేని నిరుపేదలు ఎవరో ప్రజాపాలన దరఖాస్తులలో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. 2023లో కనీసం ఉపాధి హామీ పనులకు 20 రోజులు వెళ్లిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని లింకు పెట్టటం పద్ధతి కాదన్నారు. ఉపాధి హామీ పనులకు ఎంతోమంది వ్యవసాయ కూలీలు దరఖాస్తు చేసుకుంటే పనులు చూపించలేదని, కానీ ఇప్పుడు ఉపాధి పనులకు వెళ్లిన వారికి మాత్రమే ఈ పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేస్తామండటం సరికాదన్నారు. కూలీలందరికీ ఈ పథకాన్ని వర్తింప చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా పాలన దరఖాస్తుల నమోదు సమయంలో సాంకేతిక సమస్యల వలన అనేక లోపాలు జరిగాయని ఆ లోపాలు కారణంగా అనేకమంది అర్హులు, అనర్హులుగా మారిపోయారని వీరు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ పథకాల లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం చెబుతుందని, ప్రస్తుతం అర్హులైన వారందరికీ ఇవ్వకుండా అందులో కొంతమందికి ఇచ్చి కొంతమందికి ఇవ్వకుండా ఫేస్-1, ఫేస్-2 అంటూ ప్రభుత్వం ప్రజలనే మోసం చేయటం మానుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామసభలలోనే అన్ని పథకాలకు సంబంధించిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, అలా కాకుండా తమకిష్టం వచ్చిన వారి పేర్లు పంపించి జిల్లా మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎంపిక చేశారని ప్రజలను మోసం చేస్తే సీపీఐ(ఎం) చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు చింతల చెరువు కోటేశ్వరరావు, గుగులోతు పంతు, మండల కార్యదర్శి కిలారు సురేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆచరణకు నోచుకోని ప్రజాపాలన దరఖాస్తులు

- ఇండ్ల స్థలం ఉన్న ప్రతీ లబ్దిదారుడికి ఒకేసారి ఐదు లక్షలివ్వాలి
- రేషన్ కార్డుల సమస్యలపై 22న ధర్నా
- విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలోని ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులు ఆచరణకు నోచుకోవడం లేదని సిపిఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై .విక్రం ఆరోపించారు. శనివారం ఖమ్మం సుందరయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పాలన పేరుతో ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారని, దీంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా ప్రజలు ధరఖాస్తులు చేసుకున్నారని, కాని ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే ఆధారంగా రేషన్ కార్డుల సర్వే చేస్తున్నారని ఇది సరికాదన్నారు. ఖమ్మం నగరంలో కేవలం 5,295 దరఖాస్తులను మాత్రమే సర్వే చేస్తున్నారని, కాని రేషన్ కార్డుల కోసం ప్రజా పాలన, ఆన్‌లైన్‌లో చేసుకున్న వాటిని సర్వే చేయడం లేదన్నారు. నగరంలో సుమారు 20 వేల మంది రేషన్‌కార్డుకు అర్హులు ఉన్నారన్నారు. అన్ని దరఖాస్తులను కలిపి ప్రభుత్వం సర్వే చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో గతంలో సుమారు ఐదు వేల మంది పేదలకు అప్పటి ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చిందని, కాని వారికి ఇంత వరకు ఇంటి స్థలం చూపించలేదన్నారు. వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నగరంలో 58 వేల మంది ఇళ్ళ కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారికి ఇళ్ళు మంజూరు చేసి ఇంటికి కోసం ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల రూపాయలను విడతల వారిగా కాకుండా ఒకే సారి చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు భరోసా కింద ప్రతి ఏకరాకు రూ.15 వేలు ఇవ్వాలని, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలలో రాజకీయాలకు అతీతంగా లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. రేషన్ కార్డుల సమస్యలపై ఈనెల 22న ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ.జబ్బార్, ఎస్కె. మీరా సాహెబ్, నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, వన్ టౌన్ కార్యదర్శి ఎస్కె. నాగుల్‌మీరా, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీను, అర్బన్ మండల కార్యదర్శి బత్తుల ఉపేందర్, నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాల సారథి సీపీఐ(ఎం)

- రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు జనవరి 25 నుండి 28 తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని, మహాసభల సందర్భంగా 25వ తేదీన గొప్ప బహిరంగ సభ జరుగుతుందని అధిక సంఖ్యలో పార్టీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. శనివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో సిపిఐ(ఎం) బృందం పర్యటించింది. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ సిపిఐ(ఎం) ప్రజా సమస్యల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. రైతులకు సాగునీరు, గిట్టుబాటు ధరలు కోసం, భూమిలేని నిరుపేదల సమస్యలు, కార్మికల హక్కులు, కార్మిక చట్టాలు రక్షణకై ఉద్యమాలు కొనసాగిస్తుందని అన్నారు. నిరంతరం పేదలు, కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవులు హక్కుల కోసం పోరాడుతున్నామని, ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో ఉద్యమిస్తున్న పార్టీ సీపీఐ(ఎం) అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామిక రంగాన్ని, వ్యవసాయరంగాన్ని దివాలా తీయించాయని, విద్య, వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిందని ఆయన అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలి డిమాండ్ చేశారు. 20వ తేదీన మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేదలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నవారు, ప్రభుత్వ ప్రకటించిన లిస్టులో పేర్లు లేనివాళ్ళందరూ వైరా మున్సిపాలిటీ వద్దకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, శాఖా కార్యదర్శి సంక్రాంతి పురుషోత్తమరావు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు దళితులపై వివక్ష...

- కేవీపీఎస్ జిల్లా నాయకులు బండి రమేష్
- అట్టహాసంగా కేవీపీఎస్ రూరల్ మండల మహాసభ
- మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఉప్పలయ్య, వెంకట్రావు ఎన్నిక

నవతెలంగాణ-ఖమ్మం రూరల్





స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు అవుతున్న దళితులపై వివక్ష ఇంకా కొనసాగటం దుర్మార్గమైన చర్య అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా నాయకులు బండి రమేష్ అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో కేవీపీఎస్ ఖమ్మం రూరల్ మండల మహాసభ శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన బండి రమేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా దళితులపై ఇప్పటికి దాడులు, హత్యలు, హత్యాచారాలు, అవమానాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇలాంటి ఎన్నో హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లలో అర్హులైన ఎస్సీలకు ఇండ్లు మంజూరు చేయాలని, భూమిలేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు ఎలాంటి షరతు లేకుండా ఆత్మీయ భరోసా పథకం, దళిత బంధు తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. దళిత విద్యార్థులకు విదేశీ సదుపాయం కల్పించాలని, దళిత వాడల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం కేవీపీఎస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన అరేంపుల ఉప్పలయ్యను, కార్యదర్శిగా తెల్దారుపల్లి గ్రామానికి చెందిన పగిడిపల్లి వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 16 మంది సభ్యులతో నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ, కుక్కల సైదులు, వర కుమార్, రైతు సంఘం నాయకులు ఉరడీ సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పొన్నెకంటి సంగయ్య, నంద్ర ప్రసాద్, నందిగామ కృష్ణ, వడ్లమూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి

నవతెలంగాణ-పెనుబల్లి



సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి అన్నారు. శనివారం పెనుబల్లి మండలం కమిటీ సమావేశం చలమాల సూర్యనారాయణ భవనంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం నల్లమల అరుణ ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో జరగనున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన ప్రజా సమస్యల పరిస్థితి ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని, వాటి పరిష్కారం కోసం మహాసభల్లో సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందాలి అంటే వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి కావాలని విద్య, వైద్యం, ఉపాధి అందరికీ అందుబాటులోకి రావడం, గ్రామాల్లో పట్టణాల్లో మౌలిక వసతుల సాధన కోసం ఈ మహాసభల్లో పోరాటాల రూపకల్పన చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చలమాల విట్టల్‌రావు, పెనుబల్లి మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, పార్టీ మండల కమిటీ సభ్యులు మిట్టపల్లి నాగమణి, చెమట విశ్వనాథం, భూక్య ప్రసాద్, చలమాల నరసింహారావు, కండె సత్యం, చిలక రామచంద్రు, కలకోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులకు కొత్త దరఖాస్తులు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ నాయకులు షేక్ హిమామ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

రేషన్ కార్డులకు కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలి అని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ నాయకులు షేక్ హిమామ్ అన్నారు. శనివారం ఖమ్మం త్రీ టౌన్‌లో 30 వ డివిజన్ సుందరయ్య నగర్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటికి సీపీఐ(ఎం)లో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా షేక్ హిమామ్ మాట్లాడుతూ గత సంవత్సరం జనవరి 6 న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా ఇండ్ల స్థలాలకి పింఛన్లకి, రేషన్ కార్డులకి ఇలా ఇంకా అనేక రకాల వాటికి దరఖాస్తులు తీసుకుంది. కానీ అందులో రేషన్‌కార్డుకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వలేదు. వైట్ పేపర్‌పై రాసి ఇచ్చినట్టు తెలిపారు. కావున రేషన్ కార్డు లేని వాళ్ళు అందరూ దరఖాస్తు పెట్టుకునే విధంగా, రేషన్ కార్డులలో పేర్లు చేర్పులు మార్పులు కూడా చేసుకొనే విధంగా అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఖమ్మం త్రీటౌన్ నాయకులు ఎర్ర నగేష్, ఎర్ర వెంకన్న, ఎర్ర వెంకటమ్మ, రెబ్బ సరస్వతి, పెద్దోజుమణి, హెచ్.రాములు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, ఖమ్మం
ఒ.సా. నెం: 271/2024

బిట్వీన్ :
మదూరి శ్రీనివాసరావు ..... వాది
మరియు
జువ్వాజి భవాని ...ప్రతివాది
To,
డి-2,కుంచం కిరణ్, వృత్తి :బిజినెస్, R/0, H.No: 8-5-9 నిజాంపేట, ఖమ్మం.

ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా! పైన ఉదహరించిన కేసు నందు మీకు కోర్టు నోటీసులు పంపిననూ అవి మీరు తీసుకొన కుండా తిప్పిపంపుచున్నారు. కావునా మీ హాజరు కొరకు పైన తెలుపబడిన కేసు తేదీ 23-01-2025 హాజరు నిమిత్తం కలదు. కావునా 23-01-2025 న ఉ.గం. 10:30 ని.లకు మీరు గాని మీ తరపున న్యాయవాది గానీ హాజరు కాగలరు. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించబడును.

//కోర్టు వారి అనుమతితో//
ఖమ్మం
18-01-2025
యస్. నవీన్ చైతన్య
న్యాయవాది, ఖమ్మం.
సెల్ :9440164401

మహారాజ శ్రీ గౌరవ ఖమ్మం Prohibition & Excise జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు
ఓ.యస్.నెం 1237 /2024

బిట్వీన్
వంకాయలపాటి సైదేశ్వరి మరియు ఇతరులు ...వాదులు
మరియు
1) ది తహసీల్దార్, రఘునాథపాలెం,ఖమ్మం జిల్లా
2) ఇట్టి విషయం ఎవరికి సంబంధించినదైతే అట్టి వారికి ....ప్రతివాదులు
టు
ప్రతివాది నెం.2
ఇట్టి విషయం ఎవరికి సంబంధించినదైతే అట్టి వారికి

నోటీసు

పైన తెలిపిన వాదులు డిక్లరేషన్ దావాను గౌరవ ఖమ్మం Prohibition & Excise జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఓ.యస్.నెం 1237/2024 దావా ధాఖలు చేసియున్నారు. అట్టి దావాలో ఎవరికైన అభ్యంతర, ఆక్షేపణలు ఉన్న ఎడల ది **30-1-2025 న వాయిదా ఉన్నది. కావున ఆ రోజు ఉదయం గం 10-30 ని// లకు** మీరు స్వయంగా గాని , న్యాయవాది ద్వారా గాని హాజరై మీ అభ్యంతరాలను తెలియజేయగలరు. లేనిచో సదరు కేసును మీకు పరోక్షంగా తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వులతో //
ఖమ్మం డి. నారాయణ
తేదీ :18-01-2025 న్యాయవాది, ఖమ్మం.
సెల్ నెం. 9885354398

మహారాజ శ్రీ గౌరవ ఖమ్మం Prohibition & Excise జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు
ఓ.యస్.నెం 1243 /2024

బిట్వీన్ :
వంకాయలపాటి సైదేశ్వరి మరియు ఇతరులు ...వాదులు
మరియు
1) ది తహసీల్దార్, రఘునాథపాలెం,ఖమ్మం జిల్లా
2) ఇట్టి విషయం ఎవరికి సంబంధించినదైతే అట్టి వారికి ... ప్రతివాదులు
టు
ప్రతివాది నెం.2
ఇట్టి విషయం ఎవరికి సంబంధించినదైతే అట్టి వారికి

నోటీసు

పైన తెలిపిన వాదులు డిక్లరేషన్ దావాను గౌరవ ఖమ్మం Prohibition & Excise జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఓ.యస్.నెం 1243 /2024 దావా ధాఖలు చేసియున్నారు. అట్టి దావాలో ఎవరికైన అభ్యంతర, అక్షేపణలు ఉన్న ఎడల **ది.30-01-2025న వాయిదా ఉన్నది. కావున ఆ రోజు ఉ॥ గం॥10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీ అభ్యంతరాలను తెలియజేయగలరు. లేనిచో సదరు కేసును మీకు పరోక్షంగా తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వులతో //
ఖమ్మం డి. నారాయణ
తేదీ :18-01-2025 న్యాయవాది, ఖమ్మం.
సెల్ నెం. 9885354398

మహరాజ శ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఖమ్మం
OS.NO-29/2021

1.మాదల శ్రీనివాస్ ... పిటిషనర్
మరియు
1. పుతుంబాక మహీంద్రకుమార్, తండ్రి : రఘుపతిరావు (first partner)
2. కొంగర రేణుక, భర్త :బాబురావు (second partner)
3.వేములమాడ భవానీ, భర్త:రాంప్రసాద్ (third partner)
4. నైద కవిత, భర్త:నర్సయ్య (fourth partner)
5. క్యాదసి ప్రవంతి,భర్త:ప్రీతమ్ శేఖర్ (fifth partner)
6.కొండేటి రమణరెడ్డి, తండ్రి :సైదిరెడ్డి (sixth partner)
..........ప్రతివాదులు

M/S GREEN HOMES
OFFICE ADDRES: 15-8-924/A/304 SRI SRI PLAZA, SRINAGAR-COLONY, MAMATHA HOSPITAL ROAD, KHAMMAM 507002

పై నంబరు కల దావా నందు మీ హాజరు కొరకు కోర్టు వారు ది22-01-2025 న వాయిదా వేసివున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ మీ వకీలు గారి ద్వారా గాని కోర్టు నందు ఉ.గం॥10:30 ని॥లకు హాజరై పై దావాలో మీకు ఏవిధమైన ఆక్షేపణలు యున్న తెలియపరచవలసి యుంటుంది. లేనిచో కోర్టు వారు మీ పరోక్షంగా పై దావా లో తగు నిర్ణయం తీసుకోగలరు.

(కోర్టువారి అనుమతి తో)
ఖమ్మం నెల్లూరి రవి
తేదీ :18-01-2025 న్యాయవాది, ఖమ్మం

IN THE COURT OF THE MOTOR ACIDENTS CLAIMS TRIBUNAL, II ADDL. DISTRICT JUDGE AT: KHAMMAM
I. A NO 1/2024 IN
I. A NO 59/2022 IN
MATOP NO 374/ 2020

Between:
1)Gongura mounika (miner petitioner)
2)gongura krishna(father)
---------Claim Petitioners
And
Bojedla Panduranga Rao and anothers
..Respondents
To
Respondent no 1
Bojedla Pandu Ranga Rao S/o Sankaraiah, Age: 45, Occ: Owner of the motor cycle bearing no TS -04-EG -7680 R/o H.No: 3-85 Motamarri village, Bonakal Mandal, khammam district.

NOTICE

Take Notice that the above named claim petitioner have filed the above O.P. against the respondents claiming compensation. the above case is stands posted to 29-01-2025 for your appearance. Therefore, you are here by directed to appear before the Hon'ble court on 29-01-2025 at about 10.30 A.M in person or through an advocate without fail. Filing which the matter will be decided ex-parte against you.

//By order of the court //
SEELAM CHENNA REDDY
PALAVELLI VENKATESWARLU
Advocates, Khammam
Cell : 9440423645, 9849330200

IN THE COURT OF THE I ADDL. DISTRICT JUDGE AT: KHAMMAM.
I.A NO 980/2024IN
I. A NO 981/2024 IN
I.A NO 982/2024IN
AS NO 14/2022

Between:
1) Kodirekkala Vijaya
---------Petitioner/Appellant
And
Anubrolu Naveen And others
..Respondents /Respondent
To
1.Epuri Praveen S/o late china Ramalingaih, age 35 years, (proposed party no -4)
2.Epuri Divya D/o late China Ramalingaiah , Age: 30, (proposed party no 5) Bothare R/o H.No: 11-3-115 Bank colony, khanapuram haveli, Khammam District.

NOTICE

Take Notice that petitioner /Appellant filed Appeal suit above against Anubrolu Naveen (R1) and Epuri. China Ramalinganaiah R2,during the pendency of above suit R2 died leaving his wife son and daughter as his legal hires. The petitioner filed the above petitions.U/S 5 of limitation act U/ Order 22 rule 9(2) of CPC , and Order 22 rule 4 of Cpc petitions filed and the notices of you ie proposed party 4 and 5 as not served. Take Notice that you ie proposed party No 4 and 5 have to apper before the Hon'ble court on **06-02-2025** by **10.30 A.M** either in person or through your advocate,Failing which the case will be decided exparte.

//By the order of the Hon'ble court //
KONDAPALLI
JAGANMOHAN RAO
Advocate, Khammam
Cell : 8919057578

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం : పీఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నడపబడుతున్న తెలంగాణ ఏకలవ్య మోడల్ గిరిజన విద్యాలయాల్లో పనిచేయుటకు అర్హులైన తెలంగాణ రాష్ట్రం నుండి మాత్రమే తాత్కాలికంగా స్టూడెంట్ కౌన్సిలర్ అవుట్సోర్సింగ్ పోస్టుల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు పీజీలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి సైకాలజీ లేదా క్లినికల్ సైకాలజీలో విద్యార్హతలో పొందిన మార్కుల ఆధారంగా, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయబడునని అన్నారు. అభ్యర్థులు ఈ నెల 20 నుండి 23వ తేదీలోగా తమ దరఖాస్తులను ప్రాంతీయ సమన్వయ అధికారి వారి కార్యాలయము ఐటీడీఏ భద్రాచలం నందు స్వయంగా సమర్పించాలని, దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అభ్యర్థుల విద్యార్హతల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన, ఇంటర్వ్యూ ద్వారా ఖాళీ పోస్టుల వారీగా ఎంపిక చేయబడతాయని వివరాల కోసం ప్రాంతీయ సమన్వయ అధికారి వారి కార్యాలయం భద్రాచలం చరవాణి నెంబర్ 9704178525 ద్వారా తెలుసుకోవాలని ఆయన అన్నారు. మొత్తం నాలుగు పోస్టులు కలవని ఎంపిక కాబడిన అభ్యర్థులు చర్ల, దుమ్ముగూడెం, టేకులపల్లి, సింగరేణి ఏకలవ్య మోడల్ గిరిజన విద్యాలయాల్లో పనిచేయవలసి ఉంటుందని అన్నారు. గతంలో స్టూడెంట్ కౌన్సిలర్ ఔట్సోర్సింగ్ నిర్వహించిన ఇంటర్వ్యూలు కొన్ని అనివార్య కారణాలవల్ల రద్దు చేయడం జరిగినదని ఈ విషయాన్ని దరఖాస్తు చేసిన అభ్యర్థులు గమనించగలరని ప్రాంతీయ సమన్వయ అధికారి ఖమ్మం రీజియన్ ఆర్సీఓ నాగార్జున రావు తెలిపారు.

రాజకీయ జోక్యం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా గ్రామ సభల ద్వారా పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఇందిరానగర్ గ్రామపంచాయతిలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తూ పనులు కల్పించాలని కోరుతూ పార్టీ సుందరయ్య నగర్ శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి కొడెం బోస్, ఎండీ అబ్బాస్, సోమకృష్ణ, సోమ సుజాత, వజ్జ సురేష్, పుష్పలు ఇందిరానగర్ గ్రామపంచాయతీ కార్యదర్శికి శనివారం వినతి పత్రం సమర్పించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని, అంతర్గత రోడ్ల నిర్మాణంను చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతిపత్రంలో పేర్కొన్న సమస్యల ను పరిష్కారం అయ్యే విధంగా చొరవ చూపించాలని కోరారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో పంచాయతీ గుమస్తా మృతి

- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మధు

నవతెలంగాణ-ఇల్లందు





పోలారం పంచాయతీ గుమస్తా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పోలారం గ్రామ సీనియర్ నాయకులు, ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యులు జటంగి వెంకన్న(జేకే)బ్రెయిన్ స్ట్రోక్‌తో మమత హాస్పిటల్లో వైద్యం అందిస్తున్న తరుణంలో అకాల మృతి చెందారు. జటంగి వెంకన్న మరణ వార్త తెలుసుకున్న మాస్ లైన్ పార్టీ శ్రేణులు పోలారం చేరుకొని వారి భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మధు, రాష్ట్ర నాయకులు నాయిని రాజు, ఆ పార్టీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-బూర్గంపాడు



మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించారు. మండల విద్యా శాఖ అధికారి ఎదు సింహారాజు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. మొత్తం విద్యార్థులు 171 మంది విద్యార్థులకు 140 మంది విద్యార్థులు హాజరయ్యారని 31 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. పరీక్ష ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 1:30 పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రంకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రంలో 8 మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెంట్‌గా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రవిలా దేవి వ్యవహరించారు. విద్యార్థులకు ఎటు వంటి ఇబ్బంది కలగకుండా పరీక్షా కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేశారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ వివరాలు, పెనాల్టీ రద్దు, సమయానికి వేతనాలు చెల్లింపు తదితర సమస్యలు పరిష్కరించాలి ఐఎఫ్టీయూ డిమాండ్ చేసింది. శనివారం మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్‌కి కాంట్రాక్ట్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. గోదావరిలోయ బొగ్గు కని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్‌డీ నాసర్ పాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, నల్ల రమేష్, ఏరియా అధ్యక్షులు ఆంగోత్ మంగీలాల్, సాధన పల్లి రవి, ఏరియా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు బాలు, జే.వి.ప్రసాద్, కే.గురుమూర్తి, కే.నాగేశ్వరరావు, యు.శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ధ్యాన, వైద్య, యోగా శిక్షణ

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

చుంచుపల్లి మండలంలో గల విద్యానగర్ పంచాయతీ ఆఫీస్ పక్కన శ్రీరామ ఫంక్షన్ హాల్ నందు నేడు సాయంత్రం 6.03 నిమిషాలకు యోగా పరిచయ క్లాస్ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ యోగ క్లాసులు ఉదయం 5 గంటల నుంచి 7:15 నిమిషాల వరకు ఉంటుందని తెలపారు. సాయంత్రం 6 గంటల నుంచి 8.15 నిమిషాల యోగ క్లాస్ నాన్న ప్రేమ్ నిరంతర్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావునా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయగలని కోరారు.

బీ రెడ్డి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి

నవతెలంగాణ-మణుగూరు



కార్మికులకు, సింగరేణి సంస్థ అభ్యున్నతికి బీ రెడ్డి వెంకటేశ్వర్లు చేసిన సేవలు మరువలేనివని టీజీబీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు నాగేల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కొండాపురం భూగర్భ గనికి చెందిన మేనేజర్ బీ రెడ్డి వెంకటేశ్వర్లు బదిలీపై మణుగూరు ఓపెన్ కాస్ట్‌కు వెళుతున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు అందించారు. కారుణ్య, డిపెండెంట్ నియామకాల ద్వారా కొత్తగా గనికి వస్తున్న ప్రతి ఒక్కరికీ గని మేనేజర్ ఆదర్శ ప్రాయుడని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 26 అండర్ గ్రౌండ్ మైన్‌లకు లాభాల సాధనలో కొండాపురం భూగర్భ గనినీ మేటీగా నిలపడం ఏరియాకు ఎంతో గర్వకారణమని తెలిపారు. గని నందు 2 సంవత్సరాల ఏడు నెలల కాలంలో చెప్పుకోదగ్గ ప్రమాదాలు లేవని కార్మికులకు పదోన్నతుల కల్పనలో అయన సేవలు మరువలేనివని వారంత ఆయన అందించిన సేవలు కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, బంగారి పవన్ కుమార్, వెంకటేష్, ఫిట్ సెక్రటరీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించం

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కర్ నాయక్

నవతెలంగాణ-చంద్రుగొండ



విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి భాస్కర్‌నాయక్ స్పష్టం చేశాడు. శనివారం మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని, సంబంధిత రికార్డులను సైతం ఆయన అకస్మికంగా తనిఖీ చేశాడు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ ఐదేండ్లలోపు పిల్లలకు తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సైతం గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ఆయన వెంట డీఐఓ బాలాజీ, సీహెచ్ఓ నాగభూషణం, మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్అండ్‌టీ చైర్మెన్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తాం
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఎల్అండ్‌టీ కంపెనీ చైర్మెన్ సుబ్రమణ్యం వారానికి 90 గంటలు, ఆదివారం కూడా పని చేయాలని ఇంట్లో కూర్చొని భార్య ముఖం చూస్తూ కూర్చుంటారా అని చేసిన వ్యాఖ్యలు కార్మికవర్గం మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఈ వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ హెచ్చరించారు. శనివారం భద్రాచలంలో చంద్రరావు భవన్‌లో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్మికుల జిల్లా విస్తృత సమావేశం రాష్ట్ర నాయకులు సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భూపాల్ మాట్లాడారు. కార్పొరేట్లు పెద్ద పెద్ద పెట్టుబడిదారులు తమ లాభాల రేటుని పెంచుకోవడానికి కార్మికులు, ఉద్యోగుల మూల్గులు పీల్చి పిప్పి చేయడానికి పని గంటలను పెంచాలని తరచు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గతంలో ఇన్ఫోసిస్ కంపెనీ చైర్మెన్ నారాయణ మూర్తి కూడా వారానికి 70 గంటల పని ఉండాలని అన్నారన్నారు. కార్మికులను మనుష్యులుగా చూడాలని, వారికంటూ ఒక కుటుంబం ఉంటుందని కానీ సోయ లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఇటువంటి వారి కోసమే పట్టుకొచ్చినదని అన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం వీరోచితమైన పోరాటం జరిగి ఆ పోరాటంలో పన్నెండు మంది కార్మికుల అమరత్వంతో ఎనిమిది గంటల పని దినం వచ్చినదని గుర్తు చేశారు. రాబోయే కాలంలో ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకోవడం కోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను వెట్టి చాకిరి చేయిస్తున్నారని వేతనాలు నెల నెలా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురు చేస్తున్నారని అన్నారు. కడుపు కాలిన కార్మికులు పోరాటాలు చేస్తే సమ్మెలోకి వెళ్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడని అన్నారు. బెదిరింపులకు పాల్పడే అధికారులు ఒక్క నెల వేతనం ఆగితే ఆగుతారా అని ప్రశ్నించారు. కార్మికుల వేతనం నుండి పీఎఫ్ వాటా కట్ అవుతున్నదని, కానీ వారి అక్కౌంట్‌లోకి యజమాని వాటా జమ కావడం లేదని కొన్ని చోట్ల కార్మికుల నుండే యజమాని వాటా కూడా జమ చేస్తున్నారన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఔట్ సోర్సింగ్ రద్దు చేయాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజె రమేష్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల బతుకులు అత్యంత దయనీయంగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్లు సూపరింటెండెంట్లు పెండింగ్ వేతనాలు అడిగితే బెదిరింపులకు పాల్పడుతూ ఉద్యోగాలు వదిలి పొమ్మని చెబుతున్నారని అన్నారు. గత 20 సంవత్సరాల నుండి పని చేస్తున్న కార్మికులను తొలగించే అధికారం ఎవరికీ ఉన్నదని ప్రశ్నించారు. కార్మికులకు నెల నెలా వేతనాలు ఇవ్వడం చేతకాని ప్రభుత్వం మాటలు మాత్రం బాగా చెబుతున్నారని అన్నారు. శాశ్వత స్వభావంతో కూడుకున్న పనిలో పర్మినెంట్ వర్కర్లను నియమించాలని లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ భద్రాచలం పట్టణ నాయకులు వై.వెంకటరామారావు, బండారు శరత్ బాబు, నాగరాజు, లక్ష్మణ్, యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సురేందర్, గంగా, సంతోష్, రవి, రమ, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

- విమానాశ్రయం, కార్పొరేషన్ కల సాకారం కాబోతోంది
- పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే

నవతెలంగాణ కొత్తగూడెం

కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రధాన ఎజెండాగా చేసుకొని అనునిత్యం శ్రమిస్తున్నానని, అవధులు లేని అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించి కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలుపుతానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పునరుద్ఘటించారు. శనివారం కొత్తగూడెం మున్సిపాలిటీ 27వ వార్డులో పరిధిలోని ప్రగతి మైదానంలో రూ.20లక్షలు, అదేవిధంగా రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న ఎంపవర్మెంట్ సెంటర్ అభివృద్ధి పనులకు కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణాన్ని నగరాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని, ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక వసతుల కల్పనపై ప్రేత్యేక దృష్టి సారించానని తెలిపారు. నిర్లక్ష్యానికి గురైన క్రీడారగంపై దృష్టిసారించానని, అందుబాటులో ఉన్న క్రీడామైదానాలను, ఓపెన్ జిమ్‌లను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు పంచాయతీ కేంద్రాల్లో క్రీడాకారులకు కావాల్సిన ఏర్పాట్లు చేసి క్రీడలను, క్రీడాకారులని ప్రోత్సహిస్తానని తెలిపారు. కొత్తగూడెంలో విమానాశ్రయం నిర్మాణం, హరిత హెూటల్, అభివృద్ధికి బాటలువేసే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం తన కల అని వీటిని సాకారం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. కౌన్సిలర్ ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, చైర్పర్సన్ సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్ స్వామి, డీఈ రవీందర్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ ఆప్యాయతను ఆదరించండి

- తెలంగాణ మావోయిస్టు క్యాడర్ లొంగిపోండి
- ఏజెన్సీ అభివృద్ధికి నాంది పలకండి
- ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పీ

నవతెలంగాణ-చర్ల





పెరిగిన వాతావరణం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల తోపాటు అనేక సమస్యల వలయాలను చేదించుకోవడానికి మావోయిస్టు పార్టీలో చేరిన మావోయిస్టులారా తెలంగాణ పోలీస్ ఆప్యాయతను ఆదరించి, అరణ్య జీవితానికి స్వస్తి పలికి, తమ తమ జీవనశైలిని మార్చుకోవాలని ఎస్పీ రోహిత్ రాజ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ ఏ.రాజు వర్మ అధ్యక్షతన ఇప్పటివరకు లొంగిపోయిన మాజీ మావోయిస్టు సభ్యులు, వారి కుటుంబాలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతోకాలంగా అరణ్య గ్రామాలను తమ గుప్పిట్లో పెట్టుకుని ఆదివాసీలకు మావోయిస్టులు చేసింది ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఏ గ్రామానికి అయినా ఒక్క అభివృద్ధి పని చేసినట్లు తెలంగాణ మావోయిస్టు పార్టీ అధినాయకత్వం నిరూపిస్తే తాను లొంగుబాటు కార్యక్రమాలను నిలిపివేసి స్థబ్దతగా ఉంటానని ఆయన మావోయిస్టులకు సవాల్ విసిరారు. ఆదివాసీ గ్రామాలలో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తూ గిరిజనులను ఇబ్బంది పెట్టడం మినహా ఒక బడి నిర్మించడం కానీ, రోడ్డు ఏర్పాటు చేయించడం కానీ చేశారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. నిరుపేదల కోసం తెలంగాణ పోలీస్ చేస్తున్న సేవలను గుర్తించి ఇప్పటికే పెద్ద ఎత్తున మావోయిస్టు క్యాడర్ లొంగిపోతుంటే మావోయిస్టు తెలంగాణ క్యాడర్ సిద్ధాంతాల ముసుగులో నిరుపేదలను దోచుకుంటుందని ఆయన విమర్శించారు. చెన్నాపురం సమీపంలో సుమారు 2 కోట్ల వ్యయంతో అధునాతన వైద్యశాలను నిర్మించడానికి కృషి చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అరణ్య గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం, త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం, ట్రస్టుల ద్వారా విద్యుత్ మోటర్లు ఇప్పించడం వంటి అభివృద్ధి కార్యక్రమాలను పోలీసులు నిర్వహిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా తెలంగాణ పోలీస్ చేసే అభివృద్ధి కార్యక్రమాలను మావోయిస్టు పార్టీ గుర్తించి అరణ్య గ్రామాల అభివృద్ధికి అడ్డుపడకుండా రవాణా వ్యవస్థ, విద్య వైద్యం మెరుగుపడేందుకు సహకరించాలని ఆయన కోరారు. లొంగిపోయిన ప్రతి ఒక్క దళ సభ నుండి హై క్యాడర్ మావోయిస్టు వరకు ఎవరిని ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా తమ తమ జీవితాల్లో వెలుగు నింపేందుకు తెలంగాణ పోలీస్ అనునిత్యం కృషి చేస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహక బహుమతులతో పాటు పోలీస్ శాఖ లొంగిపోయిన మావోయిస్టుల పిల్లల చదువుల కోసం వారి అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తుందని ఎస్పీ వివరించారు. గత ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 36 మంది యూజీ మావోయిస్టు సభ్యులు ఉండగా ఇప్పుడు కేవలం నలుగురు మాత్రమే యూజీ మావోయిస్టు క్యాడర్ ఉందని, అందులో ముగ్గురు మహిళలు, ఒక పురుష సభ్యుడు ఉన్నారని వారు కూడా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ పోలీస్ ముందు లొంగిపోతే ఆయా కుటుంబాలకు పోలీసు వారు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఆయన సూచించారు. చర్ల సీఐ తన సొంత కత్తులతో బూరుగుపాడులో ప్రాథమిక పాఠశాల కోసం నిర్మించిన విషయాన్ని ఆయన గుర్తుచేసి ఈ విధంగా మావోయిస్టులు ఎక్కడైనా పాఠశాల నిర్మాణం చేపట్టారని ప్రశ్నించారు. ఆదివాసీల కుల ధ్రువీకరణ పత్రాలు విషయమై నవతెలంగాణ అడిగిన ప్రశ్నకు ఎస్పీ సమాధానం చెబుతూ ఉన్నతాధికారులతోని చర్చించి త్వరతి గతిన ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని ఆయన మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఓఎస్డీ పరితోష్ పంకజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్, సీఆర్పిఎఫ్ 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ రాజ్ కుమార్, దుమ్ముగూడెం సీఐ సంతోష్, చర్ల ఎస్ఐ నర్సిరెడ్డి, లొంగిపోయిన మావోయిస్టు సభ్యులు, వారి కుటుంబాలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పంచాయతీ

- మున్సిపాలిటీగా అశ్వారావుపేట

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎట్టకేలకు అశ్వారావుపేట మున్సిపాల్టీగా అవతరించింది. ఈ మేరకు జనవరి 4వ తేదీన గవర్నర్ ఆమోదం పొందుతూ విడుదల రాజ పత్రం ఒకటి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం బహిరంగం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ సమీపంలో పాలాభిషేకం చేసారు. అశ్వారావుపేటతో పాటు పేలాయి గూడెం, గుర్రాల చెరువు పంచాయతీలను కలుపుతూ 31696 జనాభా ప్రాతిపదికన అశ్వారావుపేట మున్సిపాలిటీగా అవతరించింది. అశ్వారావుపేట 1959 లోనే పంచాయతీగా ఏర్పడి, నాటి పాలనా విధానంలో బ్లాక్ కేంద్రంగానూ ఉండేది. అనంతరం మండల వ్యవస్థ రావడంతో 1980వ దశకంలో మండల కేంద్రంగా రూపొందింది. 2009లో నియోజక వర్గం కేంద్రంగా మారింది. నేడు మున్సిపాలిటీగా రూపుదిద్దుకోనుంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన పాలాభిషేకం వేడుకలో ఆయన మాట్లాడుతూ నా పాలనాకాలంలో ప్రతీ క్షణం అశ్వారావుపేట అభివృద్ధికే కేటాయిస్తానని అన్నారు. దొంతికుంట చెరువును టూరిజం కేంద్రంగా, మరో ఎకో పార్క్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి రమేష్‌లు పాల్గొన్నారు.

ఏఎస్పీకి మొక్కను బహూకరించిన గోళ్ళ భూపతి రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ విక్రంత్ కుమార్ సింగ్ గోళ్ల భూపతిరావు కలిసి ఫ్యాషన్ ఫ్రూట్ మొక్కను, అవుట్ డోర్ ప్లాంట్‌ను శనివారం అందజేశారు. గతంలో ఏఎస్పీ కార్యాలయంలో చేపట్టిన పూలతోటలు, పండ్ల తోటల పెంపకం వాటి పోషణ మొదలగు విషయాల గురించి వివరించారు. గ్రీన్ భద్రాద్రి కార్యక్రమాలు పచ్చదనానికి గత 12 సంవత్సరాలుగా చేస్తున్న కృషిని ఏఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం వాటి పోషణ నిర్వహించ వలసిన యాజమాన్య పద్ధతులు గురించి వారికి విపులంగా వివరించారు. నా తరపున మీకు కావలిసిన సలహాలు, సూచనలు ఎల్లపుడూ అందిస్తానని తెలియజేశారు.

ప్రజానీకం అభ్యున్నతి కోసం ఉద్యమాలు

- రాష్ట్ర మహాసభల గోడ ప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో అబ్దుల్ నబీ

నవతెలంగాణ-ఇల్లందు

పేద, బడుగు, బలహీనవర్గాలు, కార్మిక ఉద్యోగులు సమస్త ప్రజానీకం అభ్యున్నతి కోసం సీపీఐ(ఎం) ఉద్యమాలు నిర్వహిస్తోందని పార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్‌లు అన్నారు. జనవరి 25 నుండి పార్టీ రాష్ట్ర 3వ మహాసభల సందర్భంగా సంగారెడ్డిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ గోడ ప్రతులను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై అనునిత్యం పని చేసే పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, షేక్ ఖాదర్, మన్యం మోహన్ రావు, కామ నాగరాజు, సత్యనారాయణ కోరి, భద్రూ, నల్లి నర్సయ్య వీరయ్య, కోటేశ్వరరావు, వెంకన్న లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవనం కార్యాలయంలో మహాసభల పోస్టర్ల ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్స్ బృందాకరత్, బీవీ రాఘవులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొడిశాల రాములు, పార్టీ మండల కార్యదర్శ వర్గ సభ్యులు పిట్టల నాగమణి, మండల కమిటీ సభ్యులు, గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు కోంద్రు గౌరీ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలం పరిధిలోని బసవతారకం కాలనీలో అధికారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే ప్రక్రియను కొత్వాల పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. అధికారులు చేపట్టే ఇంటింటి సర్వేలో ఇందిరమ్మ గృహాలు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఉపాధి హామీ లబ్దిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వంటి పథకాలపై అధికారులు సర్వే జరుపుతున్నారని, అధికారులకు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహకరించాలని కొత్వాల అన్నారు. ఈ నెల 21వ తేదీ నుండి ఆయా పంచాయతీ పరిధిలోని పంచాయతీ కార్యాలయాల్లో గ్రామా సభలు నిర్వహించి, లబ్దిదారులను ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 26వ తేదీ నుండి గుర్తించిన అర్హులైన ప్రజలకు, లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో తెలిపిన ఆరు గ్యారంటీలలో రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ గృహాలు మంజూరు వంటి పథకాలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు నిలవాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ జి.వివేక్, మండల అభివృద్ధి అధికారి కె.విజయభాస్కర్ రెడ్డి, ఏపీఎమ్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి అజ్మీరా రాంబాబు, వెలుగు సీసీ జి.పద్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు రాము, వెంకటాచారి, నర్సింహారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కుసుమహరనాథ 80వ ఆనందమేలోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని స్థానిక 18వ వార్డు సమీపంలో గల ఎల్లన్న గ్రౌండ్ ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన శ్రీ కుసుమహరనాథ ప్రచార సంస్థ ఇల్లందు వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 5 గంటల నుండి ప్రత్యేక సంకీర్తనలతో పూజా కార్యక్రమం ప్రారంభమైనది. అనంతరం శ్రీ కుసుమహరనాథ సేవ సమితి అధ్యక్షుడు పుల్లూరుస్వరాజ్ గుప్త జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ కుసుమహరనాథ 80వ ఆనందమేలోత్సవములు చాలా ఘనంగా నిర్వహిస్తామని, ఇక్కడే కాకుండా ప్రతి ఏటా వివిధ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఆనందమేలోత్సవములు జరుపుకుంటామని ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రచార సంస్థ హైదరాబాద్ అధ్యక్షుడు తోట కరంచంద్, ఆర్.నరసింహ రావు, ఆర్.వీరభద్రరావు, పుల్లూరు హరినాథ్, పుల్లూరు సదానందం, రామ్మోహన్ రావు, సురేష్, నవీన్, రవి, జొన్నల ఉపేందర్ నాథ్, ప్రచార సంస్థ కర్త పుల్లూరు జ్యోతి, సుజాత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పేద ప్రజల అభ్యున్నతికి నవతెలంగాణ కృషి

నవతెలంగాణ-అశ్వాపల్లి

ప్రభుత్వానికి, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి సూచనలు చేస్తూ ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూ.. నవతెలంగాణ దినపత్రిక ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం నవతెలంగాణ నూతన 2025 క్యాలెండర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్, తహసీల్దార్ శకుంతల, ఎంపీడీవో డి.శ్రీను, వైద్యాధికారి కె.వి.సంఘమిత్ర, ఏఓ అనిల్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కథనాలు, వార్తలు, వ్యాసాలు, సంపాదకీయాలు, మహిళల కోసం ప్రత్యేకంగా మానవి శీర్షిక పాఠకులకు, అందరికీ ఎంతగానో ఉపయోగంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామనర్సయ్య, నాయకులు వాసం శ్రీకాంత్, తులం ముతి లింగం, కరకపల్లి సుధాకర్, చంద్రం, సునీత, సుగుణ, నయీమ్, ఉల్లోజు భరత్, ముప్పారపు రాము, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలి

- స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్, కమిషనర్



నవతెలంగాణ-ఇల్లందు

వ్యాధులు ప్రబలుతున్నందున పట్టణ పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ అన్నారు. శాసనసభ్యులు కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సహకారంతో పట్టణాలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ప్రధాన ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపాలిటీ అంతా పరిశుభ్రంగా తయారు కావాలని ప్రతి కాల్వ ప్రతి లైన్ శుభ్రంగా ఉండాలని తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో చెత్తను బయట వెయ్యరాదని వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికుల శ్రమ వృధా కానీయొద్దని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, డీఈ మురళి, ఆలయ కమిటీ చైర్మెన్ సదానందం, వార్డు కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, సయ్యద్ ఆజాం, వీణ, సుజాత శానిటరీ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

పేదలపై పోలీస్, రెవెన్యూ ప్రతాపం

- కలెక్టర్ ఆదేశాల మేరకే ఆక్రమణ దారులను ఖాళీ చేయించాము
- డిప్యూటీ తహశీల్దార్ వాణి

నవతెలంగాణ-దమ్మపేట

గత ప్రభుత్వంలో దమ్మపేట శివారు మల్లారం కాలనీలో 20 డబుల్ బెడ్‌రూమ్ గృహాలను వివిద దశల్లో అసంపూర్తిగా నిర్మాణం చేసిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలు ఉన్నాయి. ఆ ఇళ్లల్లో అసంపూర్తిగా మిగిలిన ఇళ్లల్లో గూడు లేనటువంటి నిర్భాగ్యులు గత 15 రోజుల నుండి పరదాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. ఈ 15రోజుల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు వివిధ ప్రభుత్వ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు అటువైపు వెళ్ళినప్పటికీ అధికారులు, అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదు అనే భావనలో అక్కడ గుడారాలతో చిన్న గుడిసెలను సైతం పేద ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపధ్యంలో శనివారం 11, 12 గంటల సమయంలో డిప్యూటీ తహశీల్దార్ వాణి, ఇద్దరు ఆర్ఐలు రెవెన్యూ సిబ్బందితో పాటు ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, పక్క మండలం నుండి పోలీస్ సిబ్బందిని రప్పించి సుమారు 60 మంది పోలీస్‌ల ఆధ్వర్యంలో మల్లారం కాలనీ చేరుకున్నారు. దీంతో అక్కడ పేదలకు, రెవెన్యూ పోలీస్ సిబ్బందికి తీవ్ర స్థాయిలో వాగ్వివాదాలు జరిగి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీస్ సిబ్బంది అక్కడ మహిళలను, చంటి బిడ్డలు ఎత్తుకున్న తల్లులను సైతం నెట్టుకుంటూ పేదలు ఏర్పాటు



పెట్రోల్ పోసుకుంటున్న దృశ్యం





చేసుకున్న గుడారాలను తొలగించి ఆ గుడారాల్లో ఉన్న సామగ్రిని డీసీఎం వ్యానుల్లో వేసి పేదలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు పోలీసులు. దీంతో ఈ విధ్వంసకాండను తట్టుకోలేక పేదలు పెద్ద పెద్దగా అరుస్తూ ఆహాకారాలు చేస్తూ రోదిస్తూ మాలాంటి పేదలకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణే రక్షించాలని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలపై నోరు మెదపకుండా రెక్కాడితే గాని డొక్కాడని మాలాంటి పేదలను ఇబ్బందులకు గురిచేసి ఉన్న నీడను సైతం తొలగించడం దారుణమని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ అండతో అధికారులు దమన కాండ కొనసాగించడం, పేదలు, నిర్భాగ్యులు పట్ల వ్యవహరించిన తీరు సహేతుకంగా లేదని పోలీస్‌లను రెవెన్యూ అధికారులను మహిళలు, పురుషులు కాళ్ళ వేళ్ళ పడుతూ తమకు అన్యాయం చేయొద్దని రోదిస్తూ వేడుకున్నారు. అధికారులు కనికరించక పోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో కొంతమంది మహిళలు, పురుషులు వంటిపై డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకునే ప్రయత్నం చేయగా వారిని పోలీస్ అధికారులు వారి శరీరాలపై పూర్తిగా తడిచే విధంగా నీళ్ళు పోసి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఒక మహిళను బలవంతంగా పోలీస్ డీసీఎం వ్యాన్‌లో ఎక్కిస్తుండగా ఆ వ్యాన్‌కు ఉన్న బలమైన ఇనుపరాడ్డు తలకు బలంగా తగలడంతో ఆ మహిళ అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయింది. వెంటనే ఆమెకు మహిళ కానిస్టేబుల్ సపర్యలు చేయడంతో స్పృహలోకి వచ్చింది. దీంతో అక్కడ ఉన్న కొంతమంది పేద మహిళలను, పురుషులను పోలీస్‌వ్యాన్‌లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. కొంతమంది పేద వ్యక్తులపై పోలీస్‌లు విధులకు ఆటంకాలు కలిగిస్తున్నారని వారిని సైతం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కలెక్టర్ ఆదేశాలతోనే ఖాళీ చేయించాము

ఈ విషయంపై ఇన్‌చార్జి డిప్యూటి తహశీల్దార్ కె.వాణిని వివరణ కోరగా గత మూడు రోజుల క్రితం దమ్మపేట గ్రామ పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి మల్లారం కాలనీలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళను కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకున్నారని తనకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఈ విషయాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దృష్టికి తీసుకవెళ్ళడం జరిగిందని తెలిపారు. వెంటనే పోలీస్‌లకు సమాచారం తెలియజేసి వారి సహకారంతో ఎవరైతే డబుల్ ఇళ్ళను ఆక్రమించుకున్నారో వారందరిని ఖాళీ చేయించాలని కలెక్టర్ స్పష్టంగా తెలియజేయడంతో తాను తన సిబ్బంది దమ్మపేట ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడం జరిగిందని ఆమె తెలిపారు.

- : డిప్యూటీ తహశీల్దార్ వాణి

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దమ్మపేట



మండలంలో రూ.3.66 కోట్ల అభివృద్ధి పనులకు శాసనసభ్యులు జారే ఆదినారాయణ శ్రీకారం చుట్టారు. అదే విధంగా పలువురు లబ్దిదారులకు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటషెడ్, కాంపౌండ్ వాల్, ఎంపిపిఎస్ పాఠశాలలో సిసి రోడ్డు, కాంపౌండ్ వాల్ పున్ణనిర్మాణం, ఏకలవ్య పాఠశాలలో నూతనంగా నిర్మించబోయే క్వార్టర్స్ పనులకు ఎమ్మెల్యే జారె శంకుస్థాపన చేశారు. పట్వారిగూడెం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అంకంపాలెం పంచాయతీ ఎర్రగుంపు, మందలపల్లి గ్రామాలలో సైడ్ డ్రయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పార్కలగండి పంచాయతీ కొత్తూరు, తొట్టిపంపు పంచాయతీ చలమప్పగూడెం, మొండివర్రె పాఠశాలలకు త్వరలో నిర్మించబోయే ప్రహరీగోడల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాచూరుపల్లి, తాటిసుబ్బన్నగూడెం గ్రామ పంచాయతీలకు నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు. రాచూరుపల్లి పంచాయతీ భవనానికి స్థలాన్ని దానంగా అందించిన కక్కిరాల రత్నాకర్‌ని ప్రత్యేకంగా అభినందించారు. కొమ్ముగూడెం గ్రామపంచాయతీలో పలు గ్రామాలలో నూతనంగా నిర్మించిన కల్వర్టులను ప్రారంభించారు. నాగుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపిపిఎస్ పాఠశాలలకు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల నగర్ స్థల లబ్దిదారులకు న్యాయం చేయాలి

- నిరుపేదలందరికీ రూ.5లక్షలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

వెన్నెల నగర్ స్థల లబ్దిదారులకు న్యాయం చేయాలని, స్థలం ఉన్న నిరుపేదలందరికీ రూ.5లక్షలు మంజూరు చేయాలని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న వార్డు సభలలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారి పేర్లు ప్రకటించబోతున్నారని, వార్డు సభల ద్వారా నిజమైన అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వార్డు సభలలో 75 గజాల, 100 గజాల నిరుపేదలకు డ్రా లేకుండా ఇవ్వాలని వార్డు సభలను అడ్డుకోవాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను నిలదీయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఎవరి సమస్య పరిష్కారం కోసం వారే తిరుగుబాటు చేస్తే తప్ప పరిష్కరించేలా పాలకుల విధానాలు కనబడడం లేదని ఆయన అన్నారు. పట్టణంలో నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు అందకపోతే ప్రభుత్వ కార్యాలయాలు ఎదుట ఆందోళన కూడా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ నియామకాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పట్టణంలోని మారుతీ నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం నర్సింగ్ కోర్స్ పూర్తి చేసిన 69 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామకాలు అందజేయనున్నారు. క్యాంపస్ సెలక్షన్ ద్వారా ఒమెగా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ హైదరాబాద్‌లో 32 మందికి, కిమ్స్ హాస్పిటల్ సికింద్రాబాద్ నందు 17 మంది, భాస్కర మెడికల్ కాలేజ్ హాస్పిటల్ హైదరాబాద్‌లో 20 మంది ఉద్యోగ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.ఎస్.ఎల్.కాంతారావు చైర్మెన్ డా.బి. సుబ్బరాజు మాట్లాడారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ... మేము మారుమూల గ్రామాలలో చదివి అతి పేద కుటుంబాల నుండి వచ్చామని, నేడు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉద్యోగ అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యం వారికి, ఓమెగా హాస్పిటల్ కిమ్స్ హాస్పిటల్ భాస్కర మెడికల్ కళాశాల అండ్ హాస్పిటల్ వారి మేనేజ్మెంట్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో కౌన్సిలర్ భర్త రమేష్ మృతి

- నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు



మున్సిపాలిటీ ఆరవ వార్డు కౌన్సిలర్ తోట లలిత శారద భర్త తోట రమేష్ (60) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. గతంలో సింగరేణిలో ఉద్యోగం చేస్తూ రిటైర్డ్ అయ్యారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దిండిగాల రాజేందర్ రమేష్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని అందించారు. బేతంపూడి సొసైటీ డైరెక్టర్ జిల్లా నాయకుడు లక్కినేని సురేందర్, 11వార్డు కౌన్సిలర్ జె.కె.శీను, పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, సాతాల హరికృష్ణ, టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

పీవీకే 5లో కార్మిక సమస్యలను పరిష్కరించాలి

- ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్

నవతెలంగాణ -కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియా పీవీకే 5లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ.రజాక్ గని మేనేజర్ శ్యాం ప్రసాద్‌ను కోరారు. శనివారం మేనేజర్‌ను కలసి చర్చించారు. కొత్తగా విధుల్లో చేరిన మహిళా ఉద్యోగులకు రెస్ట్ రూమ్స్ ఏర్పాటు చేయాలని, మైన్ ఆవరణలో ఇంటర్నల్ రోడ్స్ వేయించాలని, వాహనాలకు పార్కింగ్ షెడ్స్ నిర్మించాలని, తదితర సమస్యలు పురోగతి స్థాయిలో ఉన్నవని, త్వరలో అన్ని సమస్యలు పరిస్కారం అవుతాయని గని మేనేజర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ చిలక రాజయ్య, సకినాల సమ్మయ్య, బాలు, సంబమూర్తి, బోరింగ్ శంకర్, రామ్మోహన్ రావు, సీతారాం, శ్రీనివాస్, వై.శంకర్, కె. రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



దొంతికుంట చెరువు పరిశీలించిన మువ్వా, జారే

- సుందరీకరణకు ప్రణాళిక

నవతెలంగాణ-అశ్వారావుపేట

దొంతికుంట చెరువు సుందరీకరణకు కృషి చేస్తాం అని, అందుకోసం ప్రణాళికలు రూపొందించారని నీటిపారుదల శాఖ అధికారులకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాలు ఇచ్చారు. శనివారం ఆయన అశ్వారావుపేటలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ పనులను రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మువ్వా విజయ్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా దొంతికుంట చెరువు పరిసరాలు పూర్తిగా పరిశీలించి త్వరలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ద్వారా నిధులు కేటాయించి అన్ని హంగులతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీగా మారిన తరుణంలో దొంతికుంట చెరువును అందంగా తీర్చిదిద్ది మండల ప్రజలకు కానుకగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, సుంకవల్లి వీరభద్ర రావు, జూపల్లి రమేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10 కే వాకింగ్ జయప్రదం చేయండి

- ఆశా వర్కర్లకి ఇచ్చిన హామీల అమలు కోసం 21న 10 కే పాదయాత్ర
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్

నవతెలంగాణ -కొత్తగూడెం



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పినట్లు ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జనవరి 21న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాల్వంచ నుండి కలెక్టరేట్ వరకు 10 కే పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేష్ తెలిపారు. కొత్తగూడెం సీఐటీయూ కార్యాలయంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు పూనెం ఝాన్సి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏజె.రమేష్ మాట్లాడారు. సంవత్సరం క్రితం రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు రాష్ట్ర వ్యాప్తంగా 36 రోజులు ఆశా వర్కర్లు సమ్మె చేశారని, ఆ సందర్భంలో అప్పటి రాష్ట్ర బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చారని, వీటిని ఆసరా చేసుకుని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాగ్దానాలు చేశారన్నారు. ఈ వాగ్దానాలను ఏ ఒక్కటీ నేటి వరకు అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలను, వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సంవత్సర కాలంలో మూడు సార్లు చలో హైద్రాబాద్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. బస్ జాతా రాష్ట్ర వ్యాప్తంగా తిరిగామని, దాదాపు ఎనిమిది సార్లు కలెక్టరేట్ ధర్నాలను నిర్వహించామని అన్నారు. ఎప్పటికప్పుడు ఇచ్చిన హామీలను ఇస్తూ, దాట వేస్తున్నారని విమర్శలు కుప్పించారు. ఈ హామీల అమలు కోసం ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పది కిలో మీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నామని, జిల్లాలో పాల్వంచ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు ఆశా వర్కర్లంతా పాదయాత్రలో పాల్గొంటున్నారన్నారు. ఈ పాదయాత్రకి కూడా ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సందర్భంగా పెద్ద ఎత్తున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.వి.అప్పారావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జిలకర పద్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచిపోవడం కాకుండా గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలను కట్టడమే మాకు భారమవుతున్నదని రేవంత్ రెడ్డి చెపుతున్నారని, రోజువారీ ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు అనేక పథకాలను ప్రకటించడానికి డబ్బులు ఎక్కడి నుండి వస్తున్నాయి అని ప్రశ్నించారు. ఆరోగ్య వ్యవస్థకి మూల స్తంభాలుగా ఉన్న ఆశా వర్కర్లను విస్మరిస్తే ఆశా వర్కర్లు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, సహాయ కార్యదర్శి కె.సత్య, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రుక్మిణి, విజయలక్ష్మి, సుగుణ, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రాంతాలను కార్పొరేషన్‌లో కలపొద్దు

- మాజీ కౌన్సిలర్ గోబ్రియ నాయక్

నవతెలంగాణ-సుజాతనగర్



పల్లె ప్రాంతాలను కార్పొరేషన్‌లో కలపొద్దని చిట్టి రామరావు తండా మాజీ కౌన్సిలర్ గోబ్రియా నాయక్ అన్నారు. శనివారం గ్రామపంచాయతీలను కార్పొరేషన్‌లో కలపవద్దని జరుగుతున్నటువంటి జీబు జాతాలో పాల్గొని వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో చిట్టి రామారావు తండాను కలపటం వలన గత 29 సంవత్సరాల నుంచి అనేక బాధలు పడ్డామని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దయినదని, గ్రామంలో ఉన్న చిన్న, సన్న కారు రైతులకు రావలసినటువంటి సబ్సిడీ రుణాలు సహకార సంఘం ద్వారా వచ్చే సబ్సిడీలు పూర్తిగా రద్దు చేశారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న మేము మున్సిపాలిటీలో కలపటం వలన ఇంటి, చెత్త, నీటి పన్నులు విపరీతంగా పెరిగాయని, వీటిని కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రజలందరూ దీనిని గమనించి ఈ నెల 20వ తారీకున జరిగే కలెక్టరేట్ ముట్టడిని పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడు గ్రామ పంచాయతీల కార్పొరేషన్ వ్యతిరేక పోరాట కో కన్వీనర్ వీర్ల రమేష్, పూర్ణ బాణోత్ శ్రీనివాస్, నర్రా శివరామకృష్ణ, నాగేశ్వరావు, శ్రీను, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కున్సోత్ షణ్ముఖ్, కాట్రాల తిరుపతిరావు, శ్రీనివాస్, సట్టు తిరుపాలు, నాగరాజు, పగడాల లక్ష్మణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి సంపూర్ణ మద్దతు

గ్రామపంచాయతీలను కార్పొరేషన్‌లో కలపకుండా పోరాడి ఉపాధి హామీ చట్టాన్ని, వ్యవసాయ రంగాన్ని రక్షించుకుందామని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి లావుడ్యా ప్రసాద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక చింతలపూడి సత్యం భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం గండమాల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పంచాయతీలలో ఉన్న ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా కార్పొరేషన్‌లో కలపటం ఏమిటి అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు కొండే కృష్ణ, సోలం నాగరత్నమ్మ, భూక్యా హత్తిరాం, ఉపాధి మేట్లు తిరుపతమ్మ, కళావతి, సిద్దెల రాములు, శ్రీను, రఘు, గణేష్, పాల్గొన్నారు.



కార్మిక సంక్షేమం...మెరుగైన వేతన ఒప్పందం బీఆర్‌టీయూ మిత్రపక్షాల లక్ష్యం

- ఐటీసీ పీఎస్పీడీ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మల్లికంటి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు

కార్మికుల సంక్షేమం, మెరుగైన వేతన ఒప్పందం అందించటమే బీఆర్‌టీయూ, సీఐటీయూ, మిత్ర పక్షాల ప్రధాన లక్ష్యమని ఐటీసీ పీఎస్ పీడీ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మల్లికంటి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని సారపాకలో గల యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా ఐటీసీ కర్మాగారంలో కార్మికులకు తీవ్ర అన్యాయం ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు చేశారని ఆయన అన్నారు. కర్మాగారంలో బలమైన, న్యాయమైన ప్రత్యామ్నాయ యూనియన్‌గా బీఆర్‌టీయూ, సీఐటీయూ మిత్రపక్షాల యూనియన్‌గా నిలిచిందని ఆయన అన్నారు. ఈ నెల 31వ తేదీన జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తాము విజయం సాధించి తీరుతామని ఆయన పేర్కొన్నారు. తమ యూనియన్‌ను గెలిపిస్తే 14 వేతన ఒప్పందం చరిత్రలో నిలిచిపోయే రీతిగా చేసి చూపుతామని ఆయన అన్నారు. అదేవిధంగా బీఆర్‌టీయూ అధ్యక్షులు సానికొమ్ము శంకర్ రెడ్డి మాట్లాడుతూ తమ యూనియన్‌ని గెలిపిస్తే పూర్తి కుటుంబానికి వంద శాతం అన్ని రకాల వ్యాధులకు అన్ లిమిటెడ్ మెడి కల్ సాధిస్తామని ఆయన అన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో సీఐటీయూ అధ్యక్షులు కే.ప్రవీణ్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ అబ్దుల్ సమీరా, బీఆర్‌టీయూ అధ్యక్షులు అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు

- కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీలో ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



రాష్ట్ర ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు వర్తిస్తాయని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 19 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు, 5 మందికి సీఎం సహాయక నిధి చెక్కులను అందజేశారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని, ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చే వరకు నిర్లక్ష్యం చేయకుండా అధికారులు గ్రామాలలో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీను, తహసీల్దార్ శకుంతల, ఏవో అనిల్, ప్రభుత్వ వైద్యాధికారి కె.వి సంఘమిత్ర, హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాయం రామనరసయ్య, మాజీ ఎంపీపీ పడిగే సమ్మయ్య, ప్రచారకు కో కన్వీనర్ వాసం శ్రీకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి కృష్ణహరి, ఉల్లజ్ భరత్, సుధారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏ ముట్టడిని జయప్రదం చేయండి

- ఏఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామరాజు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఆదివాసీ సంక్షేమ పరిషత్, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన ఐటీడీఏ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు పిలుపునిచ్చారు. శనివారం కోయ నర్సాపురం గ్రామంలో చలో భద్రాచలం ఐటీడీఏ ముట్టడి కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంత హక్కులను తుంగలో తొక్కుతూ నిజమైన ఆదివాసీలకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కురసం రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సర్వేను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

నవతెలంగాణ-పాల్వంచ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశానుసారం సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వే పురోగతిపై జిల్లాలోని తహసీల్దార్లు ఎంపీడీవోలతో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు. 354 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 194 రెవెన్యూ గ్రామాల సర్వే పూర్తి అయిందన్నారు. కొత్త రేషన్ కార్డు మంజూరు లో భాగంగా ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా జిల్లాలో 29141 దరఖాస్తులు వచ్చాయని అదేవిధంగా రేషన్ కార్డులో కొత్త సభ్యులను జతపరచడానికి గాను 10796 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత పట్టిక ద్వారా ప్రతిరోజు సాయంత్రం నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ముత్యాలమ్మ అమ్మవారికి గరిగ అందజేత

నవతెలంగాణ -దుమ్ముగూడెం:

దుమ్ముగూడెం గ్రామంలో గల శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా నరసరావుపేట గ్రామ వాస్తవ్యులు ఆలంపల్లి వెంకటరత్నం, వారి కుమార్తె రూపవతి ఇత్తడి గరిగను శనివారం అందజేశారు. గరిగెను ఆలయ కమిటీ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డికి అందజేశారు. ఆలంపల్లి వెంకటరత్నం తల్లిదండ్రులు కొత్తూరి ఆదినారాయణ వారి పుల్లమ్మ పూర్వ దుమ్ముగూడెం వాస్తవ్యులు కావడంతో వారి జ్ఞాపకార్థం గరిగను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డి వారికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి గరగను అందుకొని అమ్మవారి ముందు ఉంచి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు.

హెల్మెట్ ధరించాలి.. రక్షణ సూత్రాలు పాటించాలి

నవతెలంగాణ-మణుగూరు

ప్రతి కార్మికుడు, పౌరులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రక్షణ సూత్రాలు పాటించి తమ జీవితాన్ని కాపాడుకోవాలని మణుగూరు ఎస్‌డిపిఓ రవీంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల ప్రకారం ఎస్‌జిపిఓ మణుగూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో మణుగూరు ప్రకాశవని ఓసి-2 నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి అదేవిధంగా తమ వెహికల్ కి ఇన్సూరెన్స్ తీసుకొని ఉండాలి అన్నారు.మన నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ సతీష్ కుమార్, ఎస్సై ప్రసాద్, ఎంవిఐ పుల్లయ్య, ఎస్‌ఓటుజిఎం శ్యాంసుందర్, ఓసీ-2 ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో పాల్వంచలో

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

- జయప్రదం చేయండి : సిహెచ్ రామ్ చరణ్

నవతెలంగాణ -కొత్తగూడెం

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), జిల్లా 4వ మహాసభలు పాల్వంచ పట్టణ కేంద్రంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జరుగుతున్న నేపథ్యంలో జూలూరుపాడు మండలంలోని ప్రభుత్వ హైస్కూల్లో 4వ జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా రంగ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పి.పవన్, హైస్కూల్ నాయకులు సాయి, కిరణ్, చరణ్, హర్ష, నందిని, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న పాఠశాల స్థాయి బాలమేళా

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 3న పాఠశాల స్థాయి బాలమేళా నిర్వహించనున్నట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనలతో జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు నరసాపురం కాంప్లెక్స్ పరిధిలోని 24 పాఠశాలలో ఒకేరోజు పండగ వాతావరణం తలపించే విధంగా పాఠశాల స్థాయి బాలమేళాను నిర్వహిస్తున్నామన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని 24 పాఠశాలలో ఒకటి నుండి ఐదు తరగతుల విద్యార్థుల అభ్యసనా స్థాయిలో అనుగుణంగా జ్ఞానం, నైపుణ్యాలను, పెంపొందించే విధంగా సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ సాంస్కృతిక, క్రీడల, కళలలో విభిన్న నేపథ్యాలను పరిగణలోకి తీసుకుంటూ విద్యార్థుల ఆలోచన చేసే దిశగా శిక్షణ ఇచ్చి బాలమేళాను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే బాలమేళాలో తరగతి వారీగా తెలుగు, గణితం ఇంగ్లీష్ అంశాలలో ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేసి బహుమతి ప్రదానోత్సవాలను పాఠశాల స్థాయిలో నిర్వహిస్తామన్నారు. పాఠశాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా, కాంప్లెక్స్ స్థాయిలో పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. బాలమేళా వర్క్ షాప్‌లో రిసోర్స్ పర్సన్స్ గా కారంపూడి దశం బాబు, చిగురుమల శ్రీనివాస్, ఎం కిషన్, ఎన్ అశాలత, బి శ్రీనివాస్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారన్నారు.

ఐపబీ లబ్దిదారుల సేకరణ పూర్తి

- మండలంలో 2183 మందిగా నమోదు
- ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారుల సేకరణ, అప్డేషన్ పూర్తి అయిందని, మండల వ్యాప్తంగా 2183 మందిని గుర్తించామని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం ఏపీవో కే.రామచంద్రరావు శనివారం నవతెలంగాణకు తెలిపారు. ఈ పథకంలో మండలంలో 7,876 జాబ్ కార్డులు ప్రస్తుతం ఫోర్స్ లో ఉన్నాయని, పథకం నిబంధనలు ప్రకారం 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులు పాటు పనిచేసి, భూమిలేని నిరుపేదలు 2,183 మంది ఉన్నారని తెలిపారు. వీరి ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా ఉపయోగంలో ఉన్న మొబైల్ ఫోన్ నెంబర్ ఆన్లైన్ ప్రక్రియ పూర్తి అయిందని వివరించారు.

రూ.11 లక్షల గంజాయి పట్టివేత

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్ : కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఒరిస్సా నుంచి ఉత్తరప్రదేశ్ మీదుగా కారులో అక్రమంగా రవాణా చేస్తున్నటువంటి 31.06 కేజీల గంజాయిని శనివారం భద్రాచలం సమీపంలో ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్నోవా కార్లో భాండా జిల్లాకు చెందిన అంజనీ కుమార్, సంజీవ్ కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు కారులో గంజాయి తీసుకొని వస్తున్నారని సమాచారం అందుకున్న ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు భద్రాచలం చెక్పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మధ్యప్రదేశ్ కు చెందినటువంటి కారుని నిలిపి తనిఖీలు చేయక అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయితోపాటు రెండు సెల్ ఫోన్లు కలిపి మొత్తంగా రూ.11 లక్షల విలువ కలిగిన గంజాయి, కారు స్వాధీనం చేసుకొని భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు.

కోల్ ఇండియా షటిల్ బాల్ బ్యాట్మింటన్‌లో గోల్డ్ మెడల్

- డీజీఎం (ఫారెస్ట్) ఏబి. హరినారాయణను సన్మానించిన జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఆర్‌సి కే.శ్రీనివాస రావు

నవతెలంగాణ -కొత్తగూడెం

సింగరేణి ఉద్యోగి కోల్ ఇండియా స్థాయిలో జరిగిన క్రీడా పోటిల్లో డీజీఎం (ఫారెస్ట్) ఏబి. హరినారాయణ బంగారు పతకం సాధించారు. శనివారం సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలోని జిఎం పర్సనల్ వెల్ఫేర్, ఆర్‌సి కె.శ్రీనివాస రావు క్రీడాకారుడిని సన్మానించారు. 27 డిసెంబర్ 24 నుండి 29 డిసెంబర్ .2024 వరకు కోల్ ఇండియా స్థాయిలో ఎస్‌ఈసిఎల్ ఆధ్వర్యంలో బిలాస్పూర్ లో జరిగిన షటిల్ బాల్ బ్యాట్మింటన్ వెటరన్ డబుల్స్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడం గర్వకారణం అన్నారు. పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనముగా సన్మానించి అభినంధించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం (పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం(ఐటి) హరి శంకర్, డిజిఎం(పర్సనల్) పి.వేణు గోపాల రావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే చేపట్టాలి...

- కౌలు రైతుల గుర్తింపు కోసం 2011 లెసెన్స్‌డ్ సాగుదారుల చట్టం అమలు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



నూతన రెవెన్యూ చట్టం 2025 భూ భారతిలో భాగంగా సమగ్ర భూ సర్వే చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో రైతు సంఘం అధ్యక్షులు మల్లెంపాటి రామారావు అధ్యక్షతన నూతన ఆర్వో ఆర్ చట్టం, భూ భారతి పై జరిగిన రైతు అవగాహన సదస్సులో బొంతు రాంబాబు మాట్లాడుతూ భూములు సమస్యలు పూర్తి స్థాయిలో శాశ్వత పరిష్కార కావాలంటే సమగ్ర భూ సర్వే మాత్రమే మార్గం అన్నారు. ప్రస్తుతం సాగు ఆధారంగా సర్వే చేసి భూ భారతిలో భాగంగా భూ ఆధార్ కార్డు ఇవ్వాలని అన్నారు. కేసిఆర్ ప్రభుత్వం రూపొందించిన ధరణి పోర్టల్ రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల భూమి పార్ట్ బిలో ఉంచి పాస్ పుస్తకాలు మంజూరు చేయలేదని, భూ భారతి నూతన ఆర్వో ఆర్ చట్టం సెక్షన్ 3 జాగీరు రద్దు 1948, ఇనాం రద్దు 1955 ప్రకారం ఆ భూములను ప్రభుత్వ భూములుగా గుర్తించాలనే ఆలోచన విరమించుకోవాలని, ఆ భూములను పేదలు సాగు చేస్తున్నారని, వారిని గుర్తించి అర్హులకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. వైరా మండలంలో 600 ఎకరాల నవాబ్ నజర్దీన్ భూములను రైతులు 80 సంవత్సరాల నుంచి సాగు చేయడం జరుగుతుందని, సెక్షన్ మూడు ప్రకారం ఈ రైతులకు భవిష్యత్తులో కూడా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కావడం సాధ్యం కాదని అన్నారు. సెక్షన్ 6 సాదా బైనామాలు 2014 జున్ 2 కంటే ముందు తెల్ల కాగితాలపై జరిగిన క్రయ, విక్రయాలకు 2020 అక్టోబర్ 12 నుంచి, నవంబర్ 10, 2020 వరకు నెల రోజులు వ్యవధిలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే భూములు రిజిస్ట్రీ చేయబడతాయని పేర్కొన్నారని, అలాకాకుండా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన డిసెంబర్ 7 తుది గడువుగా గుర్తించి ఐదు ఎకరాల లోపు సాగు భూములకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించాలని, ఐదు ఎకరాల పైబడిన వారికి ఫీజు వసూలు చేసి సాదాబైనామా పరిష్కారం చేయాలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో లైసెన్స్ రైతుల చట్టం -2011 కౌలు రైతులకు కోసం తీసుకువచ్చారని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత చట్టం అమలు చేయకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రక్కన పెట్టిందని, కౌలు రైతులను గుర్తించి రుణ గుర్తింపు కార్డు ఇవ్వాలని అన్నారు. దీనివల్ల కౌలు సాగుదారులకు పంట రుణం, పంటల బీమా పరిహారం, ప్రభుత్వ పథకాలు మాత్రమే వర్తిస్తాయని, అసైన్డ్ భూములు క్రయ విక్రయాలను రెగ్యులరైజ్ చేయటానికి గత టీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో సవరణ చేసిందని, ఆ చట్ట సవరణ ప్రకారం 31-12-2017 నాటికి అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన అర్హులైన పేదలకు పట్టాలివ్వాలని, సమగ్ర భూ సర్వే చేపట్టాలని, పోడు సాగు దారులకు భూ భారతి ఆర్వో ఆర్ చట్టం ప్రకారం పాస్ పుస్తకం, భూ ఆధార్ కార్డు ఇవ్వాలని అన్నారు. గత డెబ్బై ఐదు సంవత్సరాల నుంచి రాష్ట్రంలో ఉద్యమాలు ద్వారా సాధించుకున్న భూ హక్కులను నూతన చట్టం గుర్తించి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు, మాజీ ఎంపిపి బొంతు సమత, తోట నాగేశ్వరరావు, రైతు సంఘం వైరా డివిజన్ నాయకులు దొడ్డపనేని కృష్ణార్జునరావు, సంక్రాంతి పురుషోత్తం, వడ్లమూడి మధు, పారుపల్లి శ్రీనాథ్, పాసంగులపాటి చలపతిరావు, బాబు, మాడపాటి రాజేష్, అమరనేని కృష్ణ, నూకల వెంకటేశ్వరరావు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన వేతన ఒప్పందంతోనే కార్మికులకు ఉజ్వల భవిష్యత్తు

- ట్రేడ్ యూనియన్‌లలో మార్పు రావాలి
- సీఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

నవతెలంగాణ-బూర్గంపాడు

ఈనెల 31న ఐటీసీలో జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్టియు సీఐటియు మిత్రపక్షాల యూనియన్‌ను గెలిపిస్తేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. శనివారం రాత్రి సారపాకలోని ఈస్ట్ గెట్ ఎదురుగా మిత్రపక్షాల ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఐటీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో 30 సంవత్సరాలుగా టీఎన్టీయూసీ, ఐఎన్టియూసి యూనియన్‌లను గెలిపించడం వల్ల కార్మికులకు ఎలాంటి న్యాయం జరగటం లేదని ఆయన అన్నారు. ఐటీసీలో ట్రేడ్ యూనియన్‌లో మార్పు రావాలని, ఈ మార్పు సిఐటియు, బిఆర్టియు మిత్రపక్షల గెలుపుతోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు గెలిచిన ట్రేడ్ యూనియన్ నాయకులు తమ ఆస్తులను పెంచుకోవడమే తప్ప కార్మికుల సంక్షేమం కోసం పాటుపడిందలేదని ఆయన అన్నారు. కార్మిక సంక్షేమాన్ని విడిచిపెట్టి యాజమాన్యాలకు ప్రలోభాలకు పడి గతంలో జరిగిన వేతన ఒప్పందాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. వేతన ఒప్పందాలలో మార్పు రావాలని, ఆ మార్పు వల్ల కార్మికుల సంక్షేమ ఉద్యోగ భద్రత సాధ్యమవు తుందని ఆయన అన్నారు. వందల కోట్ల లాభాలను ఆర్జిస్తున్న ఐటీసీ సంస్థ కార్మికులకు చేసేది చాలా తక్కువేనని ఆయన అన్నారు. అదేవిధంగా బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు జి. రాం బాబు యాదవ్ మాట్లాడుతూ ఐటీసీ లాభాల్లో ఉన్నప్పటికీ కార్మికులకు అవసరమైనటు వంటి విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. ఈ బహిరంగ సభకు బిఆర్టియు ప్రధాన కార్యదర్శి సానికొమ్ము శంకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, సిఐటియు ఐటిసి కార్యదర్శి మళ్లీ కంటి వెంకటేశ్వర్లు, మిత్రపక్షల యూనియన్ నాయకులు సాబీర్, కేసుపాక నరసింహారావు, మధు మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెండు రాష్ట్రాల స్థాయి క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రెండు రాష్ట్రాల స్థాయి క్రికెట్ క్రీడా పోటీలు శనివారంతో ముగిసినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయి మెగా క్రికెట్ టోర్న మెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ పోటీలలో 35 జట్లు పాల్గొనట్లు తెలిపారు. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన టీం పై ఎస్వీఎస్ వరియర్స్ పోటీపడగా జమలాపురం గ్రామానికి చెందిన ఎస్వీఎస్ వరియర్స్ విజయం సాధించి తన గెలుపును పదిల పరుచుకున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 30 వేల 116 రూపాయలు, రెండవ బహుమతి 20వేల116, మూడవ బహుమతి పదివేల116లు, నాలుగవ బహుమతి 50,116 రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. వీటితోపాటు బెస్ట్ బ్యాట్స్ మెన్ కు 2016 రూపాయలు, బెస్ట్ బౌలర్‌కి 2016 రూపాయలు, బెస్ట్ కీపర్ కి 2016 రూపాయలు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సీల్డ్ విజయం సాధించిన జట్లకు అందించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ క్రికెట్ క్రీడా పోటీలకు సహకరించిన దాతలకు, గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు.

సింగరాయపాలెంలో కంటి వైద్య శిబిరం..

నవతెలంగాణ-కొణిజర్ల



మండల పరిధిలోని సీంగరాయపాలెం గ్రామంలో సీపీఐ(ఎం) కార్యలయంలో శనివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఖమ్మం పట్టణానికి చెందిన మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి వైద్యులు సుమారు వంద మందికి పైగా రోగులకు కంటి పరీక్షలు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ మాజీ ఉప సర్పంచ్ కంకణాల చిన్న బిక్షాలు, సీపీఐ(ఎం) వైరా డివిజన్ నాయకులు దొడ్డపనేని క్రిష్టార్జున్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రామశాఖ కార్యదర్శులు షేక్ అఫ్జల్, మిద్దె రామారావు, ఆనుమోలు వెంకటేశ్వర్లు, షేక్ సైదా, కంకణాల సుదర్శన్, మ్యాక్స్ విజన్ కంటి వైద్యులు పాల్గొన్నారు.

రేణుక చౌదరికి సన్మానం

నవతెలంగాణ-వైరాటౌన్



కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరిని కాల్వ సుజాత అభిమాన సంఘం నాయకులు సన్మానించారు. ఖమ్మంలోని రేణుక చౌదరి క్యాంప్ కార్యాలయంలో కాల్వ సుజాత అభిమాన సంఘం రాష్ట్ర నాయకులు గ్రంధి ప్రవీణ్ కుమార్, తాడికొండ రాము, వైరా మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గొండేలా రవికుమార్, కాల్వ సుజాత అభిమాన సంఘం ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు, టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం వారు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడంలో రేణుక చౌదరి కీలక పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల సంతోష్, కట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- ఎంపీడీవోకు వినతి

నవతెలంగాణ-వైరా



మండల పరిధిలోని గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వైరా మండల ఎంపీడీవో సరస్వతి, ఎంపీవో జోష్నాదేవికి మండల పంచాయతీ కార్మికులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైరా మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు ఆళ్ల శ్రీనివాసరావు, తెల్లూరి రాజేష్, ముక్కా రాంబాబులు మాట్లాడుతూ..గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దుచేసి కారోబార్, బిల్ కలెక్టర్‌గా సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. పంచాయతీ సిబ్బందికి 5 లక్షల ప్రమాద బీమాను ప్రభుత్వమే చేయించాలని కోరారు.



ప్రజానాట్యమండలి నేత కుంజా వెంకన్న మృతి

- నివాళులర్పించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కారేపల్లి

ప్రజానాట్యమండలి కళాకారుడు కారేపల్లి మండలం ఎర్రబోడుకు చెందిన సీపీఐ(ఎం) సభ్యుడు కుంజా వెంకన్న(46) శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను ఖమ్మం ఆసుపత్రిలో చేర్పించి చికిత్స నిర్వహిస్తుండగా శనివారం మృతి చెందారు. మూడు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. అప్పటి నుండి అనారోగ్య సమస్యలతో కుంజా వెంకన్న ఇబ్బందులు పడుతున్నారు. బిల్డింగ్ వర్కర్ కూడా అయిన వెంకన్న ప్రజానాట్యమండలి కళాకారుడుగా సిపిఐ(ఎం) కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని ప్రజలను ఉత్తేజితులను చేసేవాడు. మృతుడు వెంకన్న కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కుంజా వెంకన్న మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, కొండబోయిన ఉమావతి, సీపీఐ(ఎం) నాయకులు వజ్జా రామారావు, రేగళ్ల మంగయ్య పండగ కొండయ్య, దమ్మాలపాటి ప్రభాకర్, కురసం శ్రీను, కరపటి సీతారాములు, బోనగిరి యాదగిరి, కరకపల్లి రాజమల్లు, ఈసం వెంకన్న, కల్తి రామచంద్రు, కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు, కుర్సం సత్యనారాయణ, కడియాల సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు అడపా పుల్లారావు కడియాల రాజు తదితరులు పాల్గొన్నారు.



పాల సేకరణ కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని మొలుగుమాడు, సఖినవీడు గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలను శనివారం డిఆర్డిఓ నూరుద్దిన్ ఐకెపి వారి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా డైరీని సవాలుగా తీసుకొని పాల సేకరణ చేయాలని అన్నారు. ఐకెపి సిబ్బంది డ్వాక్రా గ్రూపుల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీ మహిళలకు పూర్తిస్థాయిలో అ వగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి వెంకటనారాయణ, సూరానేనీ రామకోటేశ్వరరావు, ఇందిరా మహిళా డెయిరీ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఎమ్ఎస్ అధ్యక్షురాలు అనిత, ఏపిఎమ్ డెయిరీ లక్ష్మణ్‌రావు, ఏపిఎమ్ హరినారాయణ, సిసిలు టీ.రమాదేవి, క్రిష్ణరెడ్డి, రమణారెడ్డి, శాంతకుమారి, లత, గోపాల మిత్ర తదితరులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య విద్య సంస్థలు దేశానికి తలమానికం

- విద్యాసంస్థల డైరెక్టర్ మల్లంపాటి శ్రీధర్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

శ్రీ చైతన్య విద్య సంస్థలు దేశానికి తలమానికం అని విద్యాసంస్థల డైరెక్టర్ మల్లంపాటి శ్రీధర్ అన్నారు. ఇటీవల జాతీయస్థాయిలో ఐఎపిటి, హెూమి బాబా సెంటర్ సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించిన జూనియర్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలలో స్థానిక మమత హాస్పిటల్ రోడ్డులోని శ్రీ చైతన్య ఒలంపియాడ్ పాఠశాల ఐపీఎల్ విభాగానికి చెందిన విద్యార్థులు నలుగురు తన చట్టచాటారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కౌశిక్ రెడ్డి సాయి మహేష్ జోషిత్, పదవ తరగతి చదువుతున్న పార్థు విద్యార్థులు పరీక్షకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ తెలంగాణకే తలమానికంగా మారిన తమ విద్యాసంస్థ నుండి 9 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన జెస్ఓ పరీక్షలలో విజయం సాధించటంతో గర్వంగా ఉందని అన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించినందుకు తోడ్పాటు అందించిన ప్రిన్సిపల్ శర్మ, ఐపీఎల్ ఇన్చార్జి రాజశేఖర్‌రెడ్డి, సైన్సు ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజిఎం చేతన్, కోఆర్డినేటర్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం

నవతెలంగాణ-కల్లూరు

స్ఫూర్తి ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న ఇంగ్లీష్, తెలుగు, మీడియం నందు 60 మంది విద్యార్థులుకు అల్పాహారంని ఎంఈఓ పత్తిపాటి నివేదిత శనివారం ప్రారంభించారు. నిరుపేద విద్యార్థులు అవటం చేత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్తిపాటి నివేదిత స్ఫూర్తి ఫౌండేషన్ అధినేత వుయ్యూరి శ్రీవ్యాల్ హైదరాబాద్ వారిని సంప్రదించి వారిచే 60 రోజులకు కాను అల్పాహారం 36 వేల రూపాయలు అందించటం జరుగుతున్నది ఆమె ఇచ్చి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు వరక రామారావు పసుపులేటి వీర రాఘవయ్య, శిరీష . స్ఫూర్తి ఫౌండేషన్ వాలంటరీస్ ఉబ్బన బాబురావు రామకృష్ణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మోదుగు వెంకటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన తహసీల్దార్

నవతెలంగాణ-ముదిగొండ



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలపరిధిలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తహశీల్దార్ సునీతఎలిజిబెత్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంతోపాటు, పరిసరాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఎస్ఓ ఇందిరాతో ఆమె మాట్లాడి విద్యాలయంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు మెనూ ప్రకారం శుచి, రుచిగా భోజనం అందించాలన్నారు.సిబ్బందికి పలు విషయాలపై సూచనలిచ్చారు. విద్యాలయంలో కోతుల బెడద ఉండడంతో కోతుల బెడద లేకుండా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ సునీతఎలిజిబెత్ తెలిపారు. వారి వెంట రెవిన్యూ ఇన్స్పెక్టర్ పి .ప్రసన్నకుమార్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిరా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ

- తహసీల్దార్ రాంప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఖమ్మం రూరల్ తహశీల్దార్ రాంప్రసాద్ అన్నారు.ఖమ్మం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాంప్రసాద్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఇంటింటి సర్వేలో (కులగణన) రేషన్ కార్డు దరఖాస్తు చేసుకొని, సర్వేలో పేరు రాకపోయిన ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. రేషన్ కార్డుల సర్వే జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది పేర్లు రాలేదని ఆందోళన చెందుతున్నారని, పేరు రాకపోయినా ఎటువంటి ఇబ్బంది పడవద్దన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం జరుగుతుందని,మరోసారి అర్హులైన వారి నుండి దరఖాస్తులు తీసుకొని, రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు సూచించారు.

నిబంధనల పేరుతో రేషన్‌కార్డుల్లో కోత

- కులగణన సర్వే ప్రామాణికం కాదు
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా కార్డులు జారీ చేయండి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొత్త ఆహార భద్రత కార్డుల (రేషన్ కార్డుల) జారీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుతో పేదలు నష్టపోతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం బహిరంగ లేఖ రాశారు. అభయహస్తం మ్యానిఫెస్టోలో అర్హులైన వారందరికి రేషన్ కార్డులిస్తామని చెప్పి, ఇప్పుడు కొందరికే పరిమితం చేసే విధంగా నిబంధనలు రూపొందించారని విమర్శించారు. పౌరసరఫరాల శాఖ పదేండ్ల క్రితం ఇచ్చిన ఉత్తర్వులను తాజాగా అమలు చేయాలని చూడటాన్ని ఆయన లేఖలో తప్పు పట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిబంధనలను యథాతథంగా పాటిస్తే, లక్షలాది మంది నిరుపేదలు రేషన్ కార్డులు పొందేందుకు అనర్హులవుతారాని గుర్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మార్పులు చేసిందని గుర్తు చేశారు. ఆదాయ పరిమితి గ్రామాల్లో రూ. 60వేలు, పట్టణాల్లో రూ. 75వేలు ఉంటే, దాన్ని గ్రామాల్లో రూ. లక్షా 50వేలకు, పట్టణాల్లో రూ.2.50 లక్షలకు పెంచిందని గుర్తు చేశారు. పెంచిన వాటిని పరిగణంలోకి తీసుకోకుండా ఇప్పుడు దాన్నే పాటిస్తామని చెప్పడమంటే పేదలకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఈ ఏడాది జనవరి 12న పౌరసరఫరాల శాఖ ఇచ్చిన ఉత్తర్వులననుసరించి కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల లబ్దిదారుల జాబితా తయారవుతాయని పేర్కొనడం పేద ప్రజల పాలిట శాపంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు సర్వేకూ ఎలాంటి లంకె ఉండదని చెప్పిన ప్రభుత్వం దాని ఆధారంగానే కార్డులు ఇస్తామని ప్రకటించడం తెలంగాణ ప్రజలను వంచించడమేనని వ్యాఖ్యానించారు. కుల గణన సర్వే ఆధారంగా కాకుండా ప్రజాపాలన సందర్భంగా తీసుకున్న దరఖాస్తుల ఆధారంగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని లేఖలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మున్సిపాల్టీ, గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా జీతాలు చెల్లించక పోవడటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరితో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు మొదలగు చిరు ఉద్యోగుల జీతాలను వెంటనే చెల్లించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కూలీలకు భరోసా ఇచ్చే విషయంలో ప్రభుత్వం కోతలు విధించడడం దుర్మార్గమని అంతకు ముందు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో వారికి ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని చెప్పి మాట తప్పుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధి హామిలో 52లక్షల కార్డులు, కోటి 4లక్షల మంది కూలీలుండగా, 20 రోజులు పని చేసిన వారికే అని నిబంధనలు పెట్టి, అర్హులను 25లక్షలకు కుదించారని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో అప్పు కట్టలేక బ్యాంకులోనే పురుగుల మందు తాగి చనిపోయిన రైతు కుటుంబానికి రూ. 10లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హార్ట్ అటాక్స్ నుంచి ప్రజలను రక్షించుకోవాలి

- ప్రతి 10-20 నిమిషాల దూరంలో సీపీఆర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి
- ఇండో-యూఎస్ సైంటిఫిక్ కన్వెన్షన్‌లో వైద్యనిపుణులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా పెరుగుతున్న హార్ట్ అటాక్ కేసుల నుంచి ప్రజలను రక్షించుకోవాల్సిన అవసరముందని పలువురు వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఏఏపీఐ),అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఐఎంఏ, ఎఐజీల ఆధ్వర్యంలో - ఇండో-యూఎస్ సైంటిఫిక్ కన్వెన్షన్ జరిగింది. ఈ సందర్భంగా ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాధరెడ్డి, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ వేమూరి మూర్తి, అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఆపి) అధ్యక్షులు డాక్టర్ సతీష్ కత్తుల, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అశోక్, ఎఐజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు, కార్డియాలజీ డైరెక్టర్ డాక్టర్ నరసింహన్‌లు దేశంలోని ప్రజలు గుండెపోటుకు గురై సకాలంలో సీపీఆర్ అందక మరణిస్తున్న ఘటనలు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి 10-20 నిమిషాల ప్రయాణ దూరంలో దేశవ్యాప్తంగా సీపీఆర్ సెంటర్లు రావాల్సిన అవసరముందని సూచించారు. అలాగే విద్యాలయాల్లో విద్యార్థులకు, పరిశ్రమల్లో ఉద్యోగాల్లో చేరే సమయంలో ప్రతి ఒక్క ఉద్యోగికి సీపీఆర్‌పై శిక్షణ, న్యూట్రిషన్ విలువల గురించిన అవగాహన కల్పించాలని కోరారు. అమెరికన్ కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ మాట్లాడుతూ ఇండో-అమెరికన్ శాస్త్ర సాంకేతిక భాగస్వామ్యం, ప్రజల ఆరోగ్యం, వాతావరణ మార్పులు, స్థిరమైన అభివృద్ధి వంటి గ్లోబల్ సమస్యలను పరిష్కరించడానికి దోహదపడుతుందని తెలిపారు.

మెడికల్ విద్యార్థుల బ్యాక్‌లాగ్ క్లియరెన్స్‌కు అవకాశం కల్పించండి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తల్లిదండ్రుల విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ మెడికల్ కళాశాలల్లో 2021-22 బ్యాచ్‌కి చెందిన ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బ్యాక్ లాగ్ క్లియరెన్స్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించాలని పలువురు తల్లిదండ్రులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కోరారు. శనివారం పలువురు ఎంబీబీఎస్ బ్యాక్‌లాగ్ విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 70 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇచ్చిన నాలుగు అవకాశాల్లో సబ్జెక్టులు క్లియర్ చేసుకోలేక పోయారని, వారికి ఐదోసారి అవకాశం ఇప్పించి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటును అందించాలని తల్లిదండ్రులు కోరారు. వైద్యవిద్య ప్రవేశ పరీక్ష 2021 సెప్టెంబర్ 13న జరగగా, 2022 జనవరిలో కౌన్సిలింగ్ నిర్వహించి 2023 జనవరిలో పరీక్షలు నిర్వహించారని తెలిపారు. కానీ కోవిడ్ ప్రభావంతో మెడికల్ ఎంట్రెన్స్, తరగతులు, పరీక్షలు సకాలంలో జరగలేదనీ, అందువల్ల విద్యార్థులు నాలుగు సార్లు అవకాశాలు కల్పించినప్పటికీ మొదటి సంవత్సరం సబ్జెక్టులు క్లియర్ చేయలేక పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఈఈటి (నీట్) ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ ఆ కోర్సులో ఉత్తీర్ణులు కాకపోతే వారి భవిష్యత్తు ఇబ్బందికరంగా మారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ కారణంగా ముందు బ్యాచ్ విద్యార్థులకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఐదోసారి అవకాశం ఇచ్చిందనీ, అదే విధంగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎన్ఎంసీ ద్వారా ఈ 70 మంది విద్యార్థులకు కూడా మరోసారి అవకాశం కల్పించి న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. ఇది దేశవ్యాప్త సమస్య అని, కేవలం రాష్ట్రస్థాయిలో చేయడం కుదరదనీ, ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత మంత్రిత్వ శాఖ దష్టికి తీసుకువెళతానని మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

కోల్ కార్మికులకు రూ. కోటి ఇన్సూరెన్స్

- అధ్యక్ష పదవికి రెండు క్రియాశీల సభ్యత్వాలు తప్పనిసరి
- మూసీ సుందరీకరణ చేయాల్సిందే
- హైడ్రా కొత్తదేం కాదు..పాతదే
- చెరువులు కబ్జా చేస్తే చర్యలు తప్పవని ముందు నుంచే ఉంది
- మెట్రో ఫేస్-2కు ఆర్థిక సహాయం మా బాధ్యత
- తనకు జాతీయ అధ్యక్ష పదవి అనేదానిపై పార్టీదే నిర్ణయం
- ఉచితాలకు మేం వ్యతిరేకం కాదు..ఆర్థిక వనరుల ఆధారంగా హామీలుండాలి : మీడియాతో చిట్‌చాట్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన శాఖ పరిధిలోని ఆరు లక్షల మంది కార్మికులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల ఇన్సూరెన్స్‌ను త్వరలో ఇవ్వబోతున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. గనులు జాతీయ సంపద కాబట్టి రాష్ట్రాలకు హక్కు ఉండదనీ, త్వరలో వాటిని కేంద్రం పరిధిలోకి తీసుకుంటామని చెప్పారు. రాజకీయంగా తమ ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. 'మూసీ సుందరీకరణ చేయాల్సిందే. కానీ, పేదల ఇండ్లను కూలగొట్టొద్దన్నదే మా డిమాండ్. ఇప్పుడున్న కాల్వల్లో కృష్ణా, గోదావరి నీళ్లు పారించాల్సిందే. నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించాల్సిందే. విధివిధానాలు, ఫ్రేం వర్క్ రూపొందించిన తర్వాత అది ఆమోదం పొందితే మూసీ సుందరీకరణకు తప్పనిసరిగా నిధులు ఇస్తాం' అని చెప్పారు. 'హైడ్రా కొత్తదేం కాదు..పేరు మారిస్తే అది కొత్త చట్టమా? చెరువులను కబ్జా చేస్తే చర్యలు తప్పవనేది ముందు నుంచే ఉంది' అని అన్నారు. తమ పార్టీలో అధ్యక్ష పదవి చేపట్టాలంటే రెండుసార్లు క్రియాశీల సభ్యత్వం పొందటం తప్పనిసరని తేల్చారు. ఆ నిబంధన ప్రకారం ఈటలకు అధ్యక్ష పదవి లేనట్టేనా అని అడగ్గా.. ఆయన ఇప్పటికే హుజూరాబాద్ బైపోల్, గజ్వేల్, హుజూరాబాద్ అసెంబ్లీ, మల్కాజిగిరి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారు కాబట్టి ఆయన అర్హుడే అని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో కిషన్‌రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో మహిళలకు 33 శాతం పదవులు ఇవ్వబోతున్నామనీ, కొన్ని చోట్ల ఒకటెండ్రు శాతం అటూఇటూగా ఉండొచ్చని కూడా చెప్పారు. 50 శాతం కంటే ఎక్కువ మంది బీసీలకు మండల కమిటీ అధ్యక్షులుగా నియమిస్తున్నామనీ, మండలాధ్యక్షులు 45 ఏండ్లలోపు వారే ఉండాలనే నిబంధన పెట్టుకోవడంతో యువరక్తం తమకు ప్లస్ కాబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తామనీ, వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుస్తామని చెప్పారు. జీతాలిచ్చేందుకే డబ్బుల్లేని కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలను ఏ విధంగా అభివృద్ధి చేస్తుందని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో ఏడు నెలలుగా వీధిదీపాల ఏర్పాటుకు నిధుల కొరత ఉందన్నారు. ఢిల్లీలో బీజేపీ ఉచితాల హామీలపై ప్రశ్నించగా...ఉచిత పథకాలకు వ్యతిరేకమని తమ పార్టీ ఎప్పుడూ చెప్పలేదనీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆధారంగా హామీలు ఇవ్వాలన్నదనే తమ విధానం అని చెప్పారు. జీఎస్టీ నిబంధనల ప్రకారమే రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తున్నామనీ, ఎక్కువ, తక్కువ ఇవ్వడం, వివక్ష చూపడం వంటిదానికి తావేలేదని స్పష్టం చేశారు. విభజన చట్టం ప్రకారమే ఏపీకి నిధులిస్తున్నామనీ, స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,445 కోట్లు ఇచ్చామని వివరించారు. తెలంగాణకు విభజన చట్టం హామీలపై అడగ్గా..ఆర్‌ఆర్‌ఆర్ ఇచ్చాం....టెక్స్‌టైల్స్ పార్కులిచ్చాం..పసుపు బోర్డు తెచ్చాం..డిఫెన్స్‌లో పెద్ద ఎత్తున నిధులు ఖర్చుపెట్టాం..అంటూ దాటవేశారు. మెట్రో తొలిదశకు రూ.1250 కోట్లు ఇచ్చామనీ, బీఆర్ఎస్ మజ్లిస్ నేతలు కలిసి అడ్డుకున్నారని విమర్శించారు.

రెండో దశకు నిధులు తెప్పించే బాధ్యత తనదే అని నొక్కి చెప్పారు. ట్రైబల్ యూనివర్సిటీకి సంబంధించిన 211 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా హ్యాండ్ ఓవర్ చేయలేదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఎలా ఇచ్చారు? ప్రభుత్వ ఉపాధ్యాయులే పార్టీకి దొరకలేదా? అని ప్రశ్నించగా...'కరీంనగర్ స్థానం నుంచి పోటీచేసే మల్క కొమురయ్య కార్పొరేట్ వ్యక్తి కాదు విద్యాసంస్థలు పెట్టి పేదలకు విద్య అందిస్తున్నారు..దశాబ్దాలుగా విద్యారంగంలో ఉన్నారు.. మా పార్టీ క్యాండిడేట్ నియామకం మా ఇష్టం' అని దాటవేశారు. ఒన్ నేషన్..ఒన్ ఎలక్షన్‌కు కట్టుబడి ఉన్నామనీ, వచ్చే ఎన్నికల్లో సాధ్యమా? కాదా? అనేదాన్ని ఇప్పుడే చెప్పలేమని తెలిపారు.

టీచర్లపై అరాచక శక్తుల దాడులు అరికట్టాలి

హెచ్‌ఎం రాములుపై దాడికి పాల్పడ్డ వారిని శిక్షించాలి

- ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి : సీఎస్ శాంతికుమారికి టీఎస్‌యూటీఎఫ్ వినతి
- రేపు పాఠశాలల్లో నిరసన ప్రదర్శనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులను అరికట్టాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) కె రాములుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరింది. పాఠశాలల్లో అరాచక శక్తుల జోక్యం పట్ల కఠినంగా వ్యవహరించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితోపాటు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాను శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ వేర్వేరుగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గతనెల 21న సాయంత్రం పాఠశాల ఆవరణలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బోధన చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కె రాములు మోకాలు పొరపాటున అయ్యప్పమాల వేసుకున్న విద్యార్థికి తగిలిందనే కారణంతో అదేనెల 23న ఉదయం 11 గంటల సమయంలో పాఠశాలతో ఏమాత్రం సంబంధం లేని భక్తుల ముసుగులో ఉన్న అసాంఘిక శక్తులు సుమారు 50 మంది (కొందరు అయ్యప్పమాల ధారులు, మరికొందరు ఇతరులు) చొరబడి హెచ్‌ఎం రాములుపై దాడి చేసి అసభ్యకర పదజాలంతో దూషించడంతోపాటు విచక్షణా రహితంగా కొట్టారని తెలిపారు. ఆయన వేసుకున్న బట్టలను చింపి వేశారని పేర్కొన్నారు. ఆ విద్యార్థి కాళ్లు మొక్కించి అవమానించారని వివరించారు. ప్రధానోపాధ్యాయుని విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా పాఠశాల కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. దాడి జరిగిన రోజు ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారనీ, దాడి చేసినవారు బెదిరించి ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకునేటట్టు చేశారని తెలిపారు. ఆ తర్వాత హెచ్‌ఎం రాములు తనకు జరిగిన అవమానాన్ని సహించలేక ధైర్యం కూడగట్టుకుని తిరిగి గతనెల 29న పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నెంబర్ 682/2024 నమోదు అయ్యిందని వివరించారు. కానీ నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదని తెలిపారు. గతంలో నిజామాబాద్ జిల్లా కోటగిరి ఉన్నత పాఠశాలలో సైతం మతం ముసుగులో కొందరు అరాచకవాదులు మల్లికార్జున్ అనే ఉపాధ్యాయునిపై ఇదే విధంగా దాడి చేసి అవమానించారని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలు ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేస్తున్నాయని తెలిపారు. కనుక పాఠశాలల్లో ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుక్కుగూడ పాఠశాల హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడి ఘటనకు నిరసనగా సోమవారం అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో జరిగే నిరసన ప్రదర్శనల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

బాలికలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలి

- చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-దౌల్తాబాద్

బాలికలను ఉపాధ్యాయులు అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాల కనుగుణంగా చదివి ఉన్నతంగా ఎదగాలని, విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటాలని, చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం బాలికల వసతి గృహం ప్రారంభం, ఇందిరమ్మ నమూనా గృహానికి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల పేరు మీద ఒక్కొక్క మొక్క నాటాలని సూచించారు.మెయిన్ రోడ్డు నుంచి ఆదర్శ పాఠశాలకు వెళ్లేందుకు సీసీ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్‌కు సూచించారు. సీసీ రోడ్డుతో పాటు ఐమాక్స్ లైట్లు, స్ట్రీట్ లైట్లు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇందిరమ్మ ఇంటిని నాణ్యతతో నిర్మించాలన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ ఆందోళన

ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఫ్లెక్సీ మీద ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేరు లేకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వివాదం జరగడంతో పోలీసులు నిలువరించారు. వెంటనే అధికారులు ఫ్లెక్సీని తొలగించడంతో గొడవ సద్దు మణిగింది. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన మంత్రి

అంగన్వాడి కేంద్రాలలో మంత్రి తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో సదానందం, తహసీల్దార్ చంద్రశేఖర్ రావు, ఎంఈఓ గజ్జల కనకరాజు, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, దౌల్తాబాద్ మాజీ ఎంపీపీ గంగాధర్ సంధ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధిని ప్రశ్నించిన ఏసీబీ

ఫార్ములా-ఈ కారు రేస్ కేసులో మూడు గంటలు విచారణ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కారు రేసింగ్ కేసులో శనివారం ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధిని మూడు గంటల పాటు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విచారించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రతినిధి సీఎస్ శెట్టిని ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా మూడు గంటల పాటు ప్రశ్నించారు. ఫార్ములా-ఈ కారు రేసింగ్ మొదటి సెషన్‌లో భాగస్వామి అయిన ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ రెండో సెషన్ వచ్చే సరికి అకస్మాత్తుగా ఎందుకు ఒప్పందాన్ని వీడి వెళ్లిపోయింది? మొదలుకొని ఒప్పందంలో ఏవైనా విబేధాలు తలెత్తాయా? లేక లాభాలు రానందున వెళ్లిపోయారా? వరకు ఏసీబీ అధికారులు ఈ సంస్థ ప్రతినిధిని క్షుణ్ణంగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఫార్ములా-ఈ కారు రేసింగ్ ఒప్పందం విషయంలో అటు యూకేకు చెందిన ఎఫ్ఈఓ సంస్థతో, ఇటు హెచ్ఎండీఏతో ఎలాంటి ఒప్పందాలు కుదిరాయి? ఈ-కారు రేసింగ్ నిర్వహణ కోసం బిడ్డింగ్ ఎవరెవరి మధ్య జరిగింది? మీకు బిడ్డింగ్ ఎంతకు దక్కింది? మీరు రూ.30 కోట్లను చెల్లించటం మాట వాస్తవమేనా? అనే ప్రశ్నలను కూడా ఏసీబీ సంధించినట్టు సమాచారం. ఫార్ములా రెండో సెషన్ ప్రారంభం నాటికి మీకు లాభాలు ఏ మేరకు వస్తాయని ఆశించారు? అవి రావటం లేదని నిర్ధారణకు ఎలా వచ్చారు? ఈ విషయంలో హెచ్ఎండీఏ, ఎఫ్ఈఓతో మీ మధ్య జరిగిన చర్చలేమిటి? అనే దిశగా కూడా ఏసీబీ అధికారులు సమాచారాన్ని రాబట్టటానికి ప్రయత్నించారని తెలిసింది. అయితే, తమకు ఫార్ములా-ఈ కారు రేసింగ్‌లో లాభాలు రాకపోవటం వలనే తాము ఇందులో నుంచి వైదొలిగినట్టు ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధి అధికారులకు తెలిపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఈ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హెచ్ఎండీఏ మాజీ కార్యదర్శి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలతో జరిపిన విచారణ సందర్భంగా వెల్లడైన కొన్ని అంశాలను కూడా ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధుల ముందు ఉంచి ఏసీబీ అధికారులు ప్రశ్నించారని తెలిసింది. అవసరమైతే, మరోసారి విచారణకు పిలుస్తామని అధికారులు తెలిపినట్టు సమాచారం. ఉదయం 10:30 గంటలకు మొదలు కావాల్సిన విచారణ మధ్యాహ్నం వరకు సాగకపోవటానికి ఈ సంస్థ ప్రతినిధి విదేశాల నుంచి రావటానికి జరిగిన ఆలస్యమే కారణమని ఏసీబీ వర్గాలు తెలిపాయి. కాగా, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధితో జరిపిన విచారణ అంశాలనుబట్టి మరోసారి కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ అధికారులు ప్రశ్నించే అవకాశమున్నదని తెలిసింది.



రైతు భరోసాపై మాట్లాడే వారికి ప్రజా భరోసా లేదు

- రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి
- రాహుల్‌పై ఆరోపణలకు ఖండన

నవతెలంగాణ-ఖమ్మం

కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయబోతున్న నాలుగు పథకాలలో ఒకటైన రైతు భరోసాపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలకు రాష్ట్ర ప్రజల నుంచి భరోసా లేదని రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి అన్నారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. మోడీ సర్కారు వన్ నేషన్, వన్ ఎలక్షన్ అమలు వైఫల్యం చెందిందన్నారు. ఇందుకు వెస్ట్ బెంగాల్ ఎన్నికలు నిదర్శనమని తెలిపారు. ఒక్క రాష్ట్రంలోనే సజావుగా ఎలక్షన్ ప్రక్రియ నిర్వహించలేనివారు, దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. తమ అధినేత, ఎంపీ రాహుల్ గాంధీపై ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. దేశ ప్రధాని మన్మోహన్‌సింగ్ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఆదర్శం అని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని పార్లమెంట్‌లో తాము ప్రమాణం చేస్తే.. బీజేపీ వాళ్లు మాత్రం రాజ్యాంగంపై కాకుండా మతంపై ప్రమాణం చేస్తున్నారని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పడితే రైతాంగానికి మంచి జరగనుందన్నారు. నాన్ పెస్టిసైడ్, ఆర్గానిక్ ఫామ్ పంటలను పండించడం వల్ల కార్గో సర్వీస్ ద్వారా ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవచ్చని సూచించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించి మహన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, టీపీసీసీ స్పోక్స్ పర్సన్ కొరిపల్లి వెంకటరత్నం, మానుకొండ రాధ కిషోర్, ముస్తఫా ఉన్నారు.

సినీ అవకాశాల పేరుతో మహిళపై లైంగికదాడి

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఘటన

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

సినిమా అవకాశాలు ఇప్పిస్తానని నమ్మించి మహిళా జూనియర్ ఆర్టిస్ట్‌పై ఓ వ్యక్తి లైంగికదాడికి ఒడిగట్టాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన బాధిత మహిళ మూడు సంవత్సరాల కిందట భర్తను వదిలి హైదరాబాద్ వచ్చింది. మణికొండలో బంధువుల వద్ద ఉంటూ హౌస్ కీపింగ్ పనులు చేస్తూ జీవిస్తోంది. సినిమాలో అవకాశాలకు ప్రయత్నించాలనే ఉద్దేశంతో ఆమె బంధువుల ఇంటి నుంచి కూడా బయటకు వచ్చి కొన్ని నెలల నుంచి అమీర్‌పేటలోని లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో కొంతమంది పరిచయస్తుల ద్వారా ఒక సినిమాలో చిన్న క్యారెక్టర్ చేసింది. అసిస్టెంట్ డైరెక్టర్ అని చెప్పుకునే రాజు ఆమెను పరిచయం చేసుకున్నాడు. అనంతరం కృష్ణానగర్‌లోని హెవెన్ లాడ్జిలో రూమ్ తీసుకుని అడిషన్స్ పేరుతో ఆమెను రప్పించి ఫొటో షూట్ చేశాడు. మరుసటి రోజు (17వ తేదీ శుక్రవారం) కూడా ఆమెను లాడ్జికి పిలిచి లైంగికదాడి చేశాడు. దాంతో మహిళ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమెను పోలీసులు వైద్య పరీక్షలకు పంపించి, నిందితుడిపై బి.ఎన్.ఎస్ 64, 79, 115, 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మావోయిస్టు సీనియర్ నేత దామోదర్ మృతి

- తలపై రూ.50 లక్షల రివార్డు
- 12 మంది కాదు 18 మంది మృతి
- మావోయిస్టుల లేఖ విడుదల



(ఫైల్)

నవతెలంగాణ-చర్ల

దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడపడంలో తనదైన ముద్ర వేసుకున్న మావోయిస్టు నేత.. ములుగు జిల్లా కాల్వపల్లి గ్రామానికి దామోదర్ అలియాస్ బడే చొక్కారావు(50) బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ శనివారం లేఖ ద్వారా తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది కాదు.. 18 మంది కామ్రేడ్లు అమరులయ్యారని, అందులో సెంట్రల్ కమిటీ సభ్యులు, మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ ఉన్నారని పేర్కొన్నారు. ఆయన తలపై రూ.50 లక్షల రివార్డు ఉందని తెలిపారు. ఆయనతోపాటు హుంగి (పీపీసీఎం), దేవా (పీపీసీఎం), జోగా (పీపీసీఎం), నరసింహారావు (పీపీసీఎం) మృతిచెందినట్టు పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 18 మంది వీర సహచరులను పార్టీ కోల్పోయిందని, వారు చివరి వారికి పోరాడి తుది శ్వాస విడిచారని ముఖ్యంగా కామ్రేడ్ బడే చొక్కారావు ధైర్య సాహసాలను ప్రదర్శించి పోరాడుతూ అమరుడయ్యాడన్నారు. అతని మరణం పార్టీకి కోలుకోలేని నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. అయితే, ఆయన విప్లవాత్మక వారసత్వం వేలాది మంది కొత్త సహచరులకు స్ఫూర్తినిస్తుందన్నారు. సుమారు 5000 మందికి పైగా పోలీసులు అడవిలో బీభత్సం సృష్టించడంతోపాటు ట్రాక్టర్లకు, బండ్లకు నిప్పంటించి భయానక వాతావరణం కల్పించారని పేర్కొన్నారు. కాగా, మాస్టర్ మైండ్, హిడ్మా తమ్ముడు దేవా కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్టు తెలిసింది.

తల్లిదండ్రులను ప్రేమించండి...

నేను గీతికకు ప్రేమతో...

ఏరా బంగారు తల్లి, ఏం చేస్తున్నావు? ఏమిటో ఇవ్వాళ నా మనసంతా బాధతో, ఆవేదనతో నిండిపోయి ఉంది. అందుకే నీకు ఉత్తరం రాస్తున్నా. దీంతో నాకు కొంచెం ఉపశమనం. ఈరోజు పేపర్‌లో ఒక వార్త చదివాను. ఎంతో బాధనిపించింది. తరచూ ఇటువంటి వార్తలు చదువుతున్నప్పటి ఈ వార్త మాత్రం మనసుని కలచి వేసింది.

అసలు విషయం ఏమిటంటే 65, 60 ఏండ్ల వయసు గల దంపతులు కొడుకు తమను చూడటం లేదని ఆత్మ హత్య చేసుకున్నారు. ఇది నేను చదివిన వార్త. ఇటువంటివి ఎన్నో చదువుతున్నాం, కొన్ని సంఘటనలు చూస్తున్నాం. పిల్లలు రెక్కలు రాగానే ఎగిరి పోవడం, కన్న తల్లిదండ్రులను పట్టించుకొక పోవడం లేదా తమ అవసరాలకు వాడుకోవడం వంటివి చేస్తున్నారు. వృద్ధాప్యం వచ్చిన తల్లి తండ్రుల పట్ల ఇలా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసం?

ఈ రోజు బిడ్డలు అభివృద్ధిలోకి వచ్చారంటే అందుకు తల్లిదండ్రులు ఎన్ని త్యాగాలు చేసుంటారో. వాళ్లే మరో విధంగా ఆలోచించి ఉంటే ఈ పిల్లలు ఎక్కడ ఉండే వారు, ఎలా ఉండే వారు? చదువు కున్నాం, ఉద్యోగాలు చేస్తున్నాం, సంపాదించుకుంటున్నాం అని చెప్పుకునే పిల్లలు, తల్లిదండ్రులను చూసుకుంటున్నాం, చూసుకోవాలి అది మా బాధ్యత అని ఎందుకు అనుకోవడం లేదు. పెండ్లికాగానే తల్లి తండ్రులను మర్చి పోవడం, వాళ్ళతో మాట్లాడటానికి

అమ్మ లేఖ



సమయం లేదనడం చూస్తున్నాం. సినిమాలు, హోటళ్లు, బైట తిరగడానికి సమయం ఉన్నప్పుడు కనిపెంచిన తల్లిదండ్రుల కోసం సమయం ఎందుకు ఉండదు. ఇది చాలా తప్పు నాన్న.

చరిత్ర పునరావృతం అవుతుంది అంటారు. రేపు మీరుకూడా వృద్ధులు అవుతారు. మీ పట్ల కూడా మీ పిల్లల వ్యవహార శైలి ఇలాగే ఉంటే? తప్పకుండా ఉంటుంది, ఎందుకంటే మిమ్మల్ని చూసే కదా వాళ్ళు నేర్చుకునేది. అంతే కదా నాన్న.. అమ్మా నాన్నలను చూసే కదా పిల్లలు నేర్చుకుంటారు. ఇటీవల తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదిలేయడం ఓ ఆనవాయితీగా మారింది. వాళ్ళు ఆ వయసులో కోరుకునేది ప్రేమతో ఓ పలకరింపు. పిల్లలు తమ దగ్గర కూర్చుని కాసేపు కబుర్లు చెప్పాలని కోరుకుంటారు. తమను పట్టించుకుంటే చాలు అనుకుంటారు.

కన్నా.. ఒక్కొక్క సారి తల్లిదండ్రుల మీద పిల్లలకు, పిల్లల మీద తల్లిదండ్రులకు కోపం రావడం సహజం. అయినా కూడా అవి మనసులో పెట్టుకోకుండా కలిసి పోవాలి. నేటి పిల్లలకు చెప్పేది ఒక్కటే.. వాళ్ళు మిమ్మల్ని ఎలా చూసుకున్నా, మీరు ఈ రోజు ఒక స్థాయిలో ఉన్నారంటే వాళ్లే కారణం. ఎవరి రుణం అయినా తీర్చు కోవచ్చు, జన్మ నిచ్చిన వారి రుణం తీర్చుకోలేనిది. బిడ్డలు ఎలాంటి వారైనా వారు బాగుండాలని మనసారా ఆశీర్వదించేది, కోరుకునేది తల్లిదండ్రులు మాత్రమే..

ఇక నైనా మారండి జీవితపు చరమాంకంలో ఉన్న తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోండి. వారికి సంతోషం కలిగించండి. నాన్న.. రేపు నీకూ కుటుంబం ఏర్పడ్డాక తల్లిదండ్రులను, అత్త మామలను చూసుకోవాలి. వారికి ప్రేమను పంచాలి. పెద్ద వాళ్ళు ఏదైనా అన్నా పట్టించుకోకూడదు. కొందరికి అభద్రతా భావం ఏర్పడుతుంది. అటువంటప్పుడు వారికి ధైర్యం చెప్పాలి. నువ్వు ఎంత ప్రేమను పంచితే వారికి అంత నిశ్చింత. వారు నీపై అంతే ప్రేమను కురిపిస్తారు.

'మా పిల్లలు బంగారం, వాళ్ళు మాకు కొండంత అండ, మమ్మల్ని చాలా బాగా చూసుకుంటారు' అని వాళ్ళు చెప్పుకునే లాగా ఉండాలి.



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి

నేర్చుకునేందుకు సిద్ధంగా ఉండండి...

అమిత మాధ్వానీ... భారతీయ వ్యాపార ప్రకటనల్లో తన కంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆపై నిర్మాణంలో నాయకురాలిగా ఎదిగారు. సాంస్కృతికంగా సంపన్నమైన మరాఠీ కుటుంబంలో పుట్టిన ఆమె తల్లిదండ్రుల నుండి ఉన్నతమైన విలువలు నేర్చుకున్నారు. తన అనుభవాలతో చలనచిత్ర, నిర్మాణ పరిశ్రమలలో కీలకమైన శక్తిగా ఎదిగారు. అంతేకాదు యువతులు సినీ పరిశ్రమలో ప్రత్యేకమైన కృషితో తమదైన ముద్ర వేయాలని కోరుకుంటున్నారు.



ముంబై
మాహిమ్‌లోని చావల్‌లో పుట్టిన అమిత మాధ్వానీ మరాఠీ సంస్కృతి, సాంప్రదాయ పండుగలు, లోతైన సమాజ భావనల మధ్య పెరిగింది. (చావల్ అనేది ముంబైలో సాధారణంగా కనిపించే ఒక రకమైన నివాస భవనం. ఇది బహుళ కుటుంబాలను కలిగి ఉంటుంది. ఆర్థిక రూపకల్పన, సామూహిక జీవనం ద్వారా వర్గీకరించబడుతుంది) ఆమె తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు, సర్జన్, సంస్కృత పండితుడు. తండ్రి నుండి సేవ, సమ్మిళిత విలువలను నేర్చుకున్నారు. ఆమె తల్లి తన కుటుంబాన్నే కాకుండా ఇతర పిల్లలను కూడా చూసుకునేది. ఇది మాధ్వానీ జీవితంలో ఎంతో ప్రభావాన్ని చూపింది. తన సమాజంలోని సాంస్కృతిక వేడుకలు, మరాఠీ థియేటర్‌పై ఆమెకున్న అవగాహనకు పునాదిగా నిలిచాయని చెప్పవచ్చు. ఈ వాతావరణం ఆమెలో కళల పట్ల ప్రేమను, సమాజ శక్తిపై నమ్మకాన్ని పెంపొందించింది.

సినీ రంగంలో ప్రవేశం

మాధ్వాని 1980లలో తన కెరీర్‌ను ప్రారంభించారు. అప్పట్లో ఈ రంగం పురుషుల ఆధిపత్యంలో ఉంది. అటువంటి సమయంలో ఎంతో ఉత్సుకత, నేర్చుకోవాలనే తపనతో పరిశ్రమలోకి ప్రవేశించారు. నిర్మాణంలో ఆమెకున్న తొలి అనుభవాలు కష్టపడే తత్వాన్ని నేర్పించాయి. 'అప్పట్లో సినిమాల విభాగంలో నేనే ఏకైక మహిళను. ఇది సవాలుతో కూడుకున్నది. నన్ను నేను నిరూపించుకోవాలి. సెట్‌లో బ్యాగులు ప్యాక్ చేయడం నుండి 35-ఎంఎం ఫిల్మ్‌లో ఎడిటింగ్ చిక్కులను అర్థం చేసుకోవడం వరకు ప్రతిదీ నేర్చుకున్నాను' అని ఆమె ఓ వెబ్‌సైట్‌తో పంచుకున్నారు. ఓగిల్వీ, లియో బర్నెట్ వంటి ప్రకటనలు ఆమె దృక్పథాన్ని విస్తృతం చేశాయి. ఏజెన్సీల నుండి పరిశ్రమను చూడగలిగారు. తన అనుభవాలతో వెంచర్లకు పునాది వేసాయి. తర్వాత కాలంలో ఈక్వినాక్స్ ఫిల్మ్స్‌లో సహ-భాగస్వామి, నిర్మాతగా ఎదిగారు. ఈ కంపెనీలను నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. మహమ్మారి సమయంలో అతి తక్కువ సమయంలోనే డిజిటల్ ఫార్మాట్‌లకు మారారు.

యాడ్స్ పరిణామం

భారతదేశ ప్రకటనల్లో నాటకీయ మార్పులను మాధ్వానీ ప్రత్యక్షంగా చూశారు. పెద్ద బడ్జెట్‌లతో కూడిన సాంప్రదాయ టెలివిజన్ వాణిజ్య ప్రకటనల నుండి ప్రస్తుత రీల్స్, డిజిటల్ ప్రకటనల యుగం వరకు పరిశ్రమ తీవ్రమైన మార్పుకు గురయ్యింది. 'కథ చెప్పడం మనం చేసే ప్రతి పనిలోనూ ప్రధానమైనది. ఇది 10 సెకన్ల డిజిటల్ స్పాట్ అయినా, మూడు గంటల ఫీచర్ ఫిల్మ్ అయినా సారాంశం ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడంలో ఉంది' అంటారు ఆమె. సోషల్ మీడియా, స్నేహపూర్వక ఫార్మాట్‌లను ఏకీకృతం చేయడం ద్వారా, క్లయింట్‌లకు ఎండ్-టు-ఎండ్ పరిష్కారాలను అందించడం ద్వారా ఈక్వినాక్స్ ఫిల్మ్స్ ముందంజలో ఉంది. మాధ్వాని తన విజయానికి జట్టు అంకితభావం, ప్రతి సభ్యుని సహకారాన్ని విలువైనదిగా భావించే విధానమే కారణమని అంటున్నారు.



యువతకు సందేశం

పరిశ్రమలో ఒక మహిళగా తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ సమ్మిళితత్వం వైపు తన పురోగతిని అంగీకరిస్తున్నారు. అయితే నిరంతర పురోగతి అవసరాన్ని కూడా ఆమె నొక్కి చెబుతున్నారు. 'నేను ఎప్పుడూ పోటీని ఎదుర్కోలేదు. నన్ను ఎవ్వరూ జడ్జ్ కూడా చేయలేదు. ఎందుకంటే నేను ఎల్లప్పుడూ నా పనిని వినయంతో, నేర్చుకోవాలనే సంకల్పంతో ఉంటాను. ఈ రంగంలోకి ప్రవేశించే యువతులకు నేను చెప్పేది ఏమిటంటే... కష్టపడి పనిచేయడానికి, ఉత్సుకతతో ఉండటానికి సిద్ధంగా ఉండండి. ముందస్తుగా భావించిన ఆలోచనలు మిమ్మల్ని వెనక్కి నెట్టకుండా చూసుకోండి' అంటారు. అలాగే ఆశావాహులైన నిపుణులను ప్రతి అభ్యాస అవకాశాన్ని, ఎంత చిన్నదైనా స్వీకరించమని, విభిన్న అనుభవాలకు సిద్ధంగా ఉండాలని ప్రోత్సహిస్తారు.

కాలానికి అనుగుణంగా

'మీ పని మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళుతుందో మీకు తెలియదు. మారుతున్న కాలానికి అనుగుణంగా నా సామర్థ్యం, స్థితిస్థాపకతకు నేను రుణపడి ఉన్నాను. నేను పరిశ్రమలోకి ప్రవేశించాను. దశాబ్దాలుగా కొనసాగగలుగుతున్నాను. ఇప్పటికీ మారుతున్న కాలాలకు అతీతంగా నన్ను నడిపించే ఒక కోర్ ఉంది. నేను దాన్నే నమ్ముతాను. అది నన్ను ముందుకు నడిపిస్తుంది' అంటారు ఆమె. మాధ్వాని నాయకత్వంలో ఈక్వినాక్స్ వర్చువల్ ప్రారంభమయింది. అలాగే కొత్త కథ చెప్పే రంగాలలోకి ఆమె బృందం అడుగుపెడుతోంది. సాంప్రదాయ నైపుణ్యాన్ని అత్యాధునిక డిజిటల్ ఆవిష్కరణలతో మిళితం చేస్తున్నారు. ఆమె చేస్తున్న పనిలో ఆమెకు ఆనందం ఉంది. 'మీ పని పట్ల మీరు నిజాయితీగా ఉండండి. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండండి. భయం మీ ఎంపికలను నిర్దేశించ నివ్వకండి. కథ చెప్పే ప్రపంచం విశాలమైనది, అవకాశాలతో నిండి ఉంది. నమ్మకంగా, వినయంతో దానిలోకి అడుగుపెట్టండి' అంటూ ఆమె తన మాటలు ముగించారు.

కొత్త ప్రాజెక్టులపై ఆసక్తి

(మొదటిపేజి తరువాయి)

ఉపయోగపడుతుందని టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్ అధ్యక్షులు బ్రూనో లోపెజ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎస్‌టీటీ డాటా సెంటర్ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ప్రపంచానికి హైదరాబాద్ డేటా హబ్‌గా మారుతోందని శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగంలో వస్తున్న కొత్త మార్పుల్లో నగరం ముఖ్య పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి : సింగపూర్ సెమీ కండక్టర్ అసోసియేషన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

రాష్ట్రంలో విరివిగా పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ సెమీకండక్టర్ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ) ప్రతినిధులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ దేశ పర్యటనలో ఉన్న ఆయన శనివారం వారితో సమావేశమై పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. తెలంగాణాలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో తెలంగాణ అందుకు కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఎస్ఎస్ఐఏ ప్రతినిధులను రాష్ట్రానికి ఆహ్వానించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారు, ఈ ఏడాది చివర్లో హైదరాబాద్ వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐఏ చైర్మెన్ బ్రియాన్ టాన్, వైస్ చైర్మెన్ టాన్ యూ కాంగ్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగుఖ్యాతిని చాటుదాం

సింగపూర్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ప్రవాసుల సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు ఖ్యాతిని చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కె. జయవీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు షాక్

ముంబయి : వారాంతం సెషన్‌లో ఇన్ఫోసిస్ షేర్ విలువ భారీగా పడిపోవడంతో ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి కుటుంబం సంపద వేల కోట్లు ఆవిరయ్యింది. శుక్రవారం సెషన్‌లో అమ్మకాల ఒత్తిడితో ఇన్ఫీ షేర్ 6 శాతం పతనమై రూ.1,812.70కు పడిపోయింది. దీంతో బీఎస్ఇలో ఒక్క పూటలోనే మూర్తి కుటుంబ సంపద దాదాపు రూ.1,900 కోట్లు హరించుకుపోయింది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.54 లక్షల కోట్లకు పడిపోయింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి నారాయణ మూర్తి కుటుంబానికి సమిష్టిగా 4.02 శాతం వాటా ఉంది. ఇందులో మూర్తికి 0.40 శాతం, ఆయన సతీమణి సుధా మూర్తికి 0.92 శాతం, వారి కుమారుడు రోహన్ మూర్తికి 1.62 శాతం, కుమార్తె, రిషి సునక్ భార్య అక్షతా మూర్తికి 1.04 శాతం, మనవడు ఏకగ్రహ రోహన్ మూర్తికి 0.04 శాతం చొప్పున వాటాలున్నాయి. మొత్తంగా వీరి హోల్డింగ్ వాటా విలువ రూ.30,334 కోట్లుగా ఉంది.

సంజయ్ రాయ్ దోషి

కోల్‌కతా : దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో సంజయ్ రాయ్‌ను దోషిగా సీల్దాలోని అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు శనివారం నిర్ధారించింది. 20వ తేదీన శిక్షను విధించనున్నట్లు న్యాయమూర్తి అనిర్బన్ దాస్ తెలిపారు. ఆ సమయంలో నిందితుడు, బాధితురాలి తల్లిదండ్రులు కోర్టు రూమ్‌లోనే వున్నారు. సిబిఐ అందజేసిన సాక్ష్యాధారాల ఆధారంగా సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చినట్లు కోర్టు తెలిపింది. గతేడాది ఆగస్టు 9న ఆస్పత్రిలోకి ప్రవేశించిన నిందితుడు బాధితురాలిని హత్య చేసి ఆపై లైంగిక దాడికి పాల్పడ్డాడని న్యాయమూర్తి తెలిపారు. ఈ దారుణానికి మరణశిక్ష లేదా యావజ్జీవ శిక్ష విధించే అవకాశముందని చెప్పారు. భారత న్యాయ సంహితలోని సెక్షన్లు 64, 66, 103(1) కింద నిందితుడిని దోషిగా నిర్ధారించినట్లు న్యాయమూర్తి దాస్ చెప్పారు. కోర్టు గదిలో తీర్పు చదువుతుండగా, కాగా తాను ఈ నేరం చేయలేదంటూ సంజయ్ రాయ్ కోర్టులో చెప్పాడు. "నేను ఇది చేయలేదు. ఇలా చేసిన వారు వున్నారు, వారినెందుకు పట్టుకోలేదు?" అని ప్రశ్నించాడు. శిక్ష విధించే ముందు సోమవారం మాట్లాడేందుకు అవకాశమిస్తామని సంజయ్ రాయ్‌కు న్యాయమూర్తి చెప్పారు. తీర్పు చెప్పిన వెంటనే బాధితురాలి తల్లిదండ్రులు కోర్టు గదిలోనే కన్నీటి పర్యంతమయ్యారు. 'మేం మీపై వుంచిన విశ్వాసానికి తగ్గట్టుగా మీరు వ్యవహరించారు.' అని బాధితురాలి తండ్రి వ్యాఖ్యానించారు. తీర్పు వెలువడేందుకు ముందు కోర్టు వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. అక్కడ ప్రజలు గుమిగూడేందుకు పోలీసులు అనుమతినివ్వనప్పటికీ సీల్దా కోర్టు కాంప్లెక్స్ వెలుపల పెద్ద సంఖ్యలో జనాలు మూగారు. కోర్టు తీర్పు కోసం వారు ఆతృతగా ఎదురుచూడడం కనిపించింది. ఈ నేరానికి సంజయ్ రాయ్ ఒక్కడే బాధ్యుడని తాము విశ్వసించడం లేదని అక్కడ గుమిగూడిన జనాల్లోని జూనియర్ డాక్టర్లు వ్యాఖ్యానించారు.

తొలుత ఈ నేరాన్ని కప్పిపుచ్చడానికి పశ్చిమ బెంగాల్ పోలీసులు ప్రయత్నిస్తున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. దాంతో పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసులు సిబిఐకి బదిలీ చేశారు. పోలీసు వలంటీర్, ప్రధాన నిందితుడైన సంజయ్ రాయ్ పేరును మాత్రమే చార్జిషీట్‌లో పేర్కొంటూ అక్టోబరు 7న సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది. సామూహిక అత్యాచారం అన్న అంశాన్నే ఆ ఛార్జిషీట్‌లో ప్రస్తావించలేదు. ఆగస్టు 9వ తేదీన ఆస్పత్రిలోని సెమినార్ రూమ్ నుండి బాధితురాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిసిటివి ఫుటేజ్ ప్రాతిపదికన 10వ తేదీన కోల్‌కతా పోలీసులు సంజయ్ రాయ్‌ను అరెస్టు చేశారు. తర్వాత కేసు సిబిఐకి బదిలీ అయింది. సాక్ష్యాధారాలు కింద 11 వస్తువులను సిబిఐ తన చార్జిషీట్‌లో పేర్కొంది. వీటిని చూస్తుంటే ఈ నేరంలో సంజయ్ రాయ్ పాత్ర వుందని నిర్ధారించబడుతోందని పేర్కొంది. సిసిటివి ఫుటేజ్ చూసినట్లైతే సంజయ్ రాయ్ సంఘటనా స్థలంలోకి రావడం వెళ్ళడం కనిపిస్తోంది.

ఆస్పత్రిలో రాత్రిపూట విధుల్లో వున్న జూనియన్ వైద్యురాలిపై ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టడం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కోల్‌కతా సహా రాష్ట్రవ్యాప్తంగానూ, దేశవ్యాప్తంగానూ విస్తృతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సంఘటన జరిగిన తర్వాత కూడా పశ్చిమ బెంగాల్‌లో నెలల తరబడి నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి.

ఈ కేసులో ఆర్‌జి కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్‌చార్జి అభిజిత్ మండల్‌లను కూడా తొలుత అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, ఎఫ్ఐఆర్ నమోదు చేసుకోవడంలో జాప్యం చేశారని అభియోగాలు కూడా వారిపై నమోదు చేశారు. అరెస్టయిన 90 రోజుల్లో వారిపై అనుబంధ చార్జిషీట్‌ను నమోదు చేయకపోవడంతో ప్రత్యేక న్యాయస్థానంలో వారికి బెయిల్ లభించింది.

మిగిలినవారి సంగతేంటి? : బాధితురాలి తల్లి

దర్యాప్తు సగమే పూర్తయిందని బాధితురాలి తల్లి వ్యాఖ్యానించారు. ఈ నేరంలో పాలుపంచుకున్న వారిలో ఇంకా చాలామంది స్వేచ్ఛగా తిరుగుతున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు.

బ్యాంక్ అధికారుల వేధింపులకు రైతు బలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బ్యాంకు అధికారుల వేధింపుల కారణంగా ఓ రైతు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో కలకలం రేపింది. వాయిదా చెల్లింపులో జరిగిన జాప్యానికి బ్యాంకు అధికారులు వేధింపులకు గురి చేశారన్న ఆవేదనతో బ్యాంకులోనే ఎదుటే పురుగుల మందు తాగి కుప్పకూలాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేల మండలం రేణిగూడ గ్రామానికి చెందిన జాదవ్ దేవ్‌రావ్(60) పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు నుంచి తన భూమిని మార్టిగేజ్ చేయించారు. నాలుగేండ్ల కింద మూడున్నర లక్షల రుణం తీసుకున్నాడు.

అప్పటి నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూ వస్తున్నాడు. ఇటీవల వాయిదా రూ.25వేలు అనివార్య కారణాలతో సకాలంలో చెల్లించలేకపోయాడు. దాంతో బ్యాంకు అధికారులు గ్రామానికి వెళ్లి వేధించినట్టు కుటుంబీకులు ఆరోపించారు. శనివారం బ్యాంకుకు వచ్చిన దేవ్‌రావ్ తొలుత మేనేజర్‌ను కలిసి బయటకు వెళ్లిపోయాడు. తర్వాత కొద్ది సేపటికి పురుగుల మందు డబ్బాతో బ్యాంకుకు చేరుకుని అది తాగి అక్కడే కూర్చున్నాడు. గమనించిన సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించడంలో తాత్సారం చేయడంతో అక్కడే కుప్పకూలాడు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. కుటుంబీకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసులు మధ్యాహ్నం నుంచి బ్యాంక్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాలుగేండ్ల నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూనే ఉన్నాడని రైతు దేవ్‌రావ్ అన్న కుమారుడు జాదవ్ కృష్ణ, సోదరుడు జాదవ్ హేమాలాల్ తెలిపారు. ఈసారి పంట దిగుబడి రాకపోవడంతో ఒక వాయిదా చెల్లింపులో జాప్యం జరిగిందని, ఈ మాత్రానికే బ్యాంకు అధికారులు వేధింపులతో ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యకు కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : ఎమ్మెల్యే

విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే పాయల శంకర్ బ్యాంకుకు చేరుకున్నారు. అధికారులు, కుటుంబీకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఒక్క వాయిదా చెల్లింపులో కొంత ఆలస్యమైతేనే రైతు పట్ల బ్యాంకర్లు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం సమంజసం కాదని ఎమ్మెల్యే అన్నారు. వేల కోట్ల అప్పులను ఎగ్గొట్టే బడాబాబులను ఓ రకంగా, సామాన్య రైతును మరో రకంగా చూసే ధోరణి సరికాదన్నారు. ఊరికి వెళ్లి అందరి ముందు బ్యాంకు సిబ్బంది అవమానానికి గురిచేయడంతో ఆత్మగౌరవం దెబ్బతిని, రైతు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇందుకు బాధ్యులైన బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

రైతు దేవరావుది ప్రభుత్వ హత్యే

ఆ కుటుంబానికి రూ.20 లక్షలు చెల్లించాలి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్
ఆత్మహత్యలకు పాల్పడవద్దంటూ రైతులకు విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రైతు జాదవ్ దేవరావ్ ఆత్మహత్య ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ చేసిన హత్యేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరిట చేసిన మోసమే రైతుల మరణానికి కారణమని పేర్కొన్నారు. "అప్పులు తీరక అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా సర్కారులో ఏమాత్రం చలనం లేదు. అధికారంలోకి రాగానే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పడం, రైతు భరోసా ఎగ్గొట్టడంతోనే దేవరావ్ అనే రైతు అన్యాయంగా బలయ్యారు. రైతు కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకప్పుడు సాగులో, పంట దిగుబడిలో నెంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉండటం కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. అన్నదాతలు ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దంటూ కేటీఆర్ వారికి విజ్ఞప్తి చేశారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

త్వరలో హౌసింగ్ పాలసీ తీసుకొస్తాం

మధ్యతరగతి ప్రజలకూ ఇండ్లు నిర్మిస్తాం : మంత్రి పొంగులేటి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా తెలంగాణ సమగ్ర హౌసింగ్ పాలసీని తీసుకొస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మధ్యతరగతి వారి కోసం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నామని తెలిపారు. కనీసం వంద ఎకరాల్లో ఈ టౌన్‌షిప్‌లను నిర్మించి వారికి అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి ఎస్.హెచ్.రాజేష్ ధర్మాని సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణ పథకాల వివరాలను ఈ సందర్భంగా ధర్మాని అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు. హౌసింగ్ నియమ నిబంధనల మేరకు అందుబాటులో ఉన్న బోర్డు స్థలాల్లో కొత్తగా గృహనిర్మాణానికి సంబంధించిన స్కీములను అమలు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ప్రయివేటు, ప్రభుత్వరంగ భాగస్వామ్యంతో గృహ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూముల పరిరక్షణకు ఒకవైపు చర్యలు తీసుకుంటూనే మరోవైపు వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 అనుసరించి ఆస్తుల మరియు అప్పులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. రాష్ట్రంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమన్నారు. ఆ పథకం ద్వారా నిరుపేదలకు శాశ్వత గృహాలు నిర్మించాలన్న సంకల్పంతో వచ్చే నాలుగేండ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇప్పటికే మొదటి దశలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందనీ, వీలైనంత త్వరలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నట్టు చెప్పారు. లబ్దిదారులే స్వయంగా ఇండ్లు నిర్మించుకునే సౌలభ్యం కల్పించామన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యం కలిగి ఉంటాయని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. హైదరబాద్ విశ్వ నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని గుర్తుచేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలు ఉండగా ఫోర్త్ సిటిగా 15 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు.

కేజ్రీవాల్ కారుపై దాడి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధానిలో శాంతి భద్రతలు అదుపుతప్పుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక..బీజేపీ బరితెగిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఢిల్లీలో ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ఉన్న వాహనంపై రాళ్లు విసిరారు. ఇది బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మకు చెందిన గూండాల పని అని ఆప్ ఆరోపించింది. అయితే దీనిని పర్వేష్ వర్మ ఖండించారు. కేజ్రీవాల్ కారు ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆరోపించారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేజ్రీవాల్ శనివారం ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అలాగే కేజ్రీవాల్ ఉన్న కారుపై అమాంతంగా రాళ్లు రువ్వారు. అప్రమత్తమైన పోలీసులు కేజ్రీవాల్ కారును అక్కడి నుంచి పంపివేశారు. అయితే కేజ్రీవాల్ కారుపై దాడికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో ఆప్ పోస్ట్ చేసింది. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఈ చర్యకు పాల్పడినట్టు ఆరోపించింది. 'ఓటమి భయంతో బీజేపీ ఆందోళన చెందుతోంది. కేజ్రీవాల్‌పై దాడికి తమ గూండాలను ఉపయోగించింది. కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నప్పుడు బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. ఆయనను గాయపరిచేందుకు ప్రయత్నించారు. కేజ్రీవాల్ ప్రచారం చేయకుండా చేయాలనుకున్నారు. బీజేపీ పిరికి చర్యలకు కేజ్రీవాల్ భయపడరు. ఢిల్లీ ప్రజలు మీకు తగిన సమాధానం ఇస్తారు' అని ఎక్స్‌లో పేర్కొంది. మరోవైపు ఆప్ ఆరోపణలను బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ ఖండించారు.



శనివారం విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి. ఈ సందర్భంగా ఫిలింనగర్‌లో కృష్ణ అవతారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు, తెలుగు చిత్ర పరిశ్రమ పెద్దలు, అభిమానులు భారీ స్థాయిలో హాజరై ఘన నివాళి అర్పించారు. పరుచూరి గోపాలకృష్ణ, మాదాల రవి, ఎన్టీఆర్ మనవరాలు నందమూరి రూప, ఎన్టీఆర్ తనయుడు నందమూరి మోహన్ కృష్ణ, మాగంటి గోపీనాథ్, తెలుగు చిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్న తదితరులు స్ఫూర్తిదాయక ఎన్టీఆర్ ప్రయాణాన్ని కొనియాడారు.



'మ్యాడ్ స్క్వేర్' రిలీజ్‌కి రెడీ

బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాన్ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని మార్చి 29న విడుదల చేయనున్నట్లు తాజాగా నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో 'మీరు హ్యాండిల్ చేయగలిగిన దానికంటే ఎక్కువ వినోదం, మీరు ఊహించిన దానికంటే ఎక్కువ మ్యాడ్ నెస్' అని నిర్మాతలు పేర్కొన్నారు.

ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. కళ్యాణ్ శంకర్ దర్శకుడు.

సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: శామ్‌దత్, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, అదనపు స్క్రీన్ ప్లే: ప్రణయ్ రావు తక్కళ్లపల్లి, కళ: పెనుమర్తి ప్రసాద్.

భిన్న కాన్సెప్ట్‌తో
'శివ శంభో'



అనంత ఆర్ట్స్ పతాకంపై నర్సింగ్ రావు దర్శకత్వంలో రాజగోపాల్, దోరవేటి సుగుణ నిర్మిస్తున్న చిత్రం 'శివ శంభో'.

తనికెళ్ల భరణి, సుమన్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమా పోస్టర్‌ను చిత్ర బృందం సమక్షంలో గాయకుడు, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న విడుదల చేశారు. ఈ చిత్రంతో పరిచయం అవుతున్న హీరో కృష్ణ ఇస్లావత్, హీరోయిన్ కేశవర్ధిని, బేబీ రిషిత తదితరులు ఇందులో ఇతర కీలక పాత్రలను పోషించారు.

గోరటి వెంకన్న మాట్లాడుతూ, 'పోస్టర్ చూస్తుంటే తెలుగు సాహిత్యం, సంస్కృతితో పాటు అన్ని హంగులతో ఈ సినిమా ఉన్నట్లు తెలుస్తోంది. మంచి కాన్సెప్ట్‌తో నిర్మించిన ఈ చిత్రం ఘనవిజయం సాధిస్తుంది' అని చెప్పారు.

'మహా శివరాత్రికి సినిమాను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది' అని దర్శకుడు నర్సింగ్‌రావు తెలిపారు. మాటలు, పాటల రచయిత దోరవేటి మాట్లాడుతూ,'ఈనాటి సమాజానికి డబ్బు, సుఖాలు, సౌకర్యాలకు కొరత లేదు. కానీ మనశ్శాంతి లేక కొట్టుకుంటున్నారు. పరమ శివుని నమ్ముకుంటేనే శాంతి దొరుకుతుందనే సందేశంతో రూపొందిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

నవచిత్రం

ఉగాదికి గద్దర్ సినిమా అవార్డుల ప్రదానం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



'ఈ ఏడాది ఉగాది నుంచి గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన విధంగా కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.

శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందజేస్తాం. జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో అవార్డులు ప్రదానం చేస్తున్నాం. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీన్ని జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహిస్తాం. అలాగే కల్చరల్ ఐకాన్ గద్దర్‌కి సంబంధించి ప్రతిదీ పెంచేలా అవార్డుల లోగోలు రూపొందించాలని అధికారులకు పలు సూచనలు ఇచ్చాం. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్య స్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. గత పది సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన వారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారు. అవార్డుల పంపిణీ జరగలేదు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులను ఈ ఉగాది నుంచి ప్రతి సంవత్సరం అందజేస్తాం' అని తెలిపారు.

గద్దర్ అవార్డుల కోసం లోగోతో సహా విధి విధానాలు, నియమ, నిబంధనలపై కమిటీ సమావేశం జరిగింది. అలాగే ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందచేస్తారు.

ఈ సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ డాక్టర్ హరీశ్, ఈడీ కిషోర్‌బాబు, కమిటీ చైర్మన్ బీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



బాలకృష్ణ

'నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా 'డాకు మహారాజ్'. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. మా సినిమాని ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని బాలకృష్ణ చెప్పారు.

'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 12న విడుదలైంది. మొదటి షో నుంచే ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను సొంతం చేసుకున్న ఈ సినిమా భారీ వసూళ్లతో బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టిస్తోంది. కేవలం ఐదు రోజుల్లోనే రూ.114 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి, బాలకృష్ణ కెరీర్‌లోనే అతి పెద్ద విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో మేకర్స్ విజయోత్సవ సభను నిర్వహించారు.

బాలకృష్ణ మాట్లాడుతూ, 'నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్. కొత్తదనాన్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమా విజయంతో ఇది మరోసారి రుజువైంది. తిరుమల ఘటన నేపథ్యంలో అనంతపురంలో తలపెట్టిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించలేకపోయాం. అందుకే ఈనెల 22న అనంతపురంలోనే విజయోత్సవ పండుగను జరుపుకోవాలని నిర్ణయించాం' అని తెలిపారు.

దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ, 'బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో గుర్తుండిపోయే సినిమాలలో ఒకటిగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని మొదలుపెట్టాం. డిస్ట్రిబ్యూటర్లు అందరికీ మూడు రోజుల్లోనే డబ్బులు వచ్చేసి హ్యాపీగా ఉన్నారు. బ్లాక్ బస్టర్లు చాలా వస్తాయి. కానీ రెస్పెక్ట్ అరుదుగా వస్తుంది. ఈ సినిమా చూసి ఎందరో నాకు మాస్టర్ పీస్ అని మెసేజ్‌లు పెడుతున్నారు' అని చెప్పారు.

'నన్ను, దర్శకుడు బాబీని నమ్మి మాకు ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన బాలకృష్ణకి కృతజ్ఞతలు. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేం ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. 3వ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్. డిస్ట్రిబ్యూటర్లకు డబ్బులు వచ్చినప్పుడే నిర్మాతలకు నిజమైన ఆనందం. మా దృష్టిలో అదే పెద్ద హిట్' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు.

సినిమాని కాపాడే బాధ్యత మనదే

సక్సెస్ చాలా గొప్పది. అది డబ్బు పెడితే దొరకదు. సక్సెస్ ఎంతో ఎనర్జీని, భవిష్యత్‌కి భరోసాని ఇస్తుంది. ఈ రోజుల్లో నిర్మాత ఒక విజయం సాధించడం అంత తేలికైన విషయం కాదు. నిర్మాతను అందరూ ఒక దేవుడిలా చూడాలి. ఇప్పుడు తెలుగు సినిమా స్థాయి పెరిగి పోయింది. ప్రపంచ వ్యాప్తంగా మన సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. అందుకే నెగటివిటీని పక్కన పెట్టి, మనమందరం కలిసి మన సినిమాలకు మనమే సపోర్ట్ చేసుకోవాలి. సినిమాని కాపాడే బాధ్యత మనందరికి ఉంది. ఈ సినిమా విషయంలో అనంత శ్రీరామ్, కాసర్ల శ్యామ్ గొప్ప సాహిత్యం అందించారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా పని చేసిన నా మ్యూజికల్ టీంకి థ్యాంక్స్. నేపథ్య సంగీతం విషయంలో బాబీ చేసిన సపోర్ట్‌ను మరచిపోలేను. నిర్మాత వంశీ చాలా నిజాయితీగా ఉంటారు. బాలకృష్ణ, నా కాంబినేషన్‌లో వరుసగా 4 ఘన విజయాలు సాధించాం.

- సంగీత దర్శకుడు తమన్

ఓ తల్లి కథ..



రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'తల్లి మనసు'. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ తొలిసారి నిర్మాతగా మారి, నిర్మించిన చిత్రమిది.

ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 24న థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు నిర్మాత ముత్యాల అనంత కిషోర్ తెలియజేశారు.

సమర్పకులు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ, 'దర్శకుడిగా 50 చిత్రాలు తీశాను. అయితే సొంత చిత్ర నిర్మాణం మునుపు ఎన్నడూ చేయలేదు. మా పెద్ద అబ్బాయి అనంత కిషోర్ నిర్మాతగా ఓ మంచి చిత్రం తీయాలన్న అభిరుచి మేరకు ఈ సినిమాను సొంతగా నిర్మించాం. తల్లికి ఎన్ని నిర్వచనాలు ఇచ్చినా సరిపోవు. అలాంటి తల్లి సబ్జెక్ట్‌ని తీసుకుని, పాత్రలకు తగ్గ నటీనటులనే ఎంచుకుని ఈ సినిమాను తీశాం. కథలో, పాత్రలలో ప్రేక్షకులు పూర్తిగా నిమగ్నమయ్యే విధంగా సినిమా వచ్చింది. ఇలాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే మరిన్ని మంచి చిత్రాలు వస్తాయి' అని అన్నారు.

'ఓ తల్లి ఎలాంటి సంఘర్షణలకు గురయ్యిందన్న అంశాన్ని ప్రేక్షకులకు హత్తుకునేలా వైవిధ్యంగా చెప్పాం. భావోద్వేగం, సెంటిమెంట్, ఎంటర్‌టైన్మెంట్ వంటి అంశాల మేళవింపుతో చిత్రం ఉంటుంది. నిర్మాత అభిరుచి లేకపోతే ఇంత మంచి చిత్రం రాదు' అని దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) చెప్పారు.

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్

- వ్యవసాయ పంపుసెట్లు సహా ఇండ్లకూ సోలార్ విద్యుత్తే...
- ఏడాది ప్రజాపాలనలో చాలా చేశాం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- 121 మంది విద్యుత్ ఉద్యోగులకు నియామకపత్రాలు అందజేత
- విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్ డీఏ చెల్లిస్తూ ఉత్తర్వులు

రాష్ట్రంలో 2035 నాటికి 40వేల మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం



పైలట్ ప్రాజెక్టులుగా 25 గ్రామాలు ఎంపిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్‌రంగంలో భవిష్యత్ అంతా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీదేనని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దానికోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నదనీ, నూతనంగా క్లీన్ అండ్ గ్రీన్ విద్యుత్ పాలసీని కూడా ప్రకటించామని చెప్పారు. 2024 మార్చి 8వ తేదీ రాష్ట్రంలో 15,623 మెగావాట్లు పీక్ డిమాండ్ వచ్చిందనీ, ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేకుండా సమర్థవంతంగా విద్యుత్ పంపిణీ చేశామని వివరించారు. హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాల్లోనూ పట్టణీకరణ విస్తరిస్తున్నదనీ, 2029-30 నాటికి 22,448 మెగావాట్ల పీక్ డిమాండ్ వస్తుందని అంచనా వేశామన్నారు. 2034-35 నాటికి రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం తర్వాత విద్యుత్ డిమాండ్ 31,809 మెగావాట్లకు చేరుతుందన్నారు. ఆ లక్ష్యాన్ని చేరేందుకు థర్మల్ పవర్‌తో పాటు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో ప్రపంచంతో పోటీపడుతూ కొత్త ఎనర్జీ పాలసీని రూపొందించామని వివరించారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 2035 నాటికి మరో 20వేల మెగావాట్లు మొత్తం 40వేల మెగావాట్లు సమకూర్చుకొనేలా విద్యుత్‌శాఖ కసరత్తు చేస్తుందని తెలిపారు. పైలట్ ప్రాజెక్టులుగా 25 గ్రామాలను ఎంపిక చేశామనీ, అక్కడ పూర్తిగా సోలార్ విద్యుత్‌ను వినియోగాన్ని ప్రయోగాత్మకంగా చేపడతామన్నారు. ఆ గ్రామాల్లోని వ్యవసాయ పంపుసెట్లు, ఇండ్లకు కూడా సోలార్ విద్యుత్‌నే అనుసంధానం చేస్తామనీ, అక్కడి ఫలితాలనుబట్టి దాన్ని రాష్ట్రం మొత్తానికి విస్తరిస్తామన్నారు. శనివారంనాడిక్కడి సచివాలయం సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్)లో 92 మందికి, టీజీ ట్రాన్స్‌కోలో 20 మంది నూతన జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పదేండ్లు గ్రూప్-1 పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు హైదరాబాద్ కోచింగ్ సెంటర్లకు వచ్చి శిక్షణ తీసుకున్నారనీ, వయసు పైబడిందే తప్ప, పరీక్ష మాత్రం నిర్వహించలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతినెలా నియామక పత్రాలను కుటుంబ సభ్యుల సమక్షంలో ఇస్తున్నామనీ, ఇప్పటి వరకు 56వేల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. మిగిలిన వారికి కూడా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, పోటీపరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగు లందరికీ ప్రభుత్వ ప్రయివేటు ఉద్యోగాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ఎక్కువ మొత్తం కేటాయిస్తుందనీ, రూ.5 వేల కోట్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం ఖర్చుచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ విద్యుత్ సవాళ్లను ఎదుర్కొనుందుకు సిద్ధంగా ఉన్నామనీ, రాష్ట్రంలో 28 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా నిరంతర విద్యుత్ అందిస్తున్నామన్నారు. 2004లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు వ్యవసాయ ఉచిత విద్యుత్ కోసం డిస్కంలకు రూ.8,729 కోట్లను చెల్లించామన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామనీ, దానికోసం ఇప్పటి వరకు రూ.1,485 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసిందన్నారు. ప్రతినెలా రూ.148 కోట్ల సొమ్మును విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లిస్తున్నామని తెలిపారు.

గడచిన పదేండ్ల పాలన అబద్ధాలమీదే జరిగిందనీ, ఆపార్టీ పుట్టుకే అబద్ధాల ప్రాతిపదికగా ఏర్పడిందంటూ బీఆర్ఎస్ పేరు ప్రస్తావించకుండా వ్యాఖ్యలు చేశారు. పదేండ్లు ఏమీ చేయకుండా, ఇప్పుడు ఇందిరమ్మరాజ్యంపై అపవాదులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో వారు చేసిన అప్పులు, ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూనే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయనీ, తాము అధికారంలోకి వచ్చాక ఒకటవ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామనీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామనీ,. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని వివరించారు. గత ప్రభుత్వం లక్షరూపాయల రైతు రుణమాఫీని నాలుగు వాయిదాల్లో చేస్తే, ఆ సొమ్ము వడ్డీలకే సరిపోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం వచ్చాక ఒకేసారి రూ.2 లక్షల వరకు మొత్తం రూ.21వేల కోట్లను ఒకేసారి రుణమాఫీ చేశామన్నారు. సాగుయోగ్యమైన భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇస్తామనీ, దానికోసం రూ.8,400 కోట్లు అవసమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. అలాగే భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఆర్థికసాయాన్ని ఈనెల 26నుంచి అందచేయబోతున్నామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులు ఇస్తున్నామనీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి, సంక్షేమ హాస్టళ్లకు డైట్ చార్జీలు పెంచామని తెలిపారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్, ఆర్థికశాఖల ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చామని చెప్పారు.

కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని గత పాలకులు అల్లకల్లోలం చేశారనీ, ఇప్పుడు మీడియా, సోషల్ మీడియా చేతిలో ఉన్నాయని ఇష్టం వచ్చినట్టు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ సిటీ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు పెట్టామన్నారు. ముఖ్యమంత్రి, ఐటీశాఖ మంత్రి దావోస్ పర్యటనలో భారీ ఎత్తున విదేశీ పెట్టుబడులు తెస్తున్నారని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు సంబంధించి లోన్లు, డిఏ చెల్లించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర అభివృద్ధి విద్యుత్‌శాఖతోనే ముడిపడి ఉంది. ఉద్యోగులు తమ జీవితాలను రాష్ట్ర అభివృద్ధి కోసం అంకితం చేస్తూ, స్థూల జాతీయోత్పత్తి పెంచే చర్యల కోసం కృషి చేయాలని చెప్పారు. ఆరోగ్య శాఖలో 108కు ఫోన్‌చేస్తే వైద్యబృందం ఎలాగైతే ఇంటి ముంగిటకు వస్తుందో అదే తరహాలో విద్యుత్‌శాఖకు చెందిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ప్రజలు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దానికోసం విద్యుత్‌శాఖలో ట్రాన్స్‌ఫార్మరు సహా ఇతర పరికరాలన్నీ ఉండేలా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామనీ, ప్రజల ఇండ్ల వద్దకే వచ్చి వారు సమస్యలు పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పొరుగు రాష్ట్రం నుంచి రావల్సిన నీరు, కరెంటును చర్చల ద్వారా తెచ్చుకుంటామన్నారు. విద్యుత్‌శాఖ వ్యవసాయానికి అనుబంధమై ఉంటుందనీ, సాగు విస్తీర్ణం ఎంత పెరిగిందనే లెక్కలు కాకుండా, ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నామో లేదో గమనించుకోవాలన్నారు. దేశంలోనే తెలంగాణ అత్యధిక పంటలు పండించిందనీ, అరనిముషం కూడా నిరంతర విద్యుత్‌కు ఆటంకం కలిగించొద్దనీ, రైతులను ఇబ్బంది పెట్టొద్దనీ విజ్ఞప్తి చేశారు. పదేండ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కబెడుతూనే రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. బడ్జెట్‌లో 35 శాతం వ్యవసాయశాఖకు కేటాయించారనీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు దేనికోసం దీక్షలు చేస్తున్నారో ప్రజలకు వివరించి చెప్పాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీజీట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభాస్కర్, జేఎమ్‌డీ శ్రీనివాసరావు, ఉత్తర, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎమ్‌డీలు వరుణ్‌రెడ్డి, ముషారఫ్ ఫారూఖీ పాల్గొన్నారు.

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో రన్నరప్‌గా నిలిచిన టీమ్ ఇండియా.. చాంపియన్స్ ట్రోఫీని సైతం రోహిత్ శర్మ సారథ్యంలోనే వేటాడనుంది. ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నప్పటికీ జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్‌లు జట్టులో నిలువగా.. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ తొలిసారి వన్డే జట్టులో చోటు సాధించాడు. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం.

జైస్వాల్‌కు పిలుపు

జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్‌లకు చోటు
చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు ఎంపిక

నవతెలంగాణ-ముంబయి

ఎటువంటి సంచలనాలకు తావు లేకుండా ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును ఎంపిక చేశారు. శనివారం ముంబయిలో సమావేశమైన సీనియర్ సెలక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఆసీస్‌తో ఐదో టెస్టులో గాయపడిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, గత నవంబర్‌లో హెర్నియా శస్త్రచికిత్స అనంతరం గ్రౌండ్‌లో అడుగుపెట్టని స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ సహా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ భారత జట్టులో నిలిచారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఓటమితో భారత డ్రెస్సింగ్‌రూమ్‌లో అలజడి రేగినా.. రోహిత్ శర్మకే మరోసారి కెప్టెన్సీ పగ్గాలు దక్కాయి. టీ20ల్లో అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్సీ ఇవ్వగా.. వన్డే ఫార్మాట్‌లో శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. చాంపియన్స్ ట్రోఫీ ముంగిట స్వదేశంలో ఇంగ్లాండ్‌తో భారత్ మూడు వన్డేలు ఆడనుంది.

సిరాజ్‌కు షాక్

ఇటీవల భారత క్రికెట్ సర్క్యూట్‌లో కీలక ఆటగాడిగా ఎదిగిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు చుక్కెదురైంది. కొంతకాలంగా అంచనాలను అందుకోని సిరాజ్‌ను సెలక్షన్ కమిటీ పక్కనపెట్టింది. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో సిరాజ్ నిరాశపరిచాడు. ఇంగ్లాండ్‌తో తొలి రెండు వన్డేలకు బుమ్రా దూరం కాగా.. అతడి స్థానంలో హర్షిత్ రానాను ఎంపిక చేశారు. కానీ సిరాజ్‌ను కనీసం ప్రత్యామ్నాయ పేసర్‌గా సైతం పరిగణించలేదు. చాంపియన్స్ ట్రోఫీ జట్టులో సిరాజ్‌కు చోటు దక్కలేదు. వికెట్ కీపర్ సంజు శాంసన్‌కు సైతం నిరాశే ఎదురైంది. రిషబ్ పంత్‌ను వికెట్ కీపర్‌గా ఎంపిక చేయగా.. బ్యాకప్‌గా కెఎల్ రాహుల్ జట్టులో ఉండనే ఉన్నాడు.



షమికి చోటు :

ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన మహ్మద్ షమికి సెలక్టర్లు పిలుపు అందింది. దేశవాళీ క్రికెట్‌లో ఫిట్‌నెస్‌తో పాటు ఫామ్ నిరూపించుకున్న షమిని ఇంగ్లాండ్‌తో టీ20, వన్డే సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేశారు. అర్షదీప్ సింగ్ మూడో పేసర్‌గా ఎంపిక కాగా.. జస్‌ప్రీత్ బుమ్రా జట్టులో నిలిచాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ సైతం సర్జరీ అనంతరం నేరుగా జట్టులోకి వచ్చాడు. ఈ ఫార్మాట్‌లో కుల్‌దీప్ పోషించగల పాత్ర దృష్ట్యా సెలక్షన్ కమిటీ అతడికి ఓటేసింది. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యతో పాటు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ నిలిచారు.

జైస్వాల్ వచ్చాడు

అద్భుత ఇన్నింగ్స్‌లతో విమర్శకుల మెప్పు పొందుతున్న యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ తొలిసారి వన్డే జట్టులోకి వచ్చాడు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లు ఉండగా.. యశస్వి జైస్వాల్ మూడో ఓపెనర్‌గా ఎంపికయ్యాడు. మిడిల్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ ఉన్నారు. కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ ఇటీవల మంచి ఫామ్‌లో ఉన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మాత్రమే బ్యాటింగ్ లైనప్‌లో ఫామ్‌లో లేని ఆటగాళ్లు.

బుమ్రాకు పరీక్ష!


పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ఆసీస్ పర్యటనలో గాయం బారిన పడిన సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు బుమ్రా ఐదు వారాల పాటు విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సమయంలో బౌలింగ్ చేయకూడదు. ఇంగ్లాండ్‌తో మూడో వన్డే ఫిబ్రవరి 12న జరుగనుంది. దీంతో ఇంగ్లాండ్‌తో చివరి వన్డేలో బుమ్రా ఫిట్‌నెస్ పరీక్ష కోసం బరిలోకి దిగనున్నాడు. చాంపియన్స్ ట్రోఫీకి తుది జట్టును ప్రకటించేందుకు ఫిబ్రవరి 11 ఆఖరు గడువు. ఒకవేళ, బుమ్రా ఆశించిన సమయానికి ఫిట్‌నెస్ సాధించకపోతే సెలక్షన్ కమిటీ మరోసారి సమావేశమై సరైన నిర్ణయం తీసుకోనుంది.

చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు :

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ షమి, అర్షదీప్ సింగ్.

క్వార్టర్స్‌లో నంద్యాల నరసింహారెడ్డి


హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్



హైదరాబాద్ : 20వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో నంద్యాల నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి సత్తా చాటుతున్నారు. పురుషుల 50 ప్లస్ సింగిల్స్‌లో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ప్రీ క్వార్టర్స్‌లో మహ్మద్ ఆసిఫ్‌పై అలవోక విజయం సాధించగా.. నరసింహారెడ్డి 8-7(0)తో సాయి గణేశ్‌పై ఉత్కంఠ మ్యాచ్‌లో పైచేయి సాధించాడు. సాంబశివా రెడ్డి 8-3తో శివ ప్రసాద్ రెడ్డి గెలుపొంది క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపాడు. లగడపాటి శ్రీధర్ 8-1తో రాజా రామ్ మోహన్‌పై అలవోక విజయం నమోదు చేశాడు. పురుషుల 60 ప్లస్ సింగిల్స్‌లో రామ్ రెడ్డి 8-0తో జవహర్‌పై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సికింద్రబాబ్ క్లబ్ వేదికగా దేశవ్యాప్తంగా 220 మంది వెటరన్ క్రీడాకారులు పోటీపడుతున్న ఈ టోర్నమెంట్‌లో ఆదివారం అన్ని విభాగాల్లో ఫైనల్స్ జరుగనున్నాయి.

గ్రామీణ క్రికెట్‌కు బోర్డు బాసట!

హెచ్‌సీఏకు బీసీసీఐ కార్యదర్శి హామీ



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి సహకారం అందిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియ హామీ ఇచ్చారు. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో శనివారం సైకియ సహా సీఈవో హేమంగ్ ఆమీన్‌లతో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కోశాధికారి శ్రీనివాస్ భేటీ అయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించే స్టేడియాలు, మౌళిక సదుపాయాల కల్పనకు బోర్డు నుంచి 50 శాతం నిధులను అందిస్తామని భరోసా అందించారు. రానున్న సీజన్‌లో భారత జట్టు మేనేజర్‌గా హెచ్‌సీఏ నుంచి అవకాశం ఇవ్వాలని కోరగా సైకియా సానుకూలంగా స్పందించినట్టు జగన్ తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886